PRAJASAKTI Regd.No. 15795/68
సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 45 సంచిక : 66 | విజయవాడ, మంగళవారం 7 అక్టోబర్ 2025 | 8 + 8 పేజీలు వెల : 5.50
Vol No | Vijayawada, Tuesday 7 October 2025 | Rs

జిఎస్‌టితో పెరిగిన చేనేతల ఆకలి చావులు

- పన్నుల రద్దుతోపాటు చేనేత పరిరక్షణకు సమగ్ర విధానం తేవాలి
- చేనేత కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలో మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు

3

తజ్మిన్ బ్రిట్స్ శతకం

8

కివీస్‌పై సఫారీల ఘన విజయం • మహిళల వన్డే ప్రపంచకప్

సిజెఐపై దాడి

బరితెగించిన మతోన్మాదులు

సుప్రీంకోర్టులో షూ విసిరిన న్యాయవాది

ప్రజాస్వామ్యంపై దాడి : ప్రతిపక్షాలు

తక్షణమే చర్య తీసుకోండి : సిపిఎం డిమాండ్



ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

మతోన్మాదులు బరితెగించారు. దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టులో సాక్షాత్తూ భారత ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) బిఆర్ గవాయ్‌పైనే ఓ మతోన్మాది షూ విసిరాడు. సోమవారం ఉదయం ఓ కేసు విచారణ సందర్భంగా ఈ ఘటన చోటు చేసుకుంది. సిజెఐ బిఆర్ గవాయ్, జస్టిస్ కె.వినోద్ చంద్రన్‌తో కూడిన ధర్మాసనంలో కేసు విచారణ సమయంలో డయాస్ వద్దకు వెళ్లిన న్యాయవాది రాకేష్ కిషోర్ ఒక్కసారిగా తన స్పోర్ట్స్ షూ తీసి, సిజెఐపైకి విసిరాడు. వెంటనే అప్రమత్తమైన భద్రతా సిబ్బంది లాయర్‌ని అడ్డుకుని బయటకి లాక్కెళ్లారు. అనంతరం పోలీసులకు అప్పగించారు. 'సనాతనానికి జరిగే అగౌరవాన్ని భారతదేశం సహించదు' అంటూ నిందితుడు గట్టిగా కేకలు వేశాడు. ఈ ఘటనతో కోర్టులో ఒక్కసారిగా గందరగోళం నెలకొంది.

ఇలాంటి బెదిరింపులు ప్రభావితం చేయలేవు : సిజెఐ

ఇలాంటి బెదిరింపులు తనను ప్రభావితం చేయలేవని సిజెఐ గవాయ్ స్పష్టం చేశారు. ఘటన జరిగిన వెంటనే స్పందించిన సిజెఐ... మిగతా లాయర్లు తమ వాదనలు కొనసాగించాలని ఆదేశించారు. ఇలాంటి వాటి పట్ల ఎవరూ ప్రభావితం కావొద్దని, తామేమీ చలించడం లేదని, ఇలాంటి ఘటనలు తనను ప్రభావితం చేయలేవని ఆయన పేర్కొన్నారు. సుప్రీంకోర్టు రిజిస్ట్రార్ జనరల్‌తో పోలీసులు సమన్వయం చేసుకుని ఈ విషయంపై తదుపరి దర్యాప్తు జరుపుతున్నారని ఆయా వర్గాలు తెలిపాయి.

ఖండించిన న్యాయవాద సంఘాలు, పార్టీలు

ఈ ఘటనను న్యాయవాద సంఘాలు, రాజకీయ పార్టీలు, ప్రముఖులు ఖండించారు. ఆలిండియా లాయర్స్ అసోసియేషన్ (ఐలు), సుప్రీంకోర్టు అడ్వకేట్స్ ఆన్ రికార్డ్ అసోసియేషన్ (ఎస్‌సిఎఒఆర్ఎ) తదితర సంఘాలు తీవ్రంగా ఖండించాయి. ఈ ఘటనను సిపిఎం పొలిట్ బ్యూరో తీవ్రంగా ఖండించింది. తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది.

విద్వేషానికి ప్రతిబింబం : పినరయి విజయన్

సంఘ్‌పరివార్ వ్యాప్తిచేసిన విద్వేషానికి ప్రతిబింబమే ఈ భయంకరమైన సంఘటన అని కేరళ సిఎం పినరయి విజయన్ విమర్శించారు. సిజెఐకి సంఘీభావంగా నిలవాలని పిలుపునిచ్చారు.

రాజ్యాంగంపై దాడి : కాంగ్రెస్

సిజెఐపై దాడిని ఖండించడానికి మాటలు సరిపోవని కాంగ్రెస్ పార్లమెంటరీ అధ్యక్షురాలు సోనియాగాంధీ పేర్కొన్నారు. ఆయనపైనే కాదు, మిగతా 7లో

సమావేశంలో మాట్లాడుతున్న బి.రాఘవులు, పక్కన వి.శ్రీనివాసరావు

2 దశల్లో బీహార్ ఎన్నికలు

బీహార్ అసెంబ్లీ ఎన్నికలకు నగారా మోగింది. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) చేపట్టిన తరువాత జరుగుతున్న తొలి ఎన్నికలివి. ఆధార్, ఎన్నికల కార్డులను కూడా ఎస్ఐఆర్ ధ్రువీకరణ పత్రాల్లో చేర్చాలన్న సుప్రీంకోర్టు ఆదేశాల తరువాత కూడా బీహార్‌లో 68.5 లక్షల ఓటర్లను తొలగించారు. 7లో

షెడ్యూల్ ఇదే

	మొదటి దశ	రెండో దశ
1. నోటిఫికేషన్ విడుదల	అక్టోబరు 10	అక్టోబరు 13
2. నామినేషన్ల దాఖలు గడువు	అక్టోబరు 17	అక్టోబరు 20
3. నామినేషన్ల పరిశీలన	అక్టోబరు 18	అక్టోబరు 21
4. నామినేషన్ల ఉపసంహరణ	అక్టోబరు 20	అక్టోబరు 23
5. పోలింగ్	నవంబరు 6	నవంబరు 11
6. ఓట్ల లెక్కింపు		నవంబరు 14

పావలా వడ్డీకి విద్యారుణాలు

- రెసిడెన్షియల్ పాఠశాలలుగా హాస్టళ్లు
- సంక్షేమ శాఖల సమీక్షలో సిఎం చంద్రబాబు



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విదేశాల్లో గ్రాడ్యుయేషన్, పోస్ట్ గ్రాడ్యుయేషన్ చదవాలనుకునే ప్రతి విద్యార్థికి పావలా వడ్డీకే బ్యాంకు రుణాలు ఇచ్చేలా సరికొత్త పథకాన్ని రూపొందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి, ఇబిసి, మైనార్టీ, దివ్యాంగ సంక్షేమంపై రాష్ట్ర సచివాలయంలో సోమవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎలాంటి పరిమితి లేకుండా, ఎంతమంది విద్యార్థులైనా చదువుకునే వీలుండాలని అన్నారు. ఎన్నికల సమయంలో ప్రతిపక్షంలో ఉండగా 'కలలకు రెక్కలు తొడుగుదాం' అనే కార్యక్రమం ద్వారా ప్రొఫెషనల్ కోర్సులు చదివే విద్యార్థినులకు ప్రభుత్వమే వడ్డీ చెల్లించే విధంగా బ్యాంకుల ద్వారా రుణం ఇప్పిస్తామని చంద్రబాబు హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. ఆ పథకాన్ని ఈ సమీక్షలో సిఎం ప్రస్తావించారు. విదేశాలతో పాటు దేశంలో ఐఐటి,, ఐఐఎం, నీట్ వంటి ఉన్నత విద్య చదవాలనుకునే వారికి కూడా ఈ పథకం వర్తింపచేయాలని ఆయన అధికారులకు సూచించారు. ఇందులో 4శాతం వడ్డీకే బ్యాంకు రుణాలు ఇవ్వడంతో పాటు, దానికి ప్రభుత్వం గ్యారంటీ ఇస్తుందని సిఎం చెప్పారు. బిసి విద్యార్థులకు ఐఐటీ, నీట్‌లో కోచింగ్ కోసం రాష్ట్రంలోని రెండు ప్రాంతాల్లో శిక్షణా కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న అన్ని హాస్టళ్లను రెసిడెన్షియల్ పాఠశాలలుగా మార్చేందుకు అధ్యయనం చేసి సమగ్ర నివేదిక సమర్పించాలని ఆదేశించారు. ప్రతి పేద విద్యార్థికి నాణ్యమైన విద్య అందించాలనేది తన సంకల్పమని, అధికారులు ఇందుకోసం కృషి చేయాలని చెప్పారు. హాస్టళ్లను రెసిడెన్షియల్ పాఠశాలలుగా అప్‌గ్రేడ్ చేయడం ద్వారా విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడం సాధ్యమవుతుందన్నారు. ఎస్సి,ఎస్టి, బిసి హాస్టళ్లలో మౌలిక వసతులు, సౌకర్యాల కల్పనతో పాటు ఏడాదిలోగా మరమ్మతులు పూర్తి చేయాలని ఆదేశించారు. గురుకులాల్లో హైజీన్ పరిస్థితులు ఉండేలా చూడాలని, విద్యార్థుల ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలని నిర్దేశించారు. అన్ని రెసిడెన్షియల్ పాఠశాలలు, హాస్టళ్లలో సౌర విద్యుత్ ఉత్పత్తికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

'వన్ ఫ్యామిలీ-వన్ ఎంట్రప్రెన్యూర్'

'వన్ ఫ్యామిలీ-వన్ ఎంట్రప్రెన్యూర్' విధానాన్ని అమలు చేసే బాధ్యత సంక్షేమ శాఖలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ లక్ష్యం నెరవేరితే ఆయా వర్గాలు ఆర్థికంగా బలోపేతమయ్యేందుకు దోహదపడుతుందని చెప్పారు. ఇమామ్, పాస్టర్లకు బకాయిలు ఉంటే వెంటనే విడుదల చేయాలని, హజ్ యాత్రకు దరఖాస్తుల గడువును పెంచేందుకు అవకాశం కల్పించాలని సూచించారు. ఉమ్మడి రాష్ట్రంలో వక్ఫ్ ప్రాపర్టీ ఆడిట్ జరిగిందని, మిగతా 5లో

జిఎస్‌టిపై అసంతృప్తిని చల్లార్చేందుకే..

- మోడీ పర్యటనపై బివి రాఘవులు
- రాష్ట్రానికి నష్టపరిహారం ప్రకటించాలని డిమాండ్
- మోడీ పర్యటన సందర్భంగా నిరసనలు : వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కేంద్రం తీసుకొచ్చిన కొత్త జిఎస్‌టితో రూ.90 వేల కోట్ల నష్టం వస్తుందని, దీనిలో 70 శాతం రాష్ట్రాలే భరించాలని దీనిపై వస్తున్న వ్యతిరేకతను చల్లార్చేందుకే ప్రధాని మోడీ రాష్ట్రానికి వస్తున్నారని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు అన్నారు. విజయవాడలోని బాలోత్సవ భవన్లో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావుతో కలిసి ఆయన మాట్లాడుతూ రాష్ట్రాలు భారం భరించడమంటే దాని అర్థం ప్రజలపై మోపడమేనని చెప్పారు. దీనిని దృష్టిలో ఉంచుకుని ఈ నెల 16న ఉమ్మడి కర్నూలు జిల్లాకు వస్తున్న ప్రధాని దృష్టికి రాష్ట్రానికి జరిగిన అన్యాయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తీసుకు వెళ్లాలని, సూచించారు. కొత్తగా తీసుకొచ్చిన జిఎస్‌టి విధానంపై ప్రజాధనాన్ని వినియోగించి ప్రభుత్వ అధికారులతో ప్రచారం చేయిస్తున్నారని చెప్పారు. గతంలో కేంద్రం చేపట్టిన డిమానిటైజేషన్ వల్ల పెద్దఎత్తున వ్యతిరేకత వచ్చిందని, ఇప్పుడు జిఎస్‌టి వల్ల కూడా అంతే వ్యతిరేకత వస్తోందన్నారు. దీనివల్ల అన్ని రాష్ట్రాలూ తీవ్రంగా నష్టపోతున్నాయని చెప్పారు. దీన్నుండి బయటపడేందుకు, గతంలో జరిగిన నష్టం మరలా జరగకుండా అసంతృప్తి పెరగకుండా చూసుకునేందుకు రాష్ట్రాల్లో పర్యటిస్తున్నారని తెలిపారు. వాస్తవానికి జిఎస్‌టి వల్ల అన్ని రాష్ట్రాలు తీవ్రంగా నష్టపోతున్నాయని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌కు ఎనిమిది వేల కోట్ల రూపాయలు నష్టం వస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రకటించిన విషయాన్ని రాఘవులు గుర్తు చేశారు. కేరళ, తమిళనాడు, కర్నాటక వంటి రాష్ట్రాలు కూడా ఎక్కువగా నష్టపోతున్నాయని వివరించారు. బిజెపి పాలిత ఉత్తరప్రదేశ్ రూ.13 వేల కోట్ల నుండి మిగతా 7లో

నేడు పలు ప్రాంతాల్లో వర్షాలు

- విపత్తుల నిర్వహణ సంస్థ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఉపరితల ద్రోణి ప్రభావంతో మంగళవారం రాష్ట్రంలోని పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ పేర్కొంది. ఈ మేరకు ఆ సంస్థ సోమవారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఈ నెల 7న శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, ఏలూరు, కృష్ణా, ఎన్‌టిఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు, అనంతపురం, శ్రీసత్యసాయి, వైఎస్ఆర్ కడప, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన వర్షాలు పడతాయని తెలిపారు.

రాజస్థాన్‌లో ఘోరం

జైపూర్ ప్రభుత్వ ఆస్పత్రి ఐసియులో చెలరేగిన మంటలు

8మంది మృతి, ముగ్గురి పరిస్థితి విషమం

ఉన్నత స్థాయి దర్యాప్తు కమిటీకి ఆదేశాలు

ప్రమాదం జరిగిన ఆస్పత్రిలో గాయపడిన రోగిని చికిత్సకు తరలిస్తున్న సిబ్బంది

జైపూర్ : రాజస్థాన్‌లో ఘోరం జరిగింది. జైపూర్‌లోని అతిపెద్ద ప్రభుత్వ ఆస్పత్రి అయిన సవాయ్ మాన్‌సింగ్ (ఎస్ఎంఎస్) ఆస్పత్రిలోని ట్రామా సెంటర్ ఐసియులో పెద్దఎత్తున మంటలు చెలరేగడంతో ముగ్గురు మహిళలుసహా ఎనిమిది మంది రోగులు ప్రాణాలు కోల్పోయారు. మరో ముగ్గురి పరిస్థితి విషమంగా వుంది. ఆదివారం రాత్రి పొద్దుపోయిన తర్వాత ఈ దుర్ఘటన చోటు చేసుకుంది. రాత్రి 11.20గంటల సమయంలో ఐసియులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఐసియు వార్డులోని స్టోర్ రూమ్‌లో షార్ట్ సర్క్యూట్ ఈ దుర్ఘటనకు కారణమై వుంటుందని అధికారులు అనుమానిస్తున్నారు. ఈ స్టోర్ రూమ్‌లో కాగితాలు, వైద్య సామాగ్రి, బ్లడ్ శాంపుల్స్ ట్యూబులు వున్నాయి. ఒక్కసారిగా పెద్దఎత్తున లేచిన మంటలు క్షణాల్లో వార్డును చుట్టుముట్టేశాయి. దాంతో ఆ వార్డంతా పొగ కమ్ముకుంది. రోగులు భయకంపితులయ్యారు. ఈ సంఘటన చోటు చేసుకున్న సమయంలో ఐసియులో, సెమీ ఐసియులో 18మంది రోగులు వున్నారు. అందులో 11మంది ఒకే వార్డులో వున్నారు. అక్కడే మంటలు తలెత్తాయి. సమాచారం అందిన వెంటనే అగ్నిమాపక దళ అధికారులు వచ్చినా అగ్నికీలలు, దట్టమైన పొగ సహాయక చర్యలకు ఆటంకం కలిగించాయి. కుటుంబ సభ్యులు, ఆస్పత్రి సిబ్బంది సహాయంతో కిటికీలు, తలుపులు బద్దలు కొట్టి చాలామంది రోగులను కాపాడారు. వీధిలో పరిచిన పరుపులపై వెంటనే రోగులను పడుకోబెట్టి, వారికి ఫస్ట్ ఎయిడ్‌గా ఆక్సిజన్‌ను అందించారు. ఈ ఘటనతో ఆస్పత్రిలో తీవ్ర గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. ఐసియులో విషమంగా వున్న రోగులను తరలించడానికి సిబ్బంది చాలా శ్రమపడాల్సి వచ్చింది. మంటలను అదుపు చేయడానికి గంటన్నర పట్టింది. ట్రామా సెంటర్ నోడల్ అధికారి డాక్టర్ అనురాగ్ థకడ్ మాట్లాడుతూ, ఆరుగురు రోగులు మంటల్లో చిక్కుకుపోయారని తెలిపారు.

ఆస్పత్రి భద్రతా ఏర్పాట్లపై అనుమానాలు

ఈ సంఘటనతో ఆస్పత్రిలోని భద్రతా ఏర్పాట్లపై తీవ్రమైన సందేహాలు, మిగతా 7లో

భూ సేకరణపై రైతుల ఆగ్రహం

- హిందూపురంలో రోడ్డెక్కిన అన్నదాతలు



భూములు ఇవ్వబోమంటూ రాస్తారోకో చేస్తున్న రైతులు

ప్రజాశక్తి- హిందూపురం

పరిశ్రమల పేరుతో నిబంధనలకు విరుద్ధంగా భూ సేకరణకు సిద్ధం కావడంపై రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎలాంటి సమాచారమూ ఇవ్వకుండానే సాగు భూములను లాక్కోవాలని చూస్తూ ప్రభుత్వం తమకు తీవ్ర అన్యాయం చేయాలని చూస్తోందంటూ పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. దీనిపై అధికారులను ప్రశ్నించారు. రహదారిపై బైఠాయించి రాస్తారోకో చేశారు. శ్రీసత్యసాయి జిల్లా హిందూపురం మండలం మలగూరు, నందమూరి నగర్, నీరుకుంటపల్లి, రాచేపల్లి, చలివెందుల, లేపాక్షి మండలం కొండూరు, సోమందేపల్లి మండలం నడింపల్లి గ్రామాల పరిధిలో దాదాపు 1,118 మంది రైతులకు చెందిన 2,191 ఎకరాల భూములను భూ సేకరణ చట్టం ద్వారా లాక్కోవడానికి ప్రభుత్వం సిద్ధమైంది. ఇందులో భాగంగా సోమవారం మలగూరు సాంఘిక సంక్షేమ శాఖ పాఠశాల ఆవరణలో రైతులతో రెవెన్యూ అధికారులు సమావేశం నిర్వహించారు. పైగ్రామాల రైతులందరూ తమ పట్టాదారు పాసుపుస్తకాలు, బ్యాంకు పాసుపుస్తకాలు, ఆధార్ కార్డుల జెరాక్స్ కాపీలు ఇవ్వాలని అధికారులు చెప్పారు. ఎందుకోసం భూములు సేకరిస్తున్నారు? ఎంత భూమి సేకరిస్తున్నారు? ఎకరాకు ఎంత పరిహారం ఇస్తారు? తదితర వివరాలను రైతులు అడిగినా అధికారులు స్పష్టమైన సమాచారం ఇవ్వలేదు. పరిశ్రమల కోసం భూములను సేకరించాలని ప్రభుత్వం చెప్పిందని, అందులో భాగంగా ఇక్కడికి వచ్చామని వారు సమాధానం ఇచ్చారు. ఏ పరిశ్రమ ఏర్పాటు చేస్తారో తెలియకుండా భూముల సేకరణకు ఎందుకొచ్చారంటూ అధికారులను రైతులు నిలదీశారు. పూర్తి వివరాలు తెలియజేయకుండా తమ భూములు ఎలా తీసుకుంటారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ భూములను పరిశ్రమల కోసం తీసుకుంటున్నారా? లేదా అంబాని, అదానిలకు కట్టబెట్టడానికి తీసుకుంటున్నారా? అని నిలదీశారు. తమ భూములు ఇచ్చేది లేదంటూ తేల్చి చెప్పారు. అనంతరం అక్కడి నుంచి ర్యాలీగా వెళ్లి హిందూపురం-గోరంట్ల రహదారిపై బైఠాయించారు. భూ సేకరణకు, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తమ సాగు భూములు ఎట్టి పరిస్థితుల్లోనూ ఇవ్వబోమని, కుటుంబ జీవనాధారమైన సాగు భూములను తమ ప్రాణాలు అడ్డుపెట్టైనా కాపాడుకుంటామని స్పష్టం చేశారు. దీంతో, అధికారులు వెనుదిరిగారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు సిద్ధారెడ్డి, టిడిపి నాయకులు చెన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బంగారం @ రూ.1.30 లక్షలు

- ఒకే రోజు రూ.9,700 పెరుగుదల

న్యూఢిల్లీ : బంగారం ధరలు భగ్గుమంటున్నాయి. ఒక్క పూటలోనే రూ.9,700 పెరిగి.. మధ్యతరగతి ప్రజలు కూడా కొనలేని స్థాయికి ఎగిసింది. సోమవారం న్యూఢిల్లీ బులియన్ మార్కెట్‌లో 10 గ్రాముల బంగారంపై రూ.9,700 ప్రియమై సరికొత్త రికార్డ్ స్థాయి రూ.1,30,300కు చేరింది. అంతర్జాతీయ ద్రవ్య మార్కెట్‌లో రూపాయి మారకం విలువ పడిపోవడానికి తోడు భౌగోళిక ఆందోళనలు, అమెరికా ప్రభుత్వ షట్‌డౌన్ నేపథ్యంలో బంగారం సురక్షిత పెట్టుబడిగా పరిగణించడంతో ఈ లోహం ధర పెరుగుతోందని బులియన్ నిపుణులు పేర్కొంటున్నారు. ఆలిండియా సరాఫా అసోసియేషన్ ప్రకారం.. శుక్రవారం 99.9 శాతం స్వచ్ఛత కలిగిన 10 గ్రాముల బంగారం ధర రూ.1,20,600 వద్ద ముగిసింది. సోమవారం స్థానిక బులియన్ మార్కెట్లో 99.5 శాతం స్వచ్ఛత కలిగిన బంగారం ధర రూ.2,700 పెరిగి రూ.1,22,700 (అన్ని పన్నులతో సహా) రికార్డు స్థాయిని తాకింది. గత మార్కెట్ సెషన్‌లో ఇది రూ. 1,20,000 వద్ద ముగిసింది. అమెరికన్ డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ పతనం కావడం బంగారం ధరల పెరుగుదలకు ప్రధాన కారణమని మార్కెట్ వర్గాలు తెలిపాయి.

వైద్యశాస్త్రంలో ముగ్గురికి నోబెల్

రోగ నిరోధక వ్యవస్థలో కొత్త ఆవిష్కరణలకు పురస్కారం

ఇ.బ్రుంకోవ్ | ఫ్రెడ్ రామ్స్‌డెల్ | షిమోన్ సకాగుచి

స్టాక్‌హోం : రోగ నిరోధక వ్యవస్థకు సంబంధించిన కొత్త ఆవిష్కరణలకు ఈ ఏడాది వైద్య శాస్త్రంలో నోబెల్ బహుమతి ముగ్గురిని వరించింది. జపాన్‌కు చెందిన షిమోన్ సకాగుచి, అమెరికాకు చెందిన మేరీ ఇ.బ్రుంకోవ్, ఫ్రెడ్ రామ్స్‌డెల్‌లు ఈ బహుమతిని పంచుకోనున్నారు. రోగ నిరోధక వ్యవస్థలో సెక్యూరిటీ గార్డులుగా పిలిచే రెగ్యులేటరీ టి కణాలను వీరు గుర్తించారు. రోగ నిరోధక కణాలు మన శరీరంపైనే దాడి చేయకుండా ఈ టి కణాలు అడ్డుకుంటాయని వారు గుర్తించారు. రోగ నిరోధక వ్యవస్థ ఎలా పని చేస్తుంది, మనందరిలోనూ తీవ్రమైన ఆటో ఇమ్యూన్ వ్యాధులు ఎందుకు వృద్ధి చెందవో అర్థం చేసుకోవడానికి ఈ ఆవిష్కరణలు బాగా ఉపయోగపడతాయని నోబెల్ కమిటీ ఛైర్మన్ ఓలె కాంపె వ్యాఖ్యానించారు. ఆటో ఇమ్యూన్ వ్యాధులు, కేన్సర్లకు కొత్త చికిత్సలను అభివృద్ధిపరచడానికి ఈ ఆవిష్కరణలు ఉపయోగపడతాయని భావిస్తున్నారు. ఆటో ఇమ్యూన్ వ్యాధుల నుండి శరీరాన్ని రక్షించే రోగ నిరోధక కణాలను షిమోన్ సకగుచి తొలుత 1995లో కనుగొన్నారు. ఆ తర్వాత 2011లో ఆ కణాలు పనిచేయడానికి కీలకమైన జన్యువును అమెరికన్ పరిశోధకులు మేరీ, ఫ్రెడ్ కనుగొన్నారు. రెండేళ్ల తర్వాత సకగుచి ఈ ఆవిష్కరణలన్నింటినీ అనుసంధానిస్తూ తాను గుర్తించిన ఈ టి కణాల అభివృద్ధికి ఫాక్స్ పి3 జన్యువు కారణమవుతోందని రుజువు చేశారు. ముందుగా వైద్య శాస్త్రంలో నోబెల్ బహుమతిని ప్రకటించడంతో ఇక వరుసగా ఈ వారమంతా వివిధ విభాగాల్లో నోబెల్ బహుమతులు ప్రకటిస్తారు. చివరిగా నోబెల్ శాంతి బహుమతి ప్రకటన వెలువడుతుంది. వీరందరికీ డిసెంబరు 10న బహుమతి ప్రదానం వుంటుంది.

మద్యం కేసులో మిథున్‌రెడ్డికి నోటీసులు

ప్రజాశక్తి - అమరావతి

మద్యం కేసులో నిందితుడిగా ఉన్న ఎంపి మిథున్‌రెడ్డికి విజయవాడ ఎసిబి కోర్టు బెయిల్ మంజూరు చేయడాన్ని సిఐడి సిట్ సవాల్ చేసిన కేసును హైకోర్టు సోమవారం విచారించింది. మిథున్‌రెడ్డికి నోటీసులు జారీ చేసింది. విచారణను ఈ నెల 9కి వాయిదా వేస్తూ జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప ఆదేశాలు వెలువరించారు. ఎసిబి కోర్టు ఇచ్చిన బెయిల్ ఉత్తర్వుల్లోని అంశాలను తాత్కాలికంగా నిలుపుదల చేయాలన్న సిట్ తరపున సిఐడి ఆదనపు ఎస్‌పి న్యాయవాది చేసిన వినతిని తిరస్కరించారు. సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా వాదిస్తూ.. మిథున్‌రెడ్డికి ఎసిబి కోర్టు ఏకపక్షంగా క్లీన్‌చిట్ ఇచ్చిందన్నారు. నిజాయతీపరుడనే తీరులో ఉత్తర్వులు ఉన్నాయన్నారు. కేసు దర్యాప్తునకు ప్రతికూల ప్రభావం ఏర్పడుతుందన్నారు. ఎసిబి కోర్టు ఉత్తర్వులను ఈ దశలో జోక్యం చేసుకోలేమన్న హైకోర్టు విచారణను వాయిదా వేసింది.

మాట్లాడుతున్న రామకృష్ణ

వెనుకబడిన కులాల అభ్యున్నతికి కులగణన

- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్

ప్రజాశక్తి- కలెక్టరేట్ (విశాఖపట్నం)

సమాజంలో వెనుకబడిన కులాల అభ్యున్నతికి ఆంధ్రప్రదేశ్‌లో జన గణనతో పాటు కుల గణన చేపట్టాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. బిసి సంఘాలు, రాజకీయ పార్టీలతో విశాఖలోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.వి.సత్యనారాయణ మూర్తి అధ్యక్షతన సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కె.రామకృష్ణ మాట్లాడుతూ కులగణన జరిగితేనే కులాల వారీగా జనాభా, సామాజిక స్థితిగతులు తెలుస్తాయన్నారు. ఆ డేటా మేరకు వారి అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించొచ్చని చెప్పారు. రాష్ట్రంలో 143 బిసి కులాలు ఉంటే పది, పన్నెండు కులాలకు చెందిన వారు మాత్రమే అభివృద్ధి చెందారన్నారు. మిగిలిన కులాలవారు ఇంకా వెనుకబడే ఉన్నారని తెలిపారు. ఆ కులాల్లో ఒక్కరు కూడా ఎమ్మెల్యే గాని, ఎంపి గాని అవలేదని తెలిపారు. బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు, ప్రధాన కార్యదర్శి ఎర్ని శ్రీనివాసరావు మాట్లాడుతూ, బడుగు బలహీన వర్గాలు ఐక్యంగా రిజర్వేషన్లు సాధించుకుంటేనే రాజకీయాలలో ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చని అన్నారు. అనంతరం నగరాల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు జగపిళ్ల అప్పలరాజు, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్‌కెఎస్‌వి.కుమార్, యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు అక్కరమాని వెంకటరావు, ఉత్తరాంధ్ర బిసి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కె.వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ నాయకుడు ఎస్.సుధాకర్ తదితరులుమాట్లాడారు. ఈ కార్యక్రమంలో బిసి సంఘం రాష్ట్ర కన్వీనర్ కట్టా మల్లేశ్వరరావు, వాడబలిజ సంక్షేమ సంఘం నాయకుడు వాసుపల్లి జానకీరాం, బిసి సంఘం నాయకులు డాక్టర్ బిసిఎస్.కల్యాణ్, ఎం సిపిఐ యు నాయకుడు ఎంవిఎన్.ఆర్ పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501కు కానీ
editorprajasakthi@gmail.comకు పంపవచ్చు.

గవాయిపై దాడి దుర్మార్గం

- సిపిఎం ఆధ్వర్యాన నిరసన

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయిపై మతోన్మాదుల దాడి అన్యాయమని సిపిఎం ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి డి.వి.కృష్ణ అన్నారు. గవాయిపై దాడికి నిరసనగా సోమవారం సాయంత్రం బందరురోడ్డులోని రాఘవయ్యపార్కు వద్ద సిపిఎం ఆధ్వర్యాన నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా డి.వి.కృష్ణ మాట్లాడుతూ మతోన్మాదులు ఆగడాలు పెరిగిపోతున్నాయని తెలిపారు. సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తిపైనే దాడికి తెగబడేంత ధైర్యం చేశారని అన్నారు. పరిస్థితులు ఇలాగే ఉంటే ప్రజాస్వామ్యానికి రక్షణ ఏముంటుందని ప్రశ్నించారు. ఇలాంటి దాడులను ఖండించాలని కోరారు. సనాతన ధర్మం పేరుతో ఎవరిపైబడితే వారిపై దాడి చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్ మాట్లాడుతూ మతోన్మాదులు ఉన్మాద చర్యలు పెరిగిపోతున్నాయని, అడ్డూఅదుపు లేకుండా వ్యవహరిస్తున్నారని అన్నారు. ఇప్పటి వరకూ మైనార్టీలు, దళితులను టార్గెట్ చేసిన వారు నేరుగా ఇప్పుడు సుప్రీం కోర్టునే ప్రశ్నిస్తున్నారని అన్నారు. ఇటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు డి.సుబ్బారావు, వి.కృష్ణయ్య, కె.ధనలక్ష్మి, నిర్మల, వై.నరసింహారావు, రైతు సంఘం నాయకులు ఎం.హరిబాబు, విజయవాడ నగర పాలక సంస్థ ఫ్లోర్‌లీడర్ బోయి సత్యబాబు తదితరులు పాల్గొన్నారు.

నిరసనలకు డిఎస్‌ఎంఎం, కెవిపిఎస్ పిలుపు

సనాతన ధర్మానికి వ్యతిరేకంగా మాట్లాడారని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయ్‌పై చెప్పు విసిరేందుకు ప్రయత్నించిన న్యాయవాది కిషోర్‌పై కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని దళిత శోషన్ ముక్తి మంచ్ (డిఎస్‌ఎంఎం), కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) డిమాండ్ చేశాయి. ఈ దుర్మార్గమైన ఘటనపై రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు తెలపాలని డిఎస్‌ఎంఎం జాతీయ నాయకులు వి శ్రీనివాసరావు, కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంద్ర మాల్యాద్రి సోమవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్య దేశంలో స్వేచ్ఛగా తమ అభిప్రాయాలు చెప్పేందుకు అవకాశం లేకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. అత్యున్నత పదవుల్లో ఉన్నవారికే ఇలాంటి అవమానాలు జరిగితే సామాన్య ప్రజల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. సనాతన ధర్మం పేరుతో కుల వ్యవస్థను పెంచేందుకు మనువాద మతోన్మాద శక్తులు ప్రయత్నిస్తున్నాయని తెలిపారు. ఈ దుర్మార్గమైన ఆలోచనతోనే ఇటువంటి దాడులు జరుగుతున్నాయన్నారు. ప్రభుత్వాలు ఇటువంటి చర్యలను అరికట్టే ప్రయత్నం చేయకపోగా, వారిని కాపాడే ప్రయత్నం చేయడం వల్లనే ఇలాంటి దుర్మార్గాలు పెరుగుతున్నాయని పేర్కొన్నారు.

దోషులపై కఠిన చర్యలు తీసుకోండి
సిపిఎం రాష్ట్ర కమిటీ డిమాండ్

సనాతన ధర్మానికి అవమానం జరిగిందన్న పేరుతో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్. గవాయ్‌పై మతోన్మాద అడ్వకేట్ ఒకరు కోర్టులో అందరూ చూస్తుండగానే చెప్పు విసరడం దేశంలో నెలకొన్న దుస్థితికి అద్దం పడుతోందని సిపిఎం రాష్ట్ర కమిటీ పేర్కొంది. దీనికి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. రెండురోజులపాటు విజయవాడలో జరిగిన రాష్ట్ర కమిటీ సమావేశాల్లో ఈ మేరకు చేసిన తీర్మానాన్ని సోమవారం మీడియాకు విడుదల చేశారు. మోడీ పాలనలో మతోన్మాదులు అన్ని వ్యవస్థలను ఇప్పటివరకు ధ్వంసం చేస్తూ వచ్చారని, ఇప్పుడు బహిరంగంగా సనాతనధర్మ పరిరక్షణ పేరుతో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి పైనే చెప్పు విసరడం రాజ్యాంగానికి, దేశ ప్రజలకు అవమానమని ఈ తీర్మానంలో పేర్కొన్నారు. ఇదే సనాతన ధర్మమని ప్రధాన మంత్రి భావిస్తున్నారా అని ప్రశ్నించారు. దీనిపై ప్రధానమంత్రి జాతికి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సనాతన ధర్మం పేరుతో ప్రచారం చేస్తున్న పవన్ కల్యాణ్ దీన్ని బలపరుస్తారా వ్యతిరేకిస్తారో కూడా చెప్పాలని కోరారు. ఇలాంటి ఘటనలే సనాతన ధర్మం యొక్క అసలు రూపాన్ని వ్యక్తపరుస్తున్నాయని, కేవలం దళితుల నుండి ఉన్నతస్థాయికి ఎదిగిన గవాయ్ లాంటి వారిని చూసి సహించలేక చేసిన అగ్రకుల మతోన్మాద చర్యగా ఈ దాడిని సిపిఎం పేర్కొంది. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా సనాతన ధర్మవాదులను అరికట్టాలని డిమాండ్ చేసింది.

నకిలీ మద్యంపై కఠిన చర్యలు

- టిడిపి ఎమ్మెల్సీ అనురాధ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

నకిలీ మద్యంపై కూటమి ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుందని టిడిపి ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ తెలిపారు. టిడిపి కార్యాలయంలో సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. తప్పు చేస్తే ఎంతటివారికైనా వదిలే ప్రసక్తే లేదన్నారు. గత ఐదేళ్ల కల్తీ మద్యం సరఫరా చేసి జైలుపాలైన వైసిపి నేతలను ఆ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎందుకు సస్పెండ్ చేయలేదని ప్రశ్నించారు. ఇప్పుడు ప్రభుత్వంపై జగన్ బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఎన్నికల ముందు వైసిపి కోవర్టులు పార్టీలో చేరారని తెలిపారు. గతంలో విజయవాడలో వైసిపి నేత మల్లాది విష్ణుకు చెందిన బార్‌లో కల్తీ మద్యం తాగి ఆరుగురు ప్రాణాలు కోల్పోతే ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. జంగారెడ్డి గూడెంలో 27 మంది కల్తీ మద్యం తాగి ప్రాణాలు కోల్పోతే అసెంబ్లీ సాక్షిగా జగన్ ఏమి మాట్లాడారో గుర్తు లేదా? అని ప్రశ్నించారు. వైసిపి నేతలు మెడికల్ కళాశాలల అంశంపై వాస్తవాలను వక్రీకరించి అబద్ధాలతో ప్రజల్ని మభ్య పెడుతున్నారని టిడిపి ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ మరో సమావేశంలో అన్నారు. వైసిపి నేతలు 17 కళాశాలలు నడుస్తున్నాయంటున్నారని, కానీ ఎక్కడ నడుస్తున్నాయో ప్రజలకు చూపించలేకపోతు న్నారని పేర్కొన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ విషయంలో కూడా వైసిపి మాటలు ఒకలా, పనులు మరోలా ఉన్నాయని తెలిపారు. వైసిపి అబద్ధాల పునాదిగా, అసత్యాలే ఎజెండాగా నడిచే పార్టీ అని బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ బుచ్చి రామ్‌ప్రసాద్ విమర్శించారు.

నకిలీ మద్యం వ్యవహారమంతా నాదే

- ఏ రాజకీయ నాయకులకూ సంబంధం లేదు
- విదేశాల నుంచి ఫోన్‌లో స్పందించిన ప్రధాన నిందితుడు జనార్ధన్‌రావు

ప్రజాశక్తి - ములకలచెరువు (కడప జిల్లా)

తంబళ్లపల్లె నియోజకవర్గం ములకలచెరువు, ఇబ్రహీంపట్నంలో దొరికిన నకిలీ మద్యం వ్యవహారం మొత్తం తనదేనని ఇందులో తంబళ్లపల్లి నియోజకవర్గంలోని ఏ రాజకీయ నాయకునికీ సంబంధం లేదని నకిలీ మద్యం కేసులో ప్రధాన నిందితుడుగా ఉన్న జనార్దన్ రావు తెలిపారు. విదేశాల నుండి సోమవారం రాత్రి ఆయన విలేకరులకు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. ఈ సందర్భంగా జనార్ధన్‌రావు మాట్లాడుతూ నకిలీ మద్యం విషయంలో కొందరు గిట్టని రాజకీయ నాయకులు రాజకీయం చేస్తున్నారని, సంబంధం లేని కొందరు నాయకులను ఉద్దేశపూర్వకంగా ఇబ్బంది పెట్టడానికి సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారని తెలిపారు. తాను అనారోగ్య కారణంగా విదేశాలకు వచ్చానని, ఆరోగ్యం కుదుటపడిన తర్వాత ఇండియాకు వచ్చి ఇందులో జరుగుతున్న కుట్రలన్నింటిని పోలీసులు, ఎక్సైజ్ అధికారులకు తెలిపి కేసు విషయమై పోలీసులకు పూర్తిగా సహకరిస్తానని వివరణ ఇచ్చారు.

ఇబ్రహీంపట్నంలో భారీగా కల్తీ మద్యం స్వాధీనం

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన చిత్తూరు జిల్లా తంబళ్లపల్లి నియోజకవర్గం మొలకల చెరువు కల్తీ మద్యం కేసుపై ఎక్సైజ్ శాఖ అధికారులు విచారణ చేపట్టారు. దీనిలో భాగంగా ఈ కేసులో ఎ1గా ఉన్న ఎన్‌టిఆర్ జిల్లా ఇబ్రహీంపట్నానికి చెందిన అద్దేపల్లి జనార్ధన్‌కు చెందిన ఇబ్రహీంపట్నంలోని ఎఎన్‌ఆర్ బార్‌ను సీజ్ చేశారు. మూడు రోజులుగా ఐదు బృందాలు ఈ కేసుపై దర్యాప్తు చేస్తున్నట్లు ఎక్సైజ్ శాఖ అధికారులు తెలిపారు.

జనార్ధన్ రావు సోదరుడు జగన్ మోహన్ రావు, జనార్ధన్ అనుచరుడు కట్టా రాజు ఎక్సైజ్ అధికారుల అదుపులో ఉన్నారు. జగన్ మోహన్ రావు, కట్టా రాజు ఇచ్చిన సమాచారంతో జనార్ధన్ రావు గోడౌన్‌లో అధికారులు తనిఖీలు చేపట్టి గోడౌన్‌లో భారీగా నకిలీ మద్యం స్వాధీనం చేసుకున్నారు. నకిలీ మద్యం బాటిళ్లకు వేసే లేబుల్స్ సీలింగ్ చేసే మెషీన్లు స్వాధీనం చేసుకున్నారు. 35 లీటర్ల కెపాసిటీ కలిగిన 95 క్యాన్లను సీజ్ చేశారు. హోలోగ్రామ్ స్టిక్కర్లు, వందల కొద్దీ ఖాళీ బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ శాఖ అధికారుల నేతృత్వంలో భారీ సెర్చ్ ఆపరేషన్ కొనసాగుతోంది. ఈ కేసులో ఇప్పటికే 12 మందిని అరెస్టు చేసినట్లు అధికారులు తెలిపారు.

విశాఖ ఉక్కుకు సహకరిస్తాం

- సమీక్షలో సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

విశాఖ స్టీల్ ప్లాంట్‌ను బలోపేతం చేయడంతో పాటు మరింత పటిష్టపర్చడానికి, పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం అన్నివిధాల పూర్తి సహకారం అందిస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ, స్టీల్ ప్లాంట్ ఉన్నతాధికారులతో సోమవారం సచివాలయంలో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ ఏడాది కాలంలో కేంద్ర ప్రభుత్వ సహాయం, రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో ప్లాంట్ ఉత్పత్తిలో గణనీయమైన పురోగతి సాధించినట్లు చెప్పారు. ప్లాంట్‌ని నష్టాల నుంచి బయటపడేయడానికి , బలోపేతం చేయడానికి యాజమాన్యం, కార్మికులు, ఉద్యోగులు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి పనిచేయాల్సి ఉందన్నారు. గతేడాది కాలంలో తీసుకున్న చర్యలు, సమిష్టి నిర్ణయాలు, సమన్వయం కారణంగా ప్లాంట్ మంచి ఫలితాలు సాధిస్తోందని అభిప్రాయపడ్డారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన అనంతరం తాను చొరవ తీసుకుని ప్లాంట్ పరిరక్షణ కోసం కేంద్రం నుంచి ఆర్థిక ప్యాకేజీ తీసుకువచ్చినట్లు చెప్పారు. తమ ప్రభుత్వ ప్రయత్నాలతో కేంద్రం రూ.11,440 కోట్లు సహాయం అందించిందన్నారు. ఇప్పటికే అత్యధిక నిధులు విడుదల కావడంతో వాటిని వినియోగించి ప్లాంట్‌ను గాడిలో పెట్టే పనులు చేపట్టినట్లు తెలిపారు.

రాష్ట్ర ప్రభుత్వ, స్టీల్ ప్లాంట్ ఉన్నతాధికారులతో సమీక్షిస్తున్న సిఎం చంద్రబాబు

గతేడాది సెప్టెంబరులో ప్లాంట్ సామర్థ్యంలో 25శాతం మాత్రమే ఉత్పత్తి జరగ్గా, ఈ ఏడాది సెప్టెంబరులో అది 79 శాతానికి చేరడం మంచి పరిణామమన్నారు. మూడో త్రైమాసికం ముగిసేలోగా 92.5 శాతానికి ఉత్పత్తి సామర్థ్యం చేరుకునేలా స్టీల్ ప్లాంట్ అధికారులు కృషి చేయాలన్నారు. ఇందు కోసం అందరూ ఐక్యంగా పనిచేయాలన్నారు, ప్లాంట్ పనితీరు, పురోగతిపై ప్రతి మూడు నెలలకొకసారి సమీక్ష చేస్తామన్నారు. ప్రతి నెలా చీఫ్ సెక్రటరీ స్థాయిలో ప్లాంట్‌పై రివ్యూ చేయాలని సూచించారు. ఈ సమీక్షలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్‌తో పాటు ఆర్‌ఐఎన్‌ఎల్ సిఎండి అజిత్‌కుమార్ సక్సేనా, మినిస్ట్రీ ఆఫ్ స్టీల్ జాయింట్ సెక్రటరీ అబిజిత్ నరేంద్ర, డైరెక్టర్ జివిఎన్ ప్రసాద్ పాల్గొన్నారు.

ఆమోదయోగ్యం కాదు : సిఎం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ బిఆర్ గవాయ్‌పై సుప్రీంకోర్టులో జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తునట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. ఈ మేరకు ఎక్స్‌లో చేసిన పోస్టులో ఇటువంటి చర్యలు ఆమోదయోగ్యం కావని, నాగరిక, ప్రజాస్వామ్య సమాజంలో వాటికి స్థానం లేదని పేర్కొన్నారు. మన న్యాయవ్యవస్థ గౌరవాన్ని నిలబెట్టడం ప్రజాస్వామ్యంలో ప్రథమ కర్తవ్యమన్నారు.

సిజెఐపై దాడికి యత్నించడాన్ని ఖండిస్తున్నాం
డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్

సుప్రీంకోర్టు సిజెఐపై కోర్టు లోపల దాడికి జరిగిన ప్రయత్నాన్ని తాను తీవ్రంగా ఖండిస్తున్నట్లు డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. సనాతన జ్ఞానం వ్యవహార (చట్టానికి కట్టుబడి ఉండటం), రాజ్యాంగబద్ధమైన చట్టానికి లోబడి ఉండాలని కోరుతుందన్నారు.

సిగ్గుచేటు : లోకేష్

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడి జరగడం సిగ్గుచేటని విద్యాశాఖ మంత్రి లోకేష్ పేర్కొన్నారు. న్యాయవ్యవస్థను బెదిరించే ఇటువంటి ప్రయత్నాలకు ప్రజాస్వామ్యంలో స్థానం లేదని, వాటిని కఠినంగా ఎదుర్కోవాలని ఆయన పేర్కొన్నారు.

అత్యున్నత న్యాయ సంస్థకు అవమానం: జగన్

ఇది ఒక వ్యక్తిపై జరిగిన దాడి కాదని, అత్యున్నత న్యాయ సంస్థకు జరిగిన అవమానమని మాజీ ముఖ్యమంత్రి, వైసిపి అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు ఎక్స్‌లో ఆయన పోస్టు చేశారు. ఈ దాడిని అందరూ ఖండించాలని తెలిపారు. మన సంస్థల సమగ్రతను కాపాడుకోవడంలో ఐక్యంగా నిలబడాలని సూచించారు.

సనాతనం పేరుతో దాడి : ఐలు ఖండన

సుప్రీంకోర్టు సిజెఐ గవాయ్‌పై కోర్టులో దాడికి యత్నించడాన్ని న్యాయ వ్యవస్థ, రాజ్యాంగంపై జరిగిన దాడిగానే భావించాల్సి ఉంటుందని ఆలిండియా లాయర్స్ యూనియన్ (ఐలు) నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకర రాజేంద్రప్రసాద్, రాష్ట్ర అధ్యక్ష, జనరల్ సెక్రటరీలు కె కుమార్, ఎన్ మాధవరావు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఘటనను తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ప్రభుత్వం ఈ ఘటనపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి దాడి చేసిన వ్యక్తితోపాటు అతని వెనుక ఉన్న సంఘ వ్యతిరేక శక్తులపై తక్షణమే చర్య తీసుకోవాలని ఐలు డిమాండ్ చేస్తుందన్నారు. సిజెఐ గవాయ్ రాజ్యాంగాన్ని రక్షించడంలోనూ, రాజ్యాంగం నిర్దేశించిన మౌలిక సూత్రాల్లో ఒకటైన భౌతిక తత్వాన్ని రక్షించడంలోనూ ముఖ్యపాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు.

'బల్క్ డ్రగ్' పోరాటంపై నిర్బంధానికి సిపిఎం ఖండన

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అనకాపల్లి జిల్లా నక్కపల్లి వద్ద బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటుకు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటంపై ప్రభుత్వం అమలు చేస్తున్న నిర్బంధకాండను సిపిఎం ఖండించింది. ఈ మేరకు రాష్ట్రకమిటీలో చేసిన తీర్మానాన్ని సోమవారం విడుదల చేసింది. దీనిపైన ప్రభుత్వం ఆగష్టు 6న ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించిందని, దీనిలో పాల్గొన్న మొత్తం ప్రజానీకం బల్క్‌డ్రగ్ పార్క్ ఏర్పాటు చేయవద్దని అభిప్రాయం వ్యక్తం చేశారని తెలిపివంది. ఈ ప్రజాభిప్రాయాన్ని గౌరవించి తక్షణం బల్క్‌డ్రగ్ పార్కు ప్రతిపాదన విరమించుకోవాలని సిపిఎం రాష్ట్ర కమిటీ ప్రభుత్వాన్ని కోరింది. రాజయ్యపేట గ్రామంలో మత్స్యకార కుటుంబాలు బల్క్‌డ్రగ్ పార్క్ ఏర్పాటు చేస్తే తమ జీవనోపాధి దెబ్బతింటుందని గత 23 రోజులుగా శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తూ రిలే నిరాహారదీక్షలు చేస్తున్నారని పేర్కొంది. ఈ దీక్షలపై ప్రభుత్వం తీవ్ర నిర్బంధాన్ని ప్రయోగిస్తోందని, దీక్షలకు ముందుగా అనుమతి ఇవ్వలేదని, నాలుగు రోజుల తరువాత ప్రజల పోరాటానికి తలొగ్గి దీక్షలకు అనుమతి ఇచ్చిందని పేర్కొంది. రాజయ్యపేట గ్రామాన్ని హోంమంత్రి సందర్శించిన సందర్భంలో గ్రామస్తులు ఘెరావ్ చేశారని, కాన్వాయ్‌ని అడ్డుకున్నారని, తాత్కాలికంగా పనులు నిలిపివేస్తామని హోంమంత్రి హామీ ఇచ్చారని పేర్కొన్నారు. నేటికీ దీక్షలు శాంతియుతంగా కొనసాగుతున్నాయని, ఈ సందర్భంగా గత రెండు రోజులుగా పోలీసులు సిపిఎం నాయకులు యం.అప్పలరాజుని గృహ నిర్బంధంలో ఉంచారని తెలిపింది. రాజయ్యపేట గ్రామం వెళ్లడానికి వీలులేదని యం.అప్పలరాజుని గృహ నిర్బంధం చేయడాన్ని తీవ్రంగా ఖండించింది. తక్షణం అప్పలరాజుతో పాటు ఇతర పోరాట నాయకులపై ఆంక్షలు ఎత్తివేయాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సమావేశం డిమాండ్ చేసింది. ప్రజల పోరాటానికి సంఘీభావం ప్రకటిస్తూ తీర్మానించింది.

బాధిత విద్యార్థినులను పరామర్శిస్తున్న హోంమంత్రి అనిత

విద్యార్థినుల అస్వస్తత ఘటనపై కమిటీ

- కెజిహెచ్‌లో చికిత్స పొందుతున్న వారిని పరామర్శించిన హోం మంత్రి అనిత

ప్రజాశక్తి- కలెక్టరేట్ (విశాఖపట్నం), కురుపాం (పార్వతీపురం మన్యం జిల్లా)

పార్వతీపురం మన్యం జిల్లా కురుపాం ఏకలవ్య బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థుల అస్వస్థత ఘటనపై వైద్య నిపుణులతో ప్రత్యేక కమిటీ వేశామని, సమగ్ర విచారణ జరుగుతోందని హోంమంత్రి వంగలపూడి అనిత తెలిపారు. విశాఖ కెజిహెచ్‌లో చికిత్స పొందుతున్న గురుకుల పాఠశాల విద్యార్థినులను సోమవారం ఆమె పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిపై వైద్యులనడిగి తెలుసుకున్నారు. అనంతరం మంత్రి అనిత మాట్లాడుతూ బాధిత విద్యార్థినులకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని, దీనిపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టారని తెలిపారు.

రెండు రోజుల్లో రానున్న తాగు నీటి నమూనా నివేదిక : అచ్చెన్నాయుడు

పచ్చకామెర్లతో అస్వస్థతకు గురైన బాలికలకు మెరుగైన వైద్యమందిస్తున్నామని, ఈ పాఠశాలను ఆదర్శ గురుకుల పాఠశాలగా తీర్చిదిద్దుతామని పార్వతీపురం మన్యం జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు చెప్పారు. స్థానిక గిరిజన గురుకుల పాఠశాలను ఆయన సందర్శించారు. విద్యార్థినుల అస్వస్థతకు కారణాలపై సమగ్ర నివేదిక ఇవ్వాలని జిల్లా వైద్య, శాఖ అధికారి ఎస్ భాస్కరరావుకు, గిరిజన సంక్షేమ అధికారులకు ఆదేశించారు. అనంతరం విలేకర్లతో మంత్రి మాట్లాడుతూ తాగునీటి నమూనా విజయవాడ పంపించామని, విద్యార్థులకు పచ్చకామెర్లు ఎలా వ్యాప్తి చెందాయో రెండు రోజుల్లో నివేదిక వస్తుందని తెలిపారు. ఆహారం వల్ల వ్యాప్తి చెందిందా? అనేదాన్ని తెలుసుకోవడానికి ప్రత్యేక బృందాలు వేశామని తెలిపారు. కాగా, మిగిలిన విద్యార్థుల వైద్య పరీక్షల రిపోర్టులన్నీ వచ్చాయని, ఎవరికీ ఎటువంటి ఇబ్బందీ లేదని కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు.

మృతుల కుటుంబాలకు పరిహారం చెల్లించాలని కలెక్టరేట్ వద్ద ధర్నా

పచ్చకామెర్లతో మృతి చెందిన ఇద్దరు విద్యార్థినుల కుటుంబాలకు రూ.25 లక్షల పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఆదివాసీ జెఎసి ఆధ్వర్యాన నాయకులు జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఎజెఎసి ఛైర్మన్ నిమ్మక జయరాజు ఆధ్వర్యాన జిల్లా కలెక్టర్ ప్రభాకర్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. పాఠశాలలో కనీస సౌకర్యాలు లేవన్నారు. వాటర్ ప్లాంట్ రెండేళ్లుగా పని చేయడం లేదని తెలిపారు.

గిరిజన నాయకుల గెంటివేత

బాధిత విద్యార్థినులను పరామర్శించేందుకు ఆస్పత్రికి వస్తున్న మంత్రులు అచ్చెన్నాయుడును, సంధ్యారాణిని కలిసి వినతిపత్రం అందజేయడానికి గిరిజన నాయకులు అక్కడికి చేరుకున్నారు. మృతి చెందిన విద్యార్థి తోయక అంజలి తల్లిదండ్రులతో కలిసి పాఠశాల విద్యా కమిటీ ఛైర్మన్ కూరంగి సీతారాం, గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి రంజిత్ కుమార్ ఆస్పత్రి వద్ద ఉన్నారు. గిరిజన సంఘాల నాయకులను ఎందుకు లోపలికి అనుమతించారని, వారిని గేటు బయటకు పంపించాలని అక్కడే ఉన్న స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర ఆదేశించారు. దీంతో సూపరింటెండెంట్ సూచనల మేరకు పోలీసులు గిరిజన సంఘాల నాయకులను బలవంతంగా బయటకు లాక్కెళ్లారు.

ధాన్యం రైతుల దైన్యం

నేటికి 1,243 టన్నులే ప్రభుత్వం కొనుగోలు
దోపిడీకి గురవుతున్న సింహపురి అన్నదాతలు

ప్రజాశక్తి- నెల్లూరు ప్రతినిధి

నెల్లూరు జిల్లాలోని ధాన్యం రైతుల పరిస్థితి దైన్యంగా ఉంది. ప్రభుత్వం ఇప్పటి వరకూ 1,243 టన్నుల ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేసింది. రైతులను దళారులు, మిల్లర్లు దోచుకుంటున్నారు. జిల్లాలో ప్రస్తుతం లేట్ ఖరీఫ్ సాగు పూర్తయింది. ఇది ఇక్కడ రెండో పంట. మూడు లక్షల ఎకరాల్లో వరిని సాగు చేశారు. ప్రధానంగా కెఎన్‌ఎం 1638, కెఎన్‌ఎం 733, 1010 రకాలను వేశారు. 'ఎ' గ్రేడ్ రకమే ఎక్కువగా సాగు చేశారు. అధికారులు 1.98 లక్షల ఎకరాలకు సంబంధించి మాత్రమే ఇ-క్రాస్ చేశారు. మొత్తం దాదాపు పది లక్షల పుట్లు ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేశారు. ఇప్పటికే దాదాపు 70 శాతం విస్తీర్ణంలో వరి నూర్పులు పూర్తయ్యాయి. ఎక్కువ ప్రాంతాల్లో రైతులు నెల రోజుల క్రితం నుంచి ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల కోసం ఎదురుచూశారు. అయినా, వీటి జాడలేకపోవడంతో దళారులకు, మిల్లర్లకు ధాన్యాన్ని తక్కువ ధరకు అమ్ముకోవాల్సి వచ్చింది. 'ఎ' గ్రేడ్ ధాన్యానికి పుట్టి (850 కిలోలు) ఒక్కంటికీ ప్రభుత్వం రూ.19,750 ధర ప్రకటించింది. దళారులు, మిల్లర్లు రూ.14 వేల నుంచి రూ.14,500కు మించి కొనుగోలు చేయలేదు. దీంతో, పుట్టి ఒక్కంటికీ రైతులు రూ.5,250 నుంచి రూ.5,750 వరకూ నష్టపోయారు. రైతులు, రైతు సంఘాల ఆందోళన మేరకు ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా ప్రభుత్వానికి నివేదిక పంపారు. ప్రభుత్వం నుంచి అనుమతి రావడంతో వారం రోజుల క్రితం 64 కేంద్రాలు ఏర్పాటయ్యాయి. అప్పటికే 70 శాతం పంటను రైతులు దళారులకు తెగనమ్ముకున్నారు. ప్రభుత్వం ఇంతవరకూ 1,243 టన్నులు మాత్రమే కొనుగోలు చేసింది. దీంతో, మళ్లీ తక్కువ ధరకు దళారులకే ధాన్యాన్ని అమ్ముకోవాల్సి వస్తోంది.

టన్ను ధాన్యం తీసుకొని పుట్టి ధాన్యానికే ధర

దళారులు ధర తగ్గించడమే కాకుండా టన్ను ధాన్యాన్ని తీసుకొని పుట్టి ధాన్యానికి మాత్రమే ధర చెల్లిస్తున్నారని రైతులు వాపోతున్నారు. కొనుగోలు కేంద్రాలను అందుబాటులో ఏర్పాటు చేయాలని, గోనె సంచులు, రవాణా సమస్యలను పరిష్కరించాలని, ధాన్యానికి గిట్టుబాటు కల్పించి ప్రభుత్వమే కొనుగోలు చేయాలని వారు కోరుతున్నారు. పుట్టికి రూ.22 వేలు ధర వచ్చేలా చట్టం చేయాలని కోవూరుకు చెందిన రైతు ఎస్‌కె బాబు డిమాండ్ చేశారు.

ఆలస్యంగా కొనుగోలు కేంద్రాలు

సకాలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనందున అనేకమంది రైతులు దళారులకు, మిల్లర్లకు తక్కువ ధరకే అమ్ముకున్నారు. దిగుబడి వచ్చే సమయంలో కేంద్రాలు పెడితేనే ఉపయోగం. పుట్టి ధాన్యాన్ని రూ.14 వేలకే దళారులు కొనుగోలు చేశారు.

-గద్దం సుధాకర్‌రెడ్డి, రైతు

శిశువు మరణంపై విచారణ

- ఐసిడిఎస్ డైరెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి తనిఖీ
- నివేదిక అనంతరం చర్యలు తీసుకుంటామని ప్రకటన

ప్రజాశక్తి - అనంతపురం

అనంతపురం శిశుగృహలో రెండు నెలల శిశువు మరణంపై విచారణ కొనసాగుతోంది. శిశువు మరణానికి కారణాలను తెలుసుకునేందుకు ఐసిడిఎస్ రాష్ట్ర డైరెక్టర్ వేణుగోపాల్ సోమవారం అనంతపురం నగరం వచ్చారు. శిశుగృహాన్ని సందర్శించి అక్కడి పరిస్థితులను పరిశీలించారు. అనంతరం స్త్రీ శిశుసంక్షేమ శాఖ, శిశుగృహ సిబ్బందితో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. అక్కడి ఏర్పాట్లు, శిశువు మరణానికి కారణాలపై ఆరా తీశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. శిశుగృహంలో జరిగిన ఘటనలపై వివరాలు తెలుసుకునేందుకు తాను వచ్చినట్లు తెలిపారు. ఇప్పటికే జిల్లా కలెక్టర్ ఆనంద్ త్రిసభ్య కమిటీ విచారణకు ఆదేశించారని తెలిపారు. ఆ కమిటీ ఇచ్చే నివేదికతో పాటు, శాఖపరంగా తాము పరిశీలించి లోటుపాట్లను తెలుసుకునేందుకు తాను వచ్చానని, అన్నింటిని పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

టమోటా రైతులను ఆదుకుంటాం

మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

టమోటా రైతులకు ఎటువంటి నష్టం కలగకుండా ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటుందని వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. వర్షాల వల్ల తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్రకు సరుకు ఎగుమతులు తగ్గడం, ఎడతెరిపి లేకుండా పడుతున్న వర్షాలతో టమోటా అమ్మకాలు మందగించాయన్నారు. ఈ నెల 5న రాప్తాడు మార్కెట్‌లో కెజి టమోటా ధరలు గరిష్టం రూ.18, కనిష్టం రూ.9, మోడల్ ధర రూ.12లుగా ఉన్నాయన్నారు. 30 నుంచి 40 మెట్రిక్ టన్నుల సరుకు పత్తికొండ మార్కెట్‌కు వస్తుందని, దసరా సెలవుల కారణంగా 10 టన్నులు అదనంగా చేరడం, రోడ్లపై రెండవ గ్రేడ్ క్వాలిటీ టమోటాలు వేసి గందరగోళం సృష్టించబడినట్లు మంత్రి తెలిపారు.

పిడుగుపాటుకు యువకుడు మృతి

ప్రజాశక్తి - గుడ్లూరు (నెల్లూరు)

పిడుగుపాటుకు యువకుడు మృతిచెందిన ఘటన నెల్లూరు జిల్లాలో చోటుచేసుకుంది. మృతుని కుటుంబ సభ్యుల కథనం ప్రకారం... నెల్లూరు జిల్లాలోని గుడ్లూరు మండలం ఎస్‌సి కాలనీకి చెందిన దేవరకొండ నాగరాజు (29) ఒంగోలు బైపాస్‌రోడ్డు పక్కన ఉన్న బాతులకు కాపలా కాసేందుకు ఆదివారం రాత్రి వెళ్లారు. గుడిసెలో నిద్రిస్తుండగా సోమవారం వేకువజామున అతనికి సమీపంలో పిడుగుపడడంతో అక్కడికక్కడే నాగరాజు మరణించారు. విషయం తెలుసుకున్న మృతుని కుటుంబసభ్యులు, బంధువులు ఘటనాస్థలికి చేరుకున్నారు. నాగరాజుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

వచ్చే ఏడాది 8 మంది ఐపిఎస్‌ల ఉద్యోగ విరమణ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వచ్చే ఏడాదిలో 8 మంది ఐపిఎస్ అధికారులు ఉద్యోగ విరమణ చేయనున్నారు. ఈ మేరకు ప్రభుత్వం జిఓఆర్‌టి నెంబరు 1812ను సోమవారం విడుదల చేసింది. ఉద్యోగ విరమణ చేసే వారిలో 31.01.2026న అంజనీకుమార్, 30.06.2026న మాదిరెడ్డి ప్రతాప్, 31.08.2026న పి సీతారామాంజనేయులు, 30.04.2026న కసిరెడ్డి విఆర్‌ఎన్ రెడ్డి, 30.06.2026న పివి సునీల్‌కుమార్, 31.10.2026న ఎన్ బాలసుబ్రహ్మణ్యం, 31.01.2026న జి పాలరాజు, 31.03.2026న కెఎస్‌ఎస్‌వి సుబ్బారెడ్డి ఉన్నారు.

గిరిజన బిడ్డలకు రూ.50 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా

కాంగ్రెస్ పార్టీ డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గిరిజన బిడ్డల సంక్షేమం అంటే కూటమి ప్రభుత్వానికి లెక్కలేదని ఎపిసిసి అధ్యక్షులు వైఎస్ షర్మిల విమర్శించారు. కురుపాం గురుకుల పాఠశాలలో చనిపోయిన ఇద్దరు గిరిజన బిడ్డల కుటుంబాలకు రూ.50 లక్షల చొప్పున పరిహారం అందించాలని సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. సంక్షేమ పాఠశాలల్లో గుక్కెడు మంచినీళ్లు, కడుపునకు పిడికెడు అన్నం పెట్టలేని పాలన చంద్రబాబుదని విమర్శించారు. కురుపాం గిరిజన గురుకులంలో కలుషిత నీరు తాగి ఇద్దరు విద్యార్థినులు మరణించిన సంఘటనపై ప్రభుత్వం నైతిక బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.

జిఎస్‌టితో పెరిగిన చేనేతల ఆకలి చావులు

- పన్నుల రద్దుతోపాటు చేనేత పరిరక్షణకు సమగ్ర విధానం తేవాలి
- చేనేత కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలో మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు

ప్రజాశక్తి- సత్తెనపల్లి (పల్నాడు జిల్లా)

చేనేతపై జిఎస్‌టి వల్ల నేత కార్మికుల ఆకలిచావులు మరింత పెరిగాయని మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు తెలిపారు. ఈ దృష్ట్యా జిఎస్‌టిని రద్దు చేయాలని, చేనేత పరిరక్షణకు సమగ్ర విధానాన్ని ప్రకటించాలని డిమాండ్ చేశారు. చేనేత కార్మిక సంఘం 11వ రాష్ట్ర మహాసభ పల్నాడు జిల్లా సత్తెనపల్లి పట్టణంలోని పోలా రామాంజనేయులు నగర్, జెఎన్ శేషయ్య ప్రాంగణం (పుచ్చలపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రం)లో సోమవారం ప్రారంభమైంది. తొలుత సంఘం జెండాను సీనియర్ నాయకులు అనంత పిచ్చయ్య ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన ప్రారంభ సభకు సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె.శివదుర్గారావు అధ్యక్షత వహించారు. ఈ సభలో కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ చేనేత రంగంలో పెట్టుబడిదారులకు పాలకులు పెద్దపీట వేస్తూ నేత కార్మికులను దెబ్బతీస్తున్నారని తెలిపారు. బ్రిటీష్ కాలంలో పన్నులేమీ లేకున్నా మోడీ హయాంలో చేనేతను కూడా జిఎస్‌టి పరిధిలోకి తెచ్చి పన్నులేశారని వివరించారు.

మహాసభ సందర్భంగా ప్రదర్శన నిర్వహిస్తున్న చేనేత కార్మికులు, ప్రతినిధులు, నాయకులు

ప్రస్తుతం జిఎస్‌టిని తగ్గించామని చెబుతున్నా దానివల్ల చేనేతకు ఒరిగేదేమీ లేదన్నారు. బ్రిటిష్ విక్టోరియా రాణికి అగ్గిపెట్టిలో పట్టే చీరను నేసిన నైపుణ్యం మన నేత కార్మికులదని గుర్తు చేశారు. పాఠశాల విద్యార్థులందరూ చేనేత వస్త్రాలనే వాడేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కోరారు. చంద్రబాబు, జగన్ ఇద్దరూ చేనేత కార్మికులను విస్మరించారని, నేతన్న నేస్తం పథకం ద్వారా డబ్బులేస్తున్నా అవి నేరుగా యజమానుల ఖాతాల్లోకి వెళ్తున్నాయేగానీ, కార్మికులకు దక్కడం లేదని అన్నారు. మహాసభ సందర్భంగా పట్టణంలో చేనేత కార్మికులు ప్రదర్శన జరిగింది. మహాసభలో ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం (ఎఐటియుసి) ప్రధాన కార్యదర్శి పి.నాగేశ్వరరావు, చేనేత కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు రామనాథం పూర్ణచంద్రరావు, చేతివృత్తిదారుల సంఘం రాష్ట్ర కన్వీనర్ ఎం.భాస్కరయ్య, చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.రాజు, రాష్ట్ర సహాయ కార్యదర్శి డి.రామారావు మాట్లాడారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.బాలకృష్ణ నివేదికను ప్రవేశపెట్టారు.

2027 డిసెంబర్ నాటికి ప్రధాని చేతుల మీదుగా పోలవరం ప్రారంభం

- కేంద్ర మంత్రి సిఆర్ పాటిల్‌ను కలిసిన మంత్రి నిమ్మల

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

2027 డిసెంబరు నాటికి ప్రధాని మోడీ చేతుల మీదుగా పోలవరం ప్రారంభిస్తామని రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు వెల్లడించారు. సోమవారం నాడిక్కడ కేంద్ర జలశక్తి మంత్రి సిఆర్ పాటిల్‌తో మంత్రి రామానాయుడు భేటీ అయ్యారు. పోలవరం ప్రాజెక్టు పురోగతిపై మంత్రి సిఆర్ పాటిల్ సమీక్ష నిర్వహించారు. అనంతరం రామానాయుడు మీడియాతో మాట్లాడుతూ.. పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులను పర్యవేక్షించడానికి కేంద్ర మంత్రి సిఆర్ పాటిల్‌ను ఆహ్వానించామని, బీహార్ ఎన్నికల తరువాత పోలవరం ప్రాజెక్టు పరిశీలనకు ఆయన వస్తానని చెప్పారని అన్నారు. కేంద్రం పోలవరం నిర్మాణానికి ఇచ్చే ప్రతి రూపాయిని సద్వినియోగం చేస్తున్నామని, 2027 చివరి నాటికి ప్రధాని మోడీ చేతుల మీదుగా పోలవరం జాతికి అంకితం చేస్తామని అన్నారు. ఎపి జీవనాడి పోలవరం ప్రాజెక్టు అని, 7.2 లక్షల ఎకరాలకు కొత్తగా నీరు అందిస్తుందని తెలిపారు. 960 మెగావాట్ల విద్యుత్ అందిస్తుందని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో పోలవరం ప్రాజెక్టు అనిశ్చితిలోకి నెట్టివేయబడిందని, కూటమి ప్రభుత్వంలో పోలవరానికి అమితమైన ప్రాధాన్యత ఇచ్చామని అన్నారు. నిర్దేశించిన 2027 లక్ష్యానికి అనుగుణంగా పనులు జరుగుతున్నాయని తెలిపారు. వర్షాకాలంలో కూడా డయాఫ్రం వాల్ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో 17 నెలలపాటు పోలవరం పనులు జరగలేదన్నారు. పోలవరం నిర్వాసితులకు ఇవ్వాల్సిన ప్యాకేజీని కూడా జగన్ సర్కారు ఇవ్వలేదన్నారు. మొదటి విడతగా 2026 మే నెల చివరి నాటికి 28,946 మందికి రూ.900 కోట్లతో పునరావాసం కల్పిస్తామన్నారు. 2027 మార్చి నాటికి పునరావాసం పూర్తి చేస్తామన్నారు. బనకచర్ల అంశంపై కేంద్ర మంత్రితో ఎలాంటి చర్చ జరగలేదని, కేవలం పోలవరం నిధులు, ప్రాజెక్టు సమీక్షపై మాత్రమే చర్చ జరిగిందని ఒక ప్రశ్నకు మంత్రి బదులిచ్చారు.

కల్తీ దగ్గు మందు సరఫరా లేదు

మంత్రి సత్యకుమార్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లలో 12 మంది చిన్నారుల మరణాలకు దారితీసిన కల్తీ దగ్గు మందు రాష్ట్రానికి సరఫరా కాలేదని వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ఔషధ దుకాణాలకు గానీ, ప్రభుత్వ ఆస్పత్రులకు గానీ ఆ కంపెనీ దగ్గు మందు పంపిణీ జరగలేదని వెల్లడించారు. దగ్గు మందు అంశంపై ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ వీరపాండియన్, ఔషధ నియంత్రణ పరిపాలన ఇన్‌ఛార్జి డైరెక్టర్ జనరల్, వైద్య సేవలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ ఎమ్‌డి గిరీషా.. మంత్రికి సోమవారం నివేదికలు అందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కల్తీ దగ్గు మందు జాడ రాష్ట్రంలో లేనందున ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. రెండేళ్లలోపు ఉన్న చిన్నారులకు దగ్గు, జలుబుకు సంబంధించి వైద్యులు ద్రవ రూపంలో మందులు సూచించొద్దని ఆదేశాలు పంపాలన్నారు. కేంద్ర ఆరోగ్య మంత్రిత్వశాఖ పరిధిలోని డైరెక్టర్ జనరల్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్ సూచనలు అనుసరించాలని ఆదేశించారు. డ్రగ్ ఇన్‌స్పెక్టర్ల ద్వారా తనిఖీల పరంపర ఇంకా జరుగుతూనే ఉందని కమిషనరు వీరపాండియన్ తెలిపారు. రాష్ట్రంలో 4 రకాల కంపెనీల దగ్గు మందులు వాడుతున్నామని పేర్కొన్నారు. భారత డైరెక్టర్ జనరల్ హెల్త్ సర్వీసెస్ ఆదేశాలను పంపి, వైద్యులు జాగ్రత్తలు తీసుకునేలా చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించామన్నారు.

తిరుపతికి మరోసారి బాంబు బెదిరింపులు

- ఆందోళనలో నగరవాసులు
- తలలు పట్టుకుంటున్న పోలీసులు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన తిరుపతి నగరాన్ని బాంబుబూచి హడలెత్తిస్తోంది. గత ఐదు రోజులుగా తిరుపతికి 'బాంబు బెదిరింపులు' రావడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. అడుగడుగునా తనిఖీలు చేపట్టారు. తనిఖీ చేసిన ప్రతిచోటా అది 'ఫేక్' అని తేలడంతో తలలు పట్టుకుంటున్నారు. గత గురువారం నుంచి తిరుపతికి బాంబు బెదిరింపులు రావడం ఇది మూడోసారి. బ్రహ్మోత్సవాల ఆఖరి రోజు, అక్టోబర్ 2న చక్రస్నానం రోజు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశారు. రైల్వేస్టేషన్, బస్టాండ్, టిటిడి వసతి సముదాయాల్లో డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీలు చేశారు. మరుసటిరోజు హరేరామ హరేకృష్ణ టెంపుల్‌కు బాంబు బెదిరింపు వచ్చింది. అక్కడా తనిఖీలు చేపట్టారు. ఆదివారం తిరుపతి శివారు ప్రాంతాలైన నారాయణాద్రి ఆస్పత్రి, తిరుచానూరు, కరకంబాడి, బిటిఆర్ కాలనీ, చెర్లోపల్లి, అగ్రహారం, వకుళమాత ఆలయ సమీపంలో తనిఖీలను ముమ్మరం చేశారు. సోమవారం అగ్రికల్చర్ యూనివర్సిటీ పరిపాలనా భవనాన్ని పేల్చి వేస్తామని

అగ్రికల్చర్ యూనివర్సిటీలో తనిఖీలు చేస్తున్న పోలీసులు

పోలీసులు ఉన్నతాధికారులకు మెయిల్ వచ్చింది. దీంతో జిల్లా ఎస్‌పి సుబ్బరాయుడు నేతృత్వంలో డాగ్‌స్క్వాడ్, బాంబు స్క్వాడ్ ముమ్మరంగా తనిఖీలు చేశాయి. తన తమ్ముడు నారా రామ్మూర్తినాయుడు '11వ నెల విస్తరి' కార్యక్రమానికి మంగళవారం నారావారిపల్లికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రానున్నారు. సిఎం పర్యటన నేపథ్యంలో నలుదిక్కుల నుంచి తిరుపతికి వెళ్లే ద్విచక్ర వాహనాలనూ, కారులు, ట్రావెల్స్‌ను తనిఖీలు చేసి పంపిస్తున్నారు. గురు, శుక్రవారాల్లో వచ్చిన బెదిరింపు మెయిల్స్ ఆధారంగా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసు వర్గాలు తెలిపాయి.

నేడు నారావారిపల్లికి చంద్రబాబు

కుటుంబసమేతంగా నారావారిపల్లికి మంగళవారం ముఖ్యమంత్రి చంద్రబాబు చేరుకోనున్నారు. నారావారిపల్లి సమీపంలోని రంగంపేట వద్ద హెలిప్యాడ్‌ను అధికారులు ఏర్పాటు చేశారు. సిఎం పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్‌పి సుబ్బరాయుడు, ఎమ్మెల్యే పులివర్తి నాని, తుడా ఛైర్మన్ డాలర్స్ దివాకర్‌రెడ్డి దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి, కొడుకు నారా లోకేష్, కోడలు బ్రహ్మణి, మనవడు దేవాన్ష్ మంగళవారం మధ్యాహ్నం రానున్నారు. నారా రామ్మూర్తినాయుడు తనయుడు, సినీ హీరో నారా రోహిత్ ఇప్పటికే నారావారిపల్లికి చేరుకున్నారు. నారా ఫ్యామిలీతో పాటు, నందమూరి కుటుంబం కూడా ఈ కార్యక్రమంలో పాల్గొనుంది. మంగళవారం ఉదయం 11.10 గంటలకు నారావారిపల్లికి చేరుకుని, మధ్యాహ్నం 1.40 గంటలకు చంద్రబాబు తిరుగు ప్రయాణమవుతారు.

ప్రమాదవశాత్తు అంబేద్కర్ విగ్రహానికి నిప్పు

ఉద్దేశపూర్వకం కాదు : ఎస్‌పి

పోలీసుల అదుపులో సర్పంచ్ గోవిందయ్య

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

చిత్తూరు జిల్లా వెదురుకుప్పం మండలం దేవళంపేటలో అంబేద్కర్ విగ్రహానికి నిప్పు ఉద్దేశపూర్వకంగా జరిగింది కాదని జిల్లా ఎస్‌పి తుషార్‌డూడి తెలిపారు. స్థానిక పోలీస్ అతిథి గృహంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అంబేద్కర్ విగ్రహానికి నిప్పు పెట్టిన సంఘటనలో సర్పంచ్ గోవిందయ్యను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు తెలిపారు. అంబేద్కర్ విగ్రహం సమీపంలో ఉన్న టీ షాపులో మంటలు వ్యాపించాయని, ఈ విషయాన్ని షాపు యజమాని దిల్‌షాద్ ముందుగా సర్పంచ్‌కు తెలియజేసినా విషయాన్ని తనకు అనుకూలంగా మార్చుకొనేందుకు సర్పంచ్ ప్రయత్నించారని తెలిపారు. పోలీసులకు, అగ్నిమాపక అధికారులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా టీ షాపు యజమానికి మరోచోట షాపు ఇప్పిస్తానని, ఈ విషయం ఎవ్వరికీ చెప్పవద్దని మభ్యపెట్టారని తెలిపారు. అంబేద్కర్ విగ్రహ దగ్ధం ఘటన రాష్ట్ర, జాతీయ స్థాయి సంచలనం చేసేందుకు సర్పంచ్ వ్యవహరించడం చట్టరీత్యా నేరమన్నారు. ఈ కేసులో 12 మందిని విచారించిన్నట్లు తెలిపారు.

కొత్తవలస ప్రజాశక్తి విలేకరి పైడిరాజు మృతి

ప్రజాశక్తి-కొత్తవలస రూరల్

విజయనగరం జిల్లా కొత్తవలస మండలం ప్రజాశక్తి విలేకరి, ఎపిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గుడివాడ పైడిరాజు (60) గుండెపోటుతో మృతి చెందారు. ఆయన సుమారు 25 ఏళ్లగా ప్రజాశక్తి విలేకరిగా పని చేశారు. ఎస్ కోట డివిజన్ ఆర్గనైజర్‌గా కూడా పనిచేశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయనకు ఆదివారం రాత్రి గుండెపోటు వచ్చింది. కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలో ఆయన కన్నుమూశారు. పైడిరాజుకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. పైడిరాజు భౌతికకాయాన్ని ప్రజాశక్తి జనరల్ మేనేజర్ ఎం వెంకటేశ్వరరావు, జిల్లా మేనేజర్ సిహెచ్ రాము, సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రెడ్డి శంకర్రావు, సిఐటియు నాయకులు ఎం శ్రీనివాస, ఎపిడబ్ల్యుజెఎఫ్ జిల్లా అధ్యక్షులు కె రమేష్ నాయుడు, ప్రజాశక్తి సమన్వయ కమిటీ సభ్యులు సందర్శించి నివాళులర్పించారు. పైడిరాజు మృతికి స్థానిక ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి, ప్రజాశక్తి ఎడిటర్ బి తులసీదాస్, సిజిఎం అచ్యుతరావు సంతాపం తెలిపారు. పైడిరాజు అంత్యక్రియలు సోమవారం ఆయన కుటుంబ సభ్యులు నిర్వహించారు.

అమరావతికి అన్ని విధాలా సాయం

కేంద్ర సహాయ మంత్రి రామదాస్ అథవాలే

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాజధాని అమరావతి అభివృద్ధికి కావాల్సిన అన్ని విధాలా సాయం అందించేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉంటుందని కేంద్ర సామాజిక, న్యాయ సాధికారత మంత్రిత్వశాఖ సహాయ మంత్రి రామదాస్ అథవాలే తెలిపారు. విజయవాడలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 2047 నాటికి దేశ ఆర్థిక వ్యవస్థను 30 ట్రిలియన్ డాలర్ల స్థాయికి చేర్చి, పేదరిక నిర్మూలనకు కేంద్ర ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతోందన్నారు. ప్రధాన మంత్రి ప్రవేశపెట్టిన 'మేక్ ఇన్ ఇండియా, 'మేడ్ ఇన్ ఇండియా' కార్యక్రమాల ద్వారా దేశంలో అంకుర సంస్థలు, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు, యూనికార్న్ సంస్థలు వృద్ధి చెందుతూ ప్రజలకు ఉపాధి అవకాశాలను కల్పిస్తున్నాయని తెలిపారు. కేంద్ర ప్రాయోజిత పథకాలను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆయనతోపాటు ఆర్‌పిఐ(ఎ) పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కొమ్మారెడ్డి బ్రహ్మానంద రెడ్డి తదితరులు ఉన్నారు.

షాపులను తొలగిస్తే ప్రధాని పర్యటన అడ్డుకుంటాం

కమిషనర్ కార్యాలయం ముందు చిరు వ్యాపారుల నిరసన

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

ప్రధాని మోడీ రాక సందర్భంగా సుందరీకరణ పేరుతో షాపులను తొలగించడాన్ని నిరసిస్తూ కర్నూలు మున్సిపల్ కార్యాలయం ముందు సిఐటియు ఆధ్వర్యంలో చిరు వ్యాపారులు ఆందోళనకు దిగారు. మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్... స్టేట్ గెస్ట్ హౌస్‌లో ఉండడంతో ర్యాలీగా వెళ్లి అక్కడే బైఠాయించారు. షాపుల తొలగింపును నిలుపుదల చేస్తామని కమిషనర్ హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. చిరు వ్యాపారుల సంఘం (సిఐటియు) న్యూ సిటీ కార్యదర్శి మహమ్మద్ రఫీ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానుద్దేశించి సిఐటియు నగర ఉపాధ్యక్షులు రాముడు, రాజశేఖర్ మాట్లాడారు. కర్నూలులో వేలాది మంది చిరు వ్యాపారులు తోపుడు బండ్లు, చిన్న బంకులు ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నారన్నారు. రహదారిపై రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా తక్కువ ధరకు పళ్ళు ,పూలు, బట్టలు, కూరగాయలు విక్రయిస్తున్నారని తెలిపారు. ఈ నెల 16న నగరంలో ప్రధానమంత్రి పర్యటన సందర్భంగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా షాపులను మూసివేస్తామని, అలా కాకుండా తొలగించేందుకు ప్రయత్నిస్తే పర్యటనను అడ్డుకుంటామని హెచ్చరించారు. సిఐటియు న్యూ సిటీ ఓల్డ్ సిటీ అధ్యక్ష, కార్యదర్శులు నగేష్, అబ్దుల్‌దేశాయ్, సిఐటియు నాయకులు, చిరు వ్యాపారులు పాల్గొన్నారు.

విశాఖలో భారీ దోపిడీ

10 తులాల బంగారం, రూ.3 లక్షలు నగదు చోరీ

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

విశాఖ కంచరపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో భారీ చోరీ జరిగింది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం... జాతీయ రహదారిలోని ఇందిరానగర్-5లో ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత ముగ్గురు గుర్తు తెలియని వ్యక్తులు మాస్కులు ధరించి ఎల్లాయమ్మ (73) ఇంట్లోకి చొరబడ్డారు. ఆమెను, ఆమె మనవడు కృష్ణకార్తీక్ (18) కింద గదిలో నిద్రపోగా, పైగదిలో మిగతా కుటుంబ సభ్యులు పడుకున్నారు. ఒంటిగంటకు ఇంట్లోకి చొరబడిన దుండగులు వృద్ధురాలిని తాళ్లతో కట్టేసి, ఆరు బంగారు గాజులతో పాటు రెండు తులాల చైన్ లాక్కున్నారు. అడ్డుకున్న ఆమె మనవడు కార్తీక్‌ను తీవ్రంగా కొట్టి, అతని చేతికి ఉన్న బంగారు ఉంగరం, బీరువాలో ఉన్న మరో బంగారు ఉంగరం, రూ.3 లక్షల నగదు తీసుకుని కారులో పరారయ్యారు. సిసి టివి ఫుటేజీ ఆధారంగా కంచరపాలెం నేర విభాగ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. క్లూస్ టీమ్ వచ్చి పరిశీలించింది. పోలీస్ జాగిలాలతో దుండగుల ఆచూకీని కనిపెట్టే పనిలో పోలీసులున్నారు. ఇది చెడ్డీ గ్యాంగ్ పనే అని పోలీసులు అనుమానిస్తున్నారు.

ఘనంగా తొలేళ్ల సంబరం

మాన్సాస్ చైర్మన్ అశోక్ గజపతిరాజు కుటుంబీకులు పట్టువస్త్రాలు సమర్పణ

అమ్మవారికి పట్టువస్త్రాలు తీసుకెళ్తున్న అనువంశిక ధర్మకర్త అశోక్‌గజపతిరాజు కుటుంబ సభ్యులు

ప్రజాశక్తి - విజయనగరం టౌన్

విజయనగరం పైడితల్లి అమ్మవారి తొలేళ్ల సంబరం సోమవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారి ఆలయం నుంచి కోట వరకు ఘటాలు ఊరేగింపుగా తీసుకెళ్లి కోటలోని రౌండ్ మహల్‌లో ఘటాలు ఉంచి పూజలు చేశారు. అనంతరం కోట ఎదురుగా ఘటాలను ఉంచి పూజారి రైతులకు వరి విత్తనాలు పంపిణీ చేశారు. రైతులు ఆ విత్తనాలు పొలాల్లో చల్లితే, వ్యాపారులు ఇంట్లో పెట్టుకుంటే మంచి పంటలు, లాభాలు చేకూరుతాయని వారి నమ్మకం. అధిక సంఖ్యలో యాత్రికులు తొలేళ్ల ఉత్సవంలో పాల్గొన్నారు. నగరమంతా పండగ శోభ సంతరించుకుంది. పులివేషాలు, కర్రసాము, కత్తిసాము, విచిత్ర వేషధారణలతో నగరంలో సందడి నెలకొంది. మాన్సాస్ చైర్మన్, పైడితల్లి అమ్మవారి ఆలయం అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్‌గజపతిరాజు కుటుంబ సభ్యులు ఎంఎల్‌ఎ అదితి విజయలక్ష్మి గజపతిరాజు తదితరులు అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు, జడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, మాజీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి కుటుంబ సభ్యులు అమ్మవారిని దర్శించుకున్నారు.

ఏథర్ 5 లక్షల యూనిట్ల ఉత్పత్తి

బెంగళూరు : దేశంలోని ప్రముఖ ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహన తయారీ సంస్థ ఏథర్ ఎనర్జీ లిమిటెడ్ వాహన ఉత్పత్తిలో నూతన మైలురాయిని చేరినట్లు ప్రకటించింది. తమిళనాడులోని హోసూర్‌లో ఉన్న తమ తయారీ ప్లాంట్ నుండి 5 లక్షల వాహనాన్ని అందుబాటులోకి తెచ్చినట్లు వెల్లడించింది. 5,00,000 స్కూటర్లను అధిగమించడం ఏథర్‌కు ఒక ప్రధాన మైలురాయి అని ఆ కంపెనీ సహ వ్యవస్థాపకుడు, సిటిఒ స్వప్నిల్ జైన్ పేర్కొన్నారు. 'మా మొట్టమొదటి ప్రోటోటైప్ నుండి నేటి వరకు, మా ప్రయాణం కేవలం వాహనాలను నిర్మించడం మాత్రమే కాదు, స్కేలబుల్, నమ్మకమైన, స్థిరమైన తయారీ వ్యవస్థను నిర్మించడంపై దృష్టి సారించింది" అని జైన్ తెలిపారు.



'ట్రేడ్ వాచ్ క్వార్టర్లీ' పుస్తకాన్ని విడుదల చేస్తున్న సుబ్రహ్మణ్యం

వేసవిలో భారత ఎగుమతులకు దెబ్బే

- అమెరికాతో డీల్ కుదరకపోతే కష్టమే
- 50 శాతం సుంకాలు చాలా భారమే
- నీతి అయోగ్ సిఇఒ సుబ్రమణ్యం వెల్లడి

న్యూఢిల్లీ : భారత్, అమెరికా మధ్య త్వరలో వాణిజ్య ఒప్పందం కుదరకపోతే వచ్చే వేసవి కాలంలో దేశీయ ఎగుమతులు భారీగా ప్రభావితం కావొచ్చని నీతి ఆయోగ్ సిఇఒ సుబ్రమణ్యం అన్నారు. వచ్చే నవంబర్ నాటికి ఒప్పందం కుదిరితే అంతరాయాలు తప్పవచ్చని ఆశాభావం వ్యక్తం చేశారు. "రెండు దేశాలూ వాణిజ్య ఒప్పందం కోసం కట్టుబడి ఉన్నాయి. గత నెలలో చర్చలు జరిగాయి. రెండు వైపులా ఆశలు ఇంకా సజీవంగానే ఉన్నాయి." అని సుబ్రమణ్యం అన్నారు. సోమవారం న్యూఢిల్లీలో ఆయన 'ట్రేడ్ వాచ్ క్వార్టర్లీ' రిపోర్ట్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా సుబ్రమణ్యం మాట్లాడుతూ.. క్రిస్మస్ వరకు ఎగుమతులపై ప్రభావం ఉండకపోవచ్చని అశాభావం వ్యక్తం చేశారు. కానీ వాణిజ్య ఒప్పందం జరగకపోతే వేసవి కాలంలో సమస్యలు తలెత్తవచ్చని ఆందోళన వ్యక్తం చేశారు. మనం క్లిష్ట సమస్యలో ఉన్నామన్నారు. 50 శాతం సుంకాలు చాలా భారమన్నారు. నవంబర్ నాటికి ఒప్పందం జరిగితే అంతరాయాలు ఉండకపోవచ్చన్నారు. భారత్, అమెరికా ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పంద చర్చలు జరుగుతున్నాయన్నారు. ప్రస్తుతం అమెరికా విధించిన 50 శాతం సుంకాలను తొలగించడంపై దృష్టి సారించాయన్నారు. భారత్ తన వాణిజ్య లోటును నిర్వహించుకునే స్థాయిలో ఉన్నప్పటికీ.. అసమతుల్యంగా ఉందని అన్నారు.

భారత్ తన సుంకాలు, సుంకేతర అడ్డంకులను తగ్గించాలని పేర్కొన్నారు. విదేశాల కోసం మార్కెట్‌లను తెరవడం ద్వారా తయారీ రంగంలో పోటీతత్వాన్ని పెంచాలన్నారు. భారత్ ఏ రంగాన్ని రక్షించకూడదని తన భావన అని అన్నారు. చైనాతో సహా ఆసియా దేశాలకు విక్రయించడానికి భారత్ పోటీతత్వంతో ఉండాలన్నారు. చైనా నుంచి పెట్టుబడులపై నిషేధాన్ని ఎత్తివేయడం గురించి అడిగిన ప్రశ్నకు సుబ్రమణ్యం సమాధానం ఇస్తూ.. చైనా భారత్‌కు దిగుమతుల విషయంలో ప్రధాన సరఫరాదారుగా ఉందని ఆయన చెప్పారు. 15 ట్రిలియన్ డాలర్ల చైనా ఆర్థిక వ్యవస్థను విస్మరించలేమని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వాలు కొత్త తయారీ విధానం క్లస్టర్‌లు, ప్రపంచ స్థాయి ఇకోసిస్టమ్‌పై దృష్టి పెట్టాలన్నారు. తయారీని వైవిధ్యపర్చాల్సిన అవసరం ఉందన్నారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ
ఆర్.ఓ.సి నెం: 2450/2025/ఇ1 ది.06.10.2025

ఇ-ప్రోక్యూర్మెంట్ టెండరు నోటీసు ప్రకటన
నిట్. నెం: 37/టి.టి.ఓ/2025-26 ది.06.10.2025

మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ - 15వ ఆర్థిక సంఘ నిధులు మరియు సాధారణ నిధుల క్రింద ఈ దిగువ ఉదహరించిన పనులకు గాను ఇ-ప్రొక్యూర్మెంట్ ద్వారా టెండరు పిలువబడినది.

మొత్తము పనులు: 61 అంచనా వ్యయము: రూ.480.98 లక్షలు

పని నెం: 01 నుండి 61 వరకు :
1. టెండరు షెడ్యూల్ డౌన్‌లోడ్ కొరకు నిర్ణయించిన ప్రారంభ తేది : ది.09.10.2025 ఉదయము గం. 11.00ని ల నుండి

పని నెం 12, 13, 18 & 19 లకు:
2. టెండరు షెడ్యూల్ డౌన్‌లోడ్ కొరకు నిర్ణయించిన చివరి తేదీ : ది.13.10.2025 ఉదయము గం. 11.00ని ల వరకు
3. ప్రైస్ బిడ్ తెరుచు తేది : ది.13.10.2025 మధ్యాహ్నము గం.02.00ని లకు

పని నెం : 1, 3, 7, 11, 14, 15, 16, 17, 20 టు 54, 58 & 61 లకు:
4. టెండరు షెడ్యూల్ డౌన్ లోడ్ కొరకు నిర్ణయించిన చివరి తేదీ : ది.16.10.2025 ఉదయము గం.11.00 ల వరకు
5. ప్రైస్ బిడ్ తెరుచు తేది : ది.16.10.2025 మధ్యాహ్నము గం.02.00ని లకు

పని నెం : 2, 4, 5, 6, 8, 9, 10, 55, 56, 57, 59 & 60 లకు:
6. టెండరు షెడ్యూల్ డౌన్‌లోడ్ కొరకు నిర్ణయించిన చివరితేదీ : ది. 23.10.2025 ఉదయము గం. 11.00ని ల వరకు
7. ప్రైస్ బిడ్ తెరుచు తేది : ది.23.10.2025 మధ్యాహ్నము గం.02.00ని లకు

మిగతా వివరములకు ఇ-ప్రొక్యూర్మెంట్ వెబ్‌సైట్ http://www.apeprocurement.gov.in చూడగలరు.

సం/- కమీషనర్,
మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ.

సంపాదకీయం

'సనాతన' ఉన్మాదం

దేశ సర్వోన్నత న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బిఆర్ గవాయ్‌పై సనాతనధర్మోన్మాదం తలకెక్కించుకున్న న్యాయవాది బూటు విసిరి దాడికి యత్నించిన అత్యంత ఆందోళనకర ఘటన ప్రస్తుతం దేశంలో నెలకొన్న దుస్థితిని తెలుపుతుంది. సోమవారం అత్యున్నత న్యాయస్థానంలో, అదీ ఒక కేసు విచారణ సందర్భంగా వాదనలు జరుగుతుండగా దుండగ మనస్తత్వం నిలువెల్లా నింపుకున్న ఒక లాయర్ ఎలాంటి జంకు భయం లేకుండా చీఫ్ జస్టిస్ పోడియం వైపు దూసుకెళ్లి దాడికి తెగబడటాన్ని తీవ్రంగా పరిగణించాలి. అప్రమత్తమైన భద్రతా సిబ్బంది ఆ వ్యక్తిని అదుపులోకి తీసుకొని పోలీసులకు అప్పగించారు. ఈ హఠాత్పరిణామంతో కోర్టులో తీవ్ర గందరగోళం నెలకొనగా, ఇటువంటి బెదిరింపులు తనను ప్రభావితం చేయబోవని గవాయ్ చూపిన నిబ్బరం న్యాయవ్యవస్థపై గౌరవాన్ని, మన జ్యుడీషియరీ ధృఢత్వాన్ని ఇనుమడింపజేసింది. కాగా దాడి చేసిన వ్యక్తి సనాతన ధర్మానికి అవమానం జరిగితే సహించబోమంటూ కోర్టు హాలులో చేసిన నినాదాలనుబట్టి దాడికి ప్రేరణ ఏమిటో, ఎవరో సులభంగానే బోధ పడుతుంది. జస్టిస్ గవాయ్‌పై దాడి ఉదంతంపై దేశ వ్యాప్తంగా నిరసనలు వ్యక్తమవుతున్నాయి. రాజ్యాంగ రక్షణను అభిలషించే ప్రతి ఒక్కరూ చీఫ్ జస్టిస్‌పై దాడిని ఖండించాలి.

జస్టిస్ గవాయ్‌పై దాడి ఘటన అదేదో సాదాసీదా యాదృచ్ఛికంగా చోటు చేసుకున్నది కాదు. కేవలం ఒక వ్యక్తి పిచ్చి అంతనకన్నా కాదు. వందేళ్ల ఆర్‌ఎస్‌ఎస్, పరివారం ప్రజల మెదళ్లకు ఎక్కించిన విద్వేష విషం. ప్రజల్లో మత విభజన సిద్ధాంత భావజాల వ్యాప్తిని ఘటన ప్రతిబింబిస్తుంది. కేంద్రంలో మోడీ ప్రభుత్వం వచ్చాక వ్యవస్థల ధ్వంసం సైద్ధాంతికంగా ఒక పథకం ప్రకారం సాగుతోంది. న్యాయ వ్యవస్థను సైతం వదిలిపెట్టలేదు. జస్టిస్ గవాయ్‌పై దాడి రాజ్యాంగానికి, ప్రజలకు అవమానం. సనాతన ధర్మాన్ని మోడీ ప్రభుత్వం భుజానికెత్తుకొని ప్రచారం చేస్తున్న తరుణంలో, జస్టిస్ గవాయ్‌పై దాడుల వంటివే సనాతన ధర్మమా? మోడీ, బిజెపి సమాధానం చెప్పాలి. మన రాష్ట్రంలో సనాతన ధర్మంపై ప్రచారం చేస్తున్న జనసేనాని పవన్ కళ్యాణ్, చీఫ్ జస్టిస్‌పై సనాతన వాది దాడిని ఖండిస్తారా, లేక మద్దతిస్తారో స్పష్టం చేయాలి. గవాయ్‌పై దాడిని తరతమ భేదం లేకుండా పార్టీలు, సంస్థలు, వ్యక్తులు నిరసిస్తుండగా, ఇప్పటి వరకు బిజెపి, మోడీ ప్రభుత్వం నుంచి ఎలాంటి బహిరంగ స్పందన వెలువడలేదు. దీన్నిబట్టి దాడిని పరోక్షంగా స్వాగతిస్తున్నారనుకోవాలి.

జస్టిస్ గవాయ్ దళిత కులానికి చెందిన వారైనందున, సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ అయిన దగ్గర నుంచీ సంఘ్ పరివారం, బిజెపి ఆయన్ని లక్ష్యంగా చేసుకొని వ్యతిరేక ప్రచారం లంకించుకున్నాయి. చీఫ్ జస్టిస్ బాధ్యతలు స్వీకరించాక మే నెలలో తొలిసారి స్వంత రాష్ట్రం ముంబయ్ పర్యటనకు వెళ్లినప్పుడు, అక్కడి బిజెపి ప్రభుత్వం కనీస ప్రొటోకాల్ పాటించకుండా ఘోరంగా అవమానపర్చింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డిజిపి, ముంబయ్ పోలీస్ కమిషనర్ వంటి ముఖ్య అధికారులు గవాయ్ పర్యటనకు ఉద్దేశపూర్వకంగా డుమ్మాకొట్టారు. అనంతరం పొరపాటు జరిగిందని మహారాష్ట్ర సర్కార్ సుప్రీం కోర్టు ముందు తప్పు ఒప్పుకొని విచారం వ్యక్తం చేయాల్సి వచ్చింది. జస్టిస్ గవాయ్ తల్లిదండ్రులపై మహారాష్ట్రలోని సంఘ్ పరివార్ మూకలు సోషల్‌మీడియాలో వ్యతిరేక ప్రచారం చేస్తుండటంపై వారు బహిరంగంగా నిరసన తెలియజేశారు. మొన్న అక్టోబర్ 5న మహారాష్ట్రలోని అమరావతిలో నిర్వహించిన ఆర్‌ఎస్‌ఎస్ శతవార్షికోత్సవానికి రావాలన్న ఆహ్వానాన్ని తిరస్కరిస్తున్నట్లు గవాయ్ తల్లి ప్రకటించారు. బీహార్ ఓటర్ల సవరణ, గవర్నర్ల వ్యవహారశైలి తదితరాలపై గవాయ్ జారీ ఉత్తర్వుల నేపథ్యంలో రాజకీయ కారణాలు కూడా ఆయనపై దాడికి పురిగొల్పి ఉండవచ్చు. ఈ పూర్వరంగంలో చూస్తే గవాయ్‌పై ఉద్దేశపూర్వకంగానే సంఘ్ పరివారం, బిజెపి పగబట్టి వెంటబడి వేధిస్తున్నాయని అర్థమవుతుంది. ఎంతటి వారినైనా వదిలిపెట్టబోమన్న పరివార్ హెచ్చరికగా గవాయ్‌పై దాడిని పరిగణించాలి. కోర్టు హాలులో గవాయ్‌పై దాడిని అగ్రకుల సనాతన ఉన్మాద సంస్కృతిలో భాగంగా చూడాలి. విభజన, విషపూరిత రాజకీయాల ప్రభావంతో సాగుతున్న విద్వేష చర్యలను అందరూ కలిసి సమర్థవంతంగా ఎదుర్కోవాలి. ఆ కర్తవ్య కార్యాచరణే వైవిధ్యభరిత భారతావనికి, రాజ్యాంగానికి తిరుగులేని రక్షణ కవచం.

మహనీయుల మాట



పేదరికంలో మగ్గుతున్న అభాగ్యుడికి తనను ఆకలికి గురిచేసిన దేశాన్ని ఎవరు పాలిస్తే ఏమిటి? తనకు కావలసిందంతా తన దుర్భర పరిస్థితిలో మార్పు వస్తుందా రాదా అనేదే.

- డేనియల్ డి లియోన్, అమెరికన్ సోషలిస్టు లేబర్ పార్టీ నాయకుడు.

6

దారీ తెన్నూ లేని పరిస్థితిలో పెట్టుబడిదారీ వ్యవస్థ

ప్రజాభిప్రాయం

ప్రభాత్ పట్నాయక్

ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థ ప్రయాణిస్తున్న దారి మూసుకు పోయింది. నయా ఉదారవాద వ్యవస్థలో నడిచే ప్రతీ దేశంలోనూ తీవ్రంగా పెరిగిపోయిన ఆదాయాల వ్యత్యాసాలు వ్యవస్థలో మాంద్యం ఏర్పడడానికి దారితీశాయి. ధనికులతో పోల్చితే పేదలకు వచ్చే ఆదాయంలో ఖర్చు చేసే శాతం చాలా ఎక్కువగా ఉంటుంది. అందుచేత ధనిక, పేద తరగతుల ఆదాయాల మధ్య వ్యత్యాసాలు పెరిగితే అప్పుడు ఉత్పత్తి సామర్థ్యం పెరిగినంత వేగంగా వినిమయం పెరగదు. అందువలన వృద్ధి రేటు మందగిస్తుంది. దాని వలన నిరుద్యోగం మరింత పెరుగుతుంది. 2008లో అమెరికాలో రియల్ ఎస్టేట్ బుడగ పేలిపోయినప్పటి నుంచీ ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ఈ పరిస్థితిలోనే ఇరుక్కుపోయింది. రియల్ ఎస్టేట్ బుడగ పెరుగుతున్నంత కాలమూ ఆర్థిక మాంద్యం ఏర్పడకుండా ఆపింది. ఒక్కసారి అది పేలిపోగానే ప్రపంచ ఆర్థిక వ్యవస్థను ఆర్థిక మాంద్యం ఆవరించింది.

రెండవ ప్రపంచ యుద్ధం అనంతర కాలంలో ఆర్థిక మాంద్యాన్ని నివారించడానికి రెండు ప్రామాణికమైన పద్ధతులను అనుసరిస్తూ వచ్చారు. ప్రభుత్వ వ్యయాన్ని పెంచడం మాంద్యాన్ని నివారిస్తుంది. ఆ వ్యయాన్ని భర్తీ చేయడానికి ద్రవ్యలోటుని పెంచడమో లేక సంపన్నుల మీద అదనంగా పన్నులు విధించడమో చేసేవారు. ఆర్థిక వ్యవస్థ విస్తరించాలంటే ఈ రెండు మార్గాలే ఉన్నాయి. కాని, నయా ఉదారవాదం ఈ రెండు మార్గాలలో దేనినీ అనుమతించదు. నయా ఉదారవాద శకంలో పెత్తనం చెలాయిస్తున్న అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి అటు ద్రవ్య లోటునూ పెంచడానికి అనుమతించదు. ఇటు ధనికుల మీద అదనపు పన్నులు విధించడానికీ ఒప్పుకోదు. అందుచేత ఈరోజు పెట్టుబడిదారీ వ్యవస్థ ముందున్న దారి మూసుకుపోయిందంటే అది నయా ఉదారవాదం వలన ఈ వ్యవస్థలో ఏర్పడిన మాంద్యం వల్లనే. అందువల్లే నిరుద్యోగం పెద్ద ఎత్తున పెరిగిపోయింది. ఆ నిరుద్యోగాన్ని నివారించడం ఈ నయా ఉదారవాద చట్రం పరిధి లోపల సాధ్యపడదు. పోనీ, ఈ నయా ఉదారవాద చట్రాన్ని వదిలిపెట్టి పెట్టుబడిదారీ వ్యవస్థలోనే మరొక కొత్త దారి వెతుక్కుందామా అంటే అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి ఆధిపత్యం కొనసాగుతూ వున్నంత కాలం అది కూడా సాధ్యం కాదు. ప్రపంచ వ్యాప్తంగా దేశాల ఎల్లలను దాటి స్వేచ్ఛగా పెట్టుబడి సంచరించడానికి ఎటువంటి ఆంక్షలను పెట్టినా, అందుకు అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి ఒప్పుకోదు.

ఇలా పెట్టుబడిదారీ వ్యవస్థ ముందు దారి మూసుకుపోయిన పరిస్థితిని చారిత్రిక నేపథ్యంలో చూడాలి. 19వ శతాబ్దంలో యూరప్ ఖండంలో పెట్టుబడిదారీ వ్యవస్థ చాలా కాలం పాటు ఊపుగా ముందుకు పోయింది. దాదాపు మొదటి ప్రపంచ యుద్ధం జరిగేదాకా ఈ ఊపు కొనసాగింది. ఐతే ఈ వృద్ధి తక్కిన ప్రపంచంలోని వివిధ ప్రాంతాల నుండి, ముఖ్యంగా తమ ఆధీనంలో ఉన్న వలస దేశాల నుండి, వనరులను, ముడిసరుకులను ఎక్కువ భాగం ఉచితంగా దోచుకోవడం మీద ఆధారపడి నడిచింది. ఇంకా పెట్టుబడిదారీ వ్యవస్థ ప్రవేశించని పూర్వ సమాజాలలోకి చొరబడి అక్కడి మార్కెట్లను కొల్లగొట్టే క్రమంలో పారిశ్రామిక పెట్టుబడి తొలుత బ్రిటన్ నుండి తక్కిన యూరప్ ఖండానికి, ఆ తర్వాత అక్కడి నుండి యూరోపియన్లు ఎక్కువగా వలసలు పోయి ఆక్రమించుకున్న కెనడా, అమెరికా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా దేశాలకు పెట్టుబడిదారీ వ్యవస్థను విస్తరింపజేసింది. ఇలా దాదాపు ఒక శతాబ్దం పాటు కొనసాగిన పెట్టుబడిదారీ వృద్ధి తమ వలసల నుండి, అర్ధ వలస దేశాల నుండి ముడి సరుకుల ఎగుమతులు ఊడ్చిపెట్టుకు పోవడంతో, భారతదేశం, చైనా వంటి దేశాల మార్కెట్లు కుదించుకు పోవడంతో నిలిచిపోయింది. ఇలా బైటనుండి ముడి సరుకులను కొల్లగొట్టుకు రావడం, వెనుకబడిన దేశాల మార్కెట్లను ఆక్రమించుకోవడం మీద ఆధారపడి కొనసాగిన పెట్టుబడిదారీ అభివృద్ధి ఆ రెండు రకాల ప్రేరణలూ అంతరించిపోవడంతో మాంద్యంలో పడింది. రెండు ప్రపంచ



యుద్ధాల నడిమి కాలంలో చాలా కాలంపాటు కొనసాగిన మహామాంద్యం దీనినే వ్యక్తం చేస్తుంది.

రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత కాలంలో పెట్టుబడిదారీ వ్యవస్థకు కొత్త ప్రేరణ లభించింది. అదే ప్రభుత్వ వ్యయాన్ని పెంచడం. దీనిమీద ఆధారపడి చాలా కాలం పాటు పెట్టుబడిదారీ వృద్ధి కొనసాగింది. దీనినే పెట్టుబడిదారీ దశ స్వర్ణయుగం" అని అభివర్ణిస్తారు. దాదాపు 1945 నుంచి 1980 దశకం దాకా కొనసాగిన ఈ వృద్ధి ఆ తర్వాత, నయా ఉదారవాద విధానాల ప్రవేశంతో ఇబ్బందుల్లో పడింది. ఈ నయా ఉదారవాద విధానాలు ఆర్థిక వ్యవస్థల్లో ప్రభుత్వ ప్రత్యక్ష జోక్యాన్ని అంగీకరించవు. అందుచేత ప్రభుత్వ వ్యయం, ఆర్థిక వ్యవస్థ మీద ప్రభుత్వ నియంత్రణ పరిమితులకు లోనవుతాయి. దాని ఫలితంగా ప్రస్తుతం పెట్టుబడిదారీ వ్యవస్థ చవిచూస్తున్న సంకట స్థితి ఏర్పడింది. ఇప్పుడు నెలకొన్న మాంద్యం 1930ల నాటి మహా మాంద్యం అంత లోతైనది, గాఢమైనది కాదు గాని దానితో పోల్చగల పరిస్థితే ఇప్పుడు ఉంది. ఈ చిక్కు పరిస్థితి నుండి బైటపడే దారి ఇంకా ఎక్కడా కానరావడం లేదు. ఇక్కడ లెనిన్ చెప్పినది మనం దృష్టిలో ఉంచుకోవాలి. "పెట్టుబడిదారీ వ్యవస్థకు అసాధ్యం అన్నది ఏదీ ఉండదు" అని ఆయన చెప్పారు. అదే సమయంలో ప్రస్తుతం పెట్టుబడిదారీ వ్యవస్థ చవిచూస్తున్న సంకట స్థితిని కూడా మనం తక్కువగా చూడకూడదు.

ప్రస్తుత పరిస్థితి రెండు రకాలుగా వ్యక్తం ఔతోంది. మొదటిది: ప్రపంచవ్యాప్తంగా నయా ఫాసిజం ముందుకొస్తోంది. ఫాసిజం అనేది రెండు పునాదుల మీద ఆధారపడి పెరుగుతుంది. అత్యంత తీవ్రమైన నిర్బంధం ఒకటైతే, నిస్సహాయులుగా ఉండే ఏదో ఒక మైనారిటీ తరగతి ప్రజల పట్ల-అది మైనారిటీ మతానికి చెందినవారు కాని, మైనారిటీ తెగలకు చెందినవారు కాని-తీవ్ర ద్వేషాన్ని తక్కినవారిలో కలిగించడం రెండవది. ఇలా ద్వేషాన్ని నూరిపోయడం కోసం ఫాసిజం ఆ సమాజంలో అదివరకటి నుంచీ కొనసాగుతున్న హెచ్చుతగ్గులను ఉపయోగించుకుంటుంది. ఆ క్రమంలో తాను గత కాలపు వారసత్వాన్ని పరిరక్షించడానికి పాటుపడుతున్నానన్న అభిప్రాయాన్ని ప్రజల్లో కలగజేస్తుంది. కాని వాస్తవం అందుకు పూర్తి భిన్నంగా ఉంది. ఫాసిజం అనేది పెట్టుబడిదారీ వ్యవస్థలో చాలా కాలం తర్వాత మొలకెత్తిన పెడధోరణి. అదేమీ ప్రాచీన కాలపు వారసత్వాన్ని ప్రతిబింబించదు. మెజారిటీ ప్రజల్లో మైనారిటీ ప్రజల పట్ల అది కలిగించే విద్వేష భావన అప్రయత్నంగా ఆ ప్రజల్లోనుండి తలెత్తినది కానే కాదు. గుత్త పెట్టుబడిదారుల సహాయంతో, వారి ప్రయోజనాలను నెరవేర్చడం కోసం పనిగట్టుకుని, కావాలనే ఈ విద్వేషాగ్నిని ఫాసిజం రాజేస్తుంది. ఇందుకు బడా పెట్టుబడిదారీ వర్గం ఆర్థిక సహాయాన్ని, తన ఆధీనంలో నడిచే మీడియా సంస్థల ద్వారా ప్రచారాన్ని అందిస్తుంది. ఆ తోడ్పాటుతో నయా ఫాసిస్టు గ్రూపులు సమాజ

> పెట్టుబడిదారీ విధానం ఎప్పుడూ తాను స్వేచ్ఛకు, ప్రజాస్వామ్యానికి ప్రతినిధిని అని చెప్పుకుంటుంది. అటువంటి వ్యవస్థలో నయా ఫాసిస్టు శక్తులు అధికారంలోకి రావడం అంటే అది ఆ పెట్టుబడిదారీ సంక్షోభం తీవ్రతను సూచిస్తుంది. అదే విధంగా అమెరికా తక్కిన దేశాల మీద సుంకాల యుద్ధాన్ని చేపట్టడం కూడా. మూడవ ప్రపంచ దేశాలను ఏదో ఒక విధంగా పీడించడం అమెరికాకు మామూలే అయినప్పటికీ, తన సహచర సామ్రాజ్యవాద దేశాల మీద సైతం ఇప్పుడు అమెరికా సుంకాల యుద్ధాన్ని సాగిస్తున్నదంటే అది ఎంత దిక్కు తోచని స్థితిలో పడిపోయిందో స్పష్టం అవుతోంది.

జీవితంలో కేంద్ర స్థానాన్ని చేరుకుంటాయి. విద్వేషాన్ని విరజిమ్ముతాయి. ఈ సంక్షోభ కాలంలో గుత్త పెట్టుబడిదారుల ఆధిపత్యానికి ఎదురయ్యే ఎటువంటి సవాళ్ళనైనా తట్టుకోడానికి వీలుగా సమాజంలో ప్రజాభిప్రాయాన్ని దారి మళ్ళిస్తాయి. అణచివేయబడుతున్న తరగతులను నిలువునా చీల్చి, ఆ తరగతులు గుత్త పెట్టుబడి పెత్తనాన్ని సవాలు చేయలేని స్థితిలో పడిపోయేలా చేయడమే నయా ఫాసిజం లక్ష్యం. ఈ సంక్షోభ కాలంలో తారాస్థాయికి చేరిన నిరుద్యోగం ఈ నయా ఫాసిస్టులకు కావలసిన "మూకలను" పోగేయడానికి ఉపయోగపడుతుంది. అందుకు కావలసిన నిధులను గుత్త పెట్టుబడిదారీ వర్గం ఎటూ సమకూరుస్తుంది.

1930 దశకంలో మహా మాంద్యం ప్రభావంతో పెట్టుబడిదారీ ప్రపంచం విలవిలలాడుతున్న సమయంలో జరిగింది ఇదే. మళ్ళీ ఇప్పుడు కూడా జరుగుతున్నది ఇదే. అప్పటికి, ఇప్పటికి తేడా ఏమంటే, ప్రస్తుత కాలంలోని పెట్టుబడిదారీ వ్యవస్థను సంకట స్థితి నుండి బైటపడవేయగల శక్తి ఇప్పటి ఫాసిస్టు శక్తులకు లేదు. అందుకే వాటిని 'నయా' ఫాసిస్టు శక్తులు అంటున్నాం. మహా మాంద్యం కాలంలో అప్పటి ఫాసిస్టు శక్తులు అధికారంలోకి వచ్చిన దేశాల్లో ప్రభుత్వ వ్యయాన్ని విపరీతంగా పెంచివేసి ద్రవ్యలోటును అందుకోసం బాగా పెంచాయి. ఆ ధనంతో సైనిక వ్యయాన్ని బాగా పెంచాయి. అప్పుడు కూడా ఆ యా దేశాల్లోని ద్రవ్య పెట్టుబడి బడ్జెట్ లోని ద్రవ్యలోటును పెంచడాన్ని తీవ్రంగా వ్యతిరేకించింది. ఐనప్పటికీ, అప్పటి ఫాసిస్టు ప్రభుత్వాలు తమ దేశాలలోని ద్రవ్య పెట్టుబడి వ్యతిరేకతను పక్కకు నెట్టివేసి తమ సైనిక వ్యయాన్ని పెంచుకున్నాయి. అప్పటి ద్రవ్య పెట్టుబడి ప్రధానంగా ఆ యా దేశాల స్థాయిలోనే ఉండడం వల్ల దాని వ్యతిరేకతను ఆ ప్రభుత్వాలు అధిగమించగలిగాయి. కాని వర్తమాన కాలంలో ద్రవ్య పెట్టుబడిని తన వైఖరిని మార్చుకునేలా, ద్రవ్య లోటు పెంపు పట్ల వ్యతిరేకతను వదులుకునేలా చేయగల సత్తా నయా ఫాసిజానికి లేదు. ఎందుకంటే ఇప్పుడు అది అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి అయింది. ఆ విధంగా అది అంతర్జాతీయ స్థాయికి బలపడింది గనుకనే అది సామ్రాజ్యవాద దేశాల నడుమ తలెత్తే వైరాలను సైతం అదుపు చేయగలుగుతోంది.

వర్తమాన కాలంలో నయా ఫాసిజం యుద్ధాలలోకి దిగకపోయే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయన్నది వాస్తవం. అందుచేత అది తన అధికారాన్ని నిలబెట్టుకోడానికి మామూలుగా జరిగే ఎన్నికల ప్రక్రియ మీదనే ఆధారపడాలి. ఆ క్రమంలో ఒక్కోసారి ఓటమి చవి చూసి అధికారాన్ని కోల్పోవచ్చు కూడా (స్వేచ్ఛగా, న్యాయబద్ధంగా ఎన్నికలు జరిగే పరిస్థితులలో). ఐతే, నయా ఫాసిస్టు శక్తులు ఎన్నికలలో అధికారాన్ని కోల్పోయి ఆ స్థానంలో ఫాసిస్టు-వ్యతిరేక శక్తులు అధికారంలోకి వస్తే, నయా ఉదారవాద సంక్షోభాన్ని అధిగమించడానికి అవి నయా ఉదారవాద వ్యవస్థ నుండి బైటకు రావలసి వుంటుంది (సంక్షోభాన్ని అధిగమించాలంటే ఇది తప్పనిసరి). అలా కాకుండా ఫాసిస్టు-వ్యతిరేక శక్తులు కూడా నయా ఉదారవాద చట్రం పరిధిలోనే పాలన కొనసాగిస్తే అప్పుడు నయా ఫాసిస్టులు మళ్ళీ అధికారంలోకి వస్తారు. అమెరికాలో ట్రంప్ ఆ విధంగానే మళ్ళీ అధికారంలోకి వచ్చాడు.

నయా ఉదారవాద పెట్టుబడిదారీ వ్యవస్థ ముందున్న దారి మూసుకుపోయిందన్న దానికి మొదటి సూచిక నయా ఫాసిజం బలపడడం అయితే, రెండో సూచిక ట్రంప్ ప్రభుత్వం భారీ స్థాయిలో సుంకాలను విధించడం. నయా ఉదారవాద విధానానికి కీలకమైనది దేశాల ఎల్లలను దాటి పెట్టుబడులు స్వేచ్ఛగా సంచరించగలగడం. ఇప్పుడు కూడా అందుకు ఎటువంటి ఆటంకాలూ ఎదురవడంలేదు. కాని ట్రంప్ ఏకపక్షంగా సుంకాలను భారీగా విధించడం అనేది ఒకమేరకు నయా ఉదారవాద సూత్రాల నుండి వెనక్కి పోవడమే ఔతుంది. స్వేచ్ఛా వ్యాపారం, స్వేచ్ఛగా పెట్టుబడుల ప్రవాహం కొనసాగితే అభివృద్ధి జరుగుతుందని నయా ఉదారవాదం ప్రచారం చేసింది కాని అమెరికాలో ఉపాధి అవకాశాలు ఏమాత్రమూ మెరుగుపడలేదు. ఇప్పుడు ట్రంప్ సుంకాలను పెంచుతున్నది అమెరికాలో ఉపాధి అవకాశాలను పెంచుకోవడం కోసమే. ఐతే సుంకాలను ఇలా భారీగా పెంచినందువలన ఇప్పుడు అమెరికాలో ఉన్న నిరుద్యోగం వాస్తవంగా తక్కిన దేశాలకు ఎగుమతి అవుతుంది. తక్కిన దేశాలను దెబ్బ తీసి అమెరికా తన దేశంలో ఉపాధి అవకాశాలను పెంచుకోడానికి ప్రయత్నిస్తోంది. తక్కిన దేశాలను దెబ్బ తీసి తన ఆర్థిక పరిస్థితిని మెరుగు పరుచుకోవాలనే ప్రయత్నాలు 1930 దశకంలోని మహా మాంద్యం కాలంలో కూడా జరిగాయి. అప్పుడు ఇతర దేశాలతో పోటీపడి కరెన్సీ మారకపు విలువను తగ్గించుకుని దాని ద్వారా ఎక్కువ మార్కెట్ వాటాను చేజిక్కించుకోవాలని ప్రయత్నించారు. కాని ఆ ప్రయత్నం సఫలం కాలేకపోయింది.

అది అమెరికా కాబట్టి ఏకపక్షంగా నయా ఉదారవాద వ్యవస్థ చట్రం నుండి ఇలా పాక్షికంగా వెనక్కి తగ్గి సుంకాలను పెంచడం జరిగింది. అదే వేరే ఏ ఇతర దేశమైనా ఇదే పని చేసి వుంటే అది ఈ పాటికి "మదుపుదారుల విశ్వాసాన్ని" కోల్పోయి వుండేది. అంటే ఆ దేశం నుండి పెట్టుబడులు బైటకు నిష్క్రమించి వుండేవి. అదే జరిగితే అప్పుడు ఆ దేశపు కరెన్సీ విలువ అమాంతం కుప్పకూలి వుండేది. అమెరికన్ డాలర్‌కు ఇప్పటికీ ఎంత శక్తి ఉందంటే, అది నయా ఉదారవాద చట్రం నుండి పాక్షికంగా వెనక్కి పోయినా, ఆ డాలరు విలువ యూరోతో పోల్చితే ఒక సంవత్సరం కాలంలో కేవలం 4.57 శాతం మాత్రమే తగ్గింది. ట్రంప్ ప్రభుత్వం ఆశించినంత మేరకు అమెరికాలో ఉపాధి అవకాశాలు పెరగకపోవచ్చు. తక్కిన దేశాలు ఎటువంటి ప్రతీకార చర్యలూ చేపట్టకపోయినా, దిగుమతి సుంకాలను భారీగా పెంచినందువలన అలా దిగుమతయ్యే సరుకుల ధరలు పెరిగి అమెరికాలో ద్రవ్యోల్బణం పెరుగుతుంది. ఆ మేరకు అధిక సుంకాల ద్వారా అమెరికాకు కలిగే రక్షణకు పరిమితి ఏర్పడుతుంది. కాని అమెరికా విధించిన అధిక సుంకాలు తక్కిన ప్రపంచంలో సంక్షోభాన్ని మరింత తీవ్రతరం చేయడం ఖాయం (ఈ అధిక సుంకాల తాకిడిని తట్టుకోడానికి తక్కిన దేశాలు తమ ఆర్థిక వ్యూహాలలో ఏవైనా మార్పులు చేయగలిగితే తప్ప. అలా చేయగలిగే అవకాశాలు కూడా తక్కువే).

పెట్టుబడిదారీ విధానం ఎప్పుడూ తాను స్వేచ్ఛకు, ప్రజాస్వామ్యానికి ప్రతినిధిని అని చెప్పుకుంటుంది. అటువంటి వ్యవస్థలో నయా ఫాసిస్టు శక్తులు అధికారంలోకి రావడం అంటే అది ఆ పెట్టుబడిదారీ సంక్షోభం తీవ్రతను సూచిస్తుంది. అదే విధంగా అమెరికా తక్కిన దేశాల మీద సుంకాల యుద్ధాన్ని చేపట్టడం కూడా. మూడవ ప్రపంచ దేశాలను ఏదో ఒక విధంగా పీడించడం అమెరికాకు మామూలే అయినప్పటికీ, తన సహచర సామ్రాజ్యవాద దేశాల మీద సైతం ఇప్పుడు అమెరికా సుంకాల యుద్ధాన్ని సాగిస్తున్నదంటే అది ఎంత దిక్కు తోచని స్థితిలో పడిపోయిందో స్పష్టం అవుతోంది. ఈ రెండు తీవ్ర ధోరణులూ (నయా ఫాసిజం, ట్రంప్ సుంకాల యుద్ధం) పెట్టుబడిదారీ వ్యవస్థ ఎంత తీవ్ర సందిగ్ధ స్థితిలో పడి కొట్టుకుంటున్నదో తెలియజేస్తున్నాయి.

(స్వేచ్ఛానుసరణ)

పచ్చని చేలల్లో ఆయుధ కుంపటి

సమస్య

ఎ. రవి

ఏలూరు జిల్లా జీలుగుమిల్లి మండలం వంకావారిగూడెంలో నేవీ విభాగానికి అవసరమైన ఆయుధాల డిపోను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నిస్తోంది. నేవీ ఆయుధ డిపో పేరుతో చేస్తున్న భూ సేకరణను వెంటనే నిలిపివేయాలని, అటవీ హక్కుల చట్టం, పీసా చట్టం, గ్రామసభల తీర్మానాలను గౌరవించాలని ప్రజలు కోరుతున్నారు. తమ గ్రామంలో డిపో వద్దని, ప్రత్యామ్నాయ ప్రదేశంలో పెట్టమని వారు వేడుకొంటున్నారు. సానుకూల స్పందన కొరవడడంతో ప్రభుత్వానికి, ఆదివాసీలకు మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది.

జీలుగుమిల్లి మండలం వంకావారిగూడెంలో 1160 ఎకరాల్లో నేవీ ఆయుధ డిపో ఏర్పాటు చేయనున్నట్లు ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్, పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, జిల్లా కలెక్టర్ ప్రకటించారు. గత వైసిపి ప్రభుత్వం ఇందుకు పూనుకుంది. వారి హయాంలో రెండు సార్లు పీసా గ్రామసభలు జరిపారు. ఆ సందర్భంగా అక్కడి ప్రజలందరూ ముక్త కంఠంతో వ్యతిరేకించారు. నాటి వైసిపి ప్రతిపాదనను తెలుగుదేశం, ప్రస్తుత జనసేన ఎమ్మెల్యే సైతం అప్పుడు వ్యతిరేకించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడగానే మరోసారి పీసా గ్రామసభ జరిపారు. ప్రజలు గతంలోవలె తీవ్రంగా వ్యతిరేకించడంతో ప్రజల అభీష్టానికి వ్యతిరేకంగా ఆయుధ డిపో పెట్టబోమని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ ప్రకటించారు. ఇప్పుడు ప్లేట్ ఫిరాయించారు. నేవీ అధికారులు మాత్రం ప్రజల ఆమోదంతోనే భూములు సేకరించాలని చెప్తున్నారు.

ఈ డిపోను 1160 ఎకరాల్లో 35 ఎకరాల్లో నిర్మిస్తారని, మిగిలిన భాగంలో పాఠశాల, ఆసుపత్రి, సిబ్బంది క్వార్టర్స్ నిర్మిస్తామని చెబుతున్నారు. ఇది పదేళ్ళకు పూర్తవుతుందని, ప్రత్యక్షంగా 2 వేల మందికి, పరోక్షంగా 10 వేల మందికి ఉపాధి కల్పిస్తుందని అంకెల గారడీ చేస్తున్నారు. స్థానికులకే ఉపాధి అవకాశాలు, పూర్తి స్థాయిలో పునరావాసం, భూమి పరిహారం, ఇల్లుకు ఇల్లు, ప్యాకేజీ ఇస్తామని మోసపూరిత వాగ్దానాలు చేస్తున్నారు. పోలవరం జాతీయ ప్రాజెక్టులో నిర్వాసితులైన లక్ష కుటుంబాల్లో కేవలం 10 వేల కుటుంబాలకు కూడా పూర్తి స్థాయిలో పునరావాసం కల్పించలేదు. పోలవరం నిర్వాసితులకు నేటికీ ప్యాకేజీ దక్కక, ఇళ్ల పూర్తికాక,

> పచ్చని జీలుగుమిల్లి మండలం వ్యవసాయ రంగంలో ముందుంది. ఇక్కడ రెండు పంటలు (పామాయిల్, పొగాకు, వేరుశనగ, వరి, మిర్చి తదితరాలు) పండిస్తున్నారు. ఇటువంటి సారవంతమైన భూములను ఇచ్చేది లేదని గిరిజనులు, పేదలు ముక్త కంఠంతో చెబుతున్నా ప్రభుత్వం మొండిగా వ్యవహరించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. చిత్రమేమిటంటే భూసేకరణ పూర్తయిందని జిల్లా కలెక్టర్, ఎంపీ, ఎమ్మెల్యేలు తప్పుడు ప్రకటనలు చేస్తున్నారు. ఈ ప్రాంతంలోనే అటవీ భూములున్నాయి. అవి ప్రతిపాదిత జాతీయ రహదారికి చేరువుగా ఉన్నాయి. వాటిలో ఆయుధ డిపో నిర్మాణం చేపట్టవచ్చు.

పూరైన కాలనీల్లో మౌలిక వసతులు లేక, కాలనీల్లో నిర్వాసితులకు చేసుకొనేందుకు పనులు, ఉపాధి లేక అల్లాడుతున్నారు. ప్రభుత్వమే బాధ్యత వహిస్తున్న జాతీయ ప్రాజెక్టు నిర్వాసితుల పరిస్థితే ఈ విధంగా ఉంటే...ఆయుధ పరిశ్రమ విషయంలో నేవీ అధికారులు అక్కడి ప్రజలను పట్టించుకుంటారా అనే అనుమానాలు ప్రజలకున్నాయి.

ఏలూరు ఏజెన్సీ 5వ షెడ్యూల్లో పోలవరం, బుట్టాయిగూడెం, జీలుగుమిల్లి, కుకునూరు, వేలేరుపాడు మండలాలున్నాయి. ఇందులో పోలవరం ప్రాజెక్టు వల్ల కుకునూరు, వేలేరుపాడు మండలాలు కొద్ది కాలంలో కనుమరుగు కానున్నాయి. ఈ మండలాల్లో ప్రజలకు బుట్టాయిగూడెం, జీలుగుమిల్లి మండలాల్లో పునరావాసం కల్పిస్తున్నారు. దీనికితోడు అల్లూరి సీతారామరాజు మన్యం జిల్లా వారికి ఇక్కడే పునరావాసం కల్పించనున్నారు.

ఇప్పటికే పోలవరం ప్రాజెక్టు పేరుతో, జల్లేరు రిజర్వాయర్ పేరుతో, అభయారణ్యం పేరుతో, బొగ్గు గనుల పేరుతో అడవి బిడ్డలను ఆ ప్రాంతం నుండి దూరం చేస్తున్నారు. జాతీయ రహదారి 666ను ఈ ప్రాంతంలోనే నిర్మిస్తున్నారు. అభివృద్ధి పేరుతో చేపట్టే కార్యక్రమాలన్నింటినీ ఏజెన్సీ ప్రాంతంలోనే సాగిస్తున్నారు. ఆదివాసీ గిరిజనుల్ని సమిధలుగా మారుస్తున్నారు. బందెలదొడ్డిలో పశువుల మందల్ని కుక్కిన పద్ధతిలో ఈ కొద్దిపాటి ప్రాంతంలోనే ఆదివాసీలను ఇరికించాలని చూస్తున్నారు. లేదా ఈ ప్రాంతం నుండి తరిమేయాలని ప్రభుత్వాలు చూస్తున్నాయి. తద్వారా వారి బతుకుల్ని నాశనం చేస్తున్నారు. పీసా గ్రామసభల తీర్మానం సుప్రీంకోర్టు తీర్పుతో సమానం. ప్రజల అంగీకారం లేకుండా భూసేకరణ చేయరాదు. షెడ్యూల్ ఏరియా చట్టాలను, పీసా గ్రామ సభల తీర్మానాలను ప్రభుత్వం గౌరవించాలి. ఆయుధ డిపో నిర్మాణాన్ని ఉపసంహరించుకోవాలి. గిరిజనుల భూములకు రక్షణ కల్పించాలి.

పచ్చని జీలుగుమిల్లి మండలం వ్యవసాయ రంగంలో ముందుంది. ఇక్కడ రెండు పంటలు (పామాయిల్, పొగాకు, వేరుశనగ, వరి, మిర్చి తదితరాలు) పండిస్తున్నారు. ఇటువంటి సారవంతమైన భూములను ఇచ్చేది లేదని గిరిజనులు, పేదలు ముక్త కంఠంతో చెబుతున్నా ప్రభుత్వం మొండిగా వ్యవహరించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. చిత్రమేమిటంటే భూసేకరణ పూర్తయిందని జిల్లా కలెక్టర్, ఎంపీ, ఎమ్మెల్యేలు తప్పుడు ప్రకటనలు చేస్తున్నారు. ఈ ప్రాంతంలోనే అటవీ భూములున్నాయి. అవి ప్రతిపాదిత జాతీయ రహదారికి చేరువుగా ఉన్నాయి. వాటిలో ఆయుధ డిపో నిర్మాణం చేపట్టవచ్చు. కావున ప్రత్యామ్నాయ ప్రాంతంలో డిపోను నిర్మించాలని, వంకావారిగూడెంలో ప్రజల అభీష్టానికి వ్యతిరేకంగా ఈ డిపోను నిర్మించవద్దని ప్రజలు శాంతియుతంగా సాగిస్తున్న ఆందోళనలను అణచివేసేందుకు ఈ ప్రాంతంలో 144, 30 సెక్షన్లు విధించారు. అయినా తహశీల్దార్‌కు సామూహిక వినతిపత్రాన్ని అందజేసేందుకు అవకాశం ఇవ్వమని డిఎస్పీని కోరగా నక్సల్స్ ప్రమాదం ఉందనే సాకుతో ఆందోళనకు అనుమతిని నిరాకరించారు. వాస్తవానికి గత పదేళ్ళుగా నక్సల్స్ కదలికలే లేవు. అయినా ఒక్కసారిగా వందలాది మంది ప్రజలు రోడ్లపైకి వచ్చి తమ నిరసన తెలిపారు. ఆయుధ డిపో పెట్టనీయబోమని వారు ముక్త కంఠంతో నినదించారు. ఇకనైనా ప్రభుత్వం ప్రజాస్వామ్యబద్ధంగా స్థానిక ప్రజల అభిప్రాయాలను గౌరవించి, రాజ్యాంగబద్ధమైన షెడ్యూల్ చట్టాలను అమలు చేసి ఈ ప్రాంతంలో ఆయుధ డిపో నిర్మాణాన్ని విరమించాలి. ప్రత్యామ్నాయ ప్రాంతంలో నిర్మించాలి.

/ వ్యాసకర్త సిపిఎం ఏలూరు జిల్లా కార్యదర్శి /

మీ వ్యాసాలను పంపాల్సిన మెయిల్ :
editpageps @ gmail.com

పావలా వడ్డీకి విద్యారుణాలు

(మొదటిపేజీ తరువాయి)

అయితే ప్రస్తుతం వాటి ఆస్తుల స్థితిగతులు తెలుసుకునేందుకు మదింపు జరగాలని చెప్పారు. ఆదరణ-3 కింద ఇచ్చే పనిముట్లు ఆధునీకంగా, ఆయా కుల వృత్తులకు ఉపయోగకరంగా ఉండాలని అన్నారు. రజకులకు గ్యాస్‌తో పనిచేసే ఇస్త్రీ పెట్టెలు, సబ్సిడీ సిలిండర్లు ఇచ్చే అంశాన్ని పరిశీలించాలని చెప్పారు. వెనుకబడిన వర్గాల ఆదాయార్జనకు కొత్త మార్గాలను అన్వేషించాలని సూచించారు. మత్స్యకార వర్గాలు సీవీడ్ వంటి నూతన ప్రత్యామ్నాయాలను ఎంచుకునేలా ప్రోత్సహించాలని చెప్పారు. వెనుకబడిన వర్గాలను ఉన్నత స్థానానికి తీసుకెళ్లాలని ఈ వర్గాలపై ప్రభుత్వం పెద్దఎత్తున వ్యయం చేస్తోందని, అయినా ఫలితాలు ఆశించిన స్థాయిలో రావడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ,బిసి, మైనార్టీ సంక్షేమ శాఖల మంత్రులు డోలా బాలవీరాంజనేయస్వామి, ఎస్ సవిత, ఎన్ఎండి ఫరూక్ తదితరులు పాల్గొన్నారు. బిసి రెసిడెన్షియల్ స్కూల్లో చదివే విద్యార్థుల్లో ఈ ఏడాది ట్రిపుల్‌ఐటీకి ఎంపికైన కొంతమంది విద్యార్థులు సమీక్ష సమావేశానికి ముందు ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. వారిని అభినందించి ఉన్నత విద్యలో మరింత రాణించాలని చంద్రబాబు ఆకాంక్ష వ్యక్తం చేశారు

అమరావతికి కేంద్రం అన్ని విధాలా సాయం

- కేంద్ర సహాయ మంత్రి రామదాస్ అథవాలే

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాజధాని అమరావతి అభివృద్ధికి కావాల్సిన అన్ని విధాలా సాయం అందించేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉంటుందని కేంద్ర సామాజిక, న్యాయ సాధికారత మంత్రిత్వశాఖ సహాయ మంత్రి రామదాస్ అథవాలే తెలిపారు. విజయవాడలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 2047 నాటికి దేశ ఆర్థిక వ్యవస్థను 30 ట్రిలియన్ డాలర్ల స్థాయికి చేర్చి, పేదరిక నిర్మూలనకు కేంద్ర ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతోందన్నారు. ప్రధాన మంత్రి ప్రవేశపెట్టిన 'మేక్ ఇన్ ఇండియా, మేడ్ ఇన్ ఇండియా' కార్యక్రమాల ద్వారా దేశంలో అంకుర సంస్థలు, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు, యూనికార్న్ సంస్థలు వృద్ధి చెందుతూ ప్రజలకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాయని తెలిపారు. కేంద్ర ప్రాయోజిత పథకాలను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆయనతోపాటు ఆర్‌పిఐ(ఎ) పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కొమ్మిరెడ్డి బ్రహ్మానంద రెడ్డి తదితరులు ఉన్నారు.

రాష్ట్ర మంత్రుల వినతులు

రాష్ట్రానికి రావాల్సిన ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ పెండింగ్ నిధులను విడుదల చేయాలని కేంద్ర సహాయ మంత్రి రామదాస్ అథవాలేను రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి కోరారు. విజయవాడలోని ఒక హోటల్‌లో కేంద్ర మంత్రిని డోలా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రానికి రావాల్సిన నిధులు, పలు అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి చర్చించారు. సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి నెలరోజుల్లో అట్రాసిటీ పెండింగ్ నిధులు విడుదల చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు.

ఎంజెపి పాఠశాలల అభివృద్ధికి సహకరించండి

మహాత్మా జ్యోతిరావు పూలే బిసి గురుకుల పాఠశాలల (ఎంజెపి స్కూల్స్) అభివృద్ధికి సహకరించాలని కేంద్ర సహాయ మంత్రి రామదాస్ అథవాలేను రాష్ట్ర బిసి సంక్షేమశాఖ మంత్రి ఎస్ సవిత కోరారు. రాష్ట్రంలో డిఎన్‌టి కులాల లబ్దిదారులు వివిధ స్వయం ఉపాధి పథకాల కోసం దరఖాస్తు చేసుకున్నారని, వాటి పరిష్కారానికి సహకరించాలని కోరారు. ఎంజెపి స్కూల్స్ అభివృద్ధికి రూ.66 కోట్లు మంజూరు చేయాలన్నారు. ఇతర పలు అంశాలకు సంబంధించి వినతులను కేంద్ర మంత్రికి అందజేశారు.

మరణించిన యువతి వాంగ్మూలం ఇచ్చిందా?

- పోలీసుల నివేదికపై హైకోర్టు ఆగ్రహం

ప్రజాశక్తి-అమరావతి

'ఆస్పత్రికి తీసుకొచ్చేసరికే ఆమె చనిపోయింది. కానీ, ఆమె వాంగ్మూలం ఇచ్చింది. చనిపోయిన యువతి వాంగ్మూలాన్ని పోలీసులు ఎక్కడికి వెళ్లి నమోదు చేశారో అర్థం కావడం లేదు. ఇలా కథలు చెప్పే సాహసం ఒక్క పోలీసులకు మాత్రమే ఉంటుందేమో. ఎలాంటి కట్టుకథలనైనా పోలీసులు అల్లగలరు. ఈ ఒక్క ఘటనను బట్టి పోలీసులు కేసుల దర్యాప్తు ఎంత చట్టబద్ధంగా సాగిస్తున్నారో తేటతెల్లం అవుతోంది. పోలీసులకు కోర్టులంటే లెక్కలేదు. కోర్టు ఉత్తర్వులంటే అస్సలే పట్టదు' అని పోలీసుల తీరుపై హైకోర్టు నిప్పులు చెరిగింది. దళిత యువతి మృతి ఘటనను ఆత్మహత్యగా పేర్కొంటూ పోలీసులు దాఖలు చేసిన అఫిడవిట్‌ను పరిశీలించిన హైకోర్టు విస్తుపోయింది. పోలీసుల తీరుపై న్యాయమూర్తి జస్టిస్ బట్టు దేవానంద్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గుంటూరు జిల్లా, బుడంపాడులోని సెయింట్ మేరీస్ ఇంజినీరింగ్ కాలేజీలో అమృతలూరు మండలం, గోపాయపాలెం ప్రాంతానికి చెందిన జి శ్రావణ సంధ్య పాలిటెక్నిక్ ఫస్ట్ ఇయర్ చదువుతూ 2017 ఫిబ్రవరి 28న అనుమానాస్పద రీతిలో మరణించింది. తన కుమార్తె శ్రావణిని హత్య చేశారని, ఇందుకు కాలేజీ యాజమాన్యం, రూమ్‌మేట్స్ కారణమంటూ ఆమె తల్లి గర్నెపూడి జయలక్ష్మి అదేరోజు నల్లపాడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే, పోలీసులు అనుమానాస్పద మృతి కేసుగా నమోదు చేయడం, దర్యాప్తులో పురోగతి లేకపోవడంతో జయలక్ష్మి 2017 జులైలో హైకోర్టులో పిటిషన్ వేశారు. సిబిఐ దర్యాప్తునకు ఆదేశించాలని కోరారు. కాలేజీ యాజమాన్యం, పోలీసులు, ఆస్పత్రి వర్గాలు ఒక్కటై తన కుమార్తె హత్యను ప్రమాదవశాత్తూ భవనం పై నుంచి పడి మరణించినట్లుగా మార్చేశారని ఆమె వాదన. ఈ పిటిషన్‌ను న్యాయమూర్తి విచారణ చేపట్టి పోలీసుల దర్యాప్తు తీరును తీవ్రంగా ఆక్షేపించారు. చట్ట ప్రకారం దర్యాప్తు జరగలేదనేందుకు ప్రాథమిక ఆధారాలున్నాయని తేల్చారు. దర్యాప్తును సిబిఐకి అప్పగించడమే సబబు అని కూడా అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో పోలీసులు కేసు దర్యాప్తుపై ఎస్‌పి నివేదికను సమర్పించగా, దానిని పరిశీలించి దిగ్భ్రాంతికి గురయ్యారు. మృతురాలే భవనం పై నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నట్లుగా పోలీసులకు చెప్పినట్లు నివేదికలో ఉండటంపై ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఎనిమిదేళ్లుగా కేసు దర్యాప్తు ఎందుకు పూర్తి చేయలేదని నిలదీశారు. పిటిషన్ విచారణలో ఉందని చెప్పి చార్జిషీట్ వేయలేదని ప్రభుత్వ న్యాయవాది జయంతి చెప్పడాన్ని తప్పుపట్టారు. చార్జిషీట్ వేయొద్దన్న మధ్యంతర ఉత్తర్వులు ఏమీ లేవు కదా? అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఎస్‌పి దాఖలు చేసిన నివేదికపై పిటిషనర్ తరపున న్యాయవాది వాదనల నిమిత్తం విచారణను ఈ నెల 10కి వాయిదా వేశారు.

ఫ్రాన్స్ నూతన ప్రధాని సెబాస్టియన్ లెకోర్న్ రాజీనామా

పారిస్ : ఫ్రాన్స్ నూతన ప్రధాని సెబాస్టియన్ లెకోర్న్ సోమవారం తన పదవికి రాజీనామా చేశారు. కేబినెట్‌ను ప్రకటించిన ఒక రోజు తర్వాత ఈ ఘటన చోటుచేసుకుంది. ప్రధానిగా బాధ్యతలు చేపట్టి నెలరోజులు కూడా కాకముందే ఆయన రాజీనామా చేయడం గమనార్హం. అధ్యక్షుడు ఇమాన్యుయేల్ మాక్రాన్ ఆయన రాజీనామాను ఆమోదించారని ఫ్రాన్స్ అధ్యక్ష కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. సెబాస్టియన్ లెకోర్న్ కేబినెట్ ఎంపికపై రాజకీయ వర్గాల్లో తీవ్ర విమర్శలు వ్యక్త మయ్యాయి. ముఖ్యంగా మాజీ ఆర్థిక మంత్రి బ్రూనో లెమైర్‌ను రక్షణ మంత్రిగా తిరిగి తీసుకోవాలనే ఆయన నిర్ణయంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇతర కీలక పదవుల్లో పెద్దగా మార్పులు ప్రకటించలేదు. బ్రూనో రిటైల్ అంతర్గత మంత్రిగా, పోలీసింగ్ మరియు అంతర్గత భద్రత బాధ్యతలను చేపట్టారు. జీన్ నోయెల్ బారోట్ విదేశాంగ మంత్రిగా కొనసాగుతుండగా, జెరాల్డ్ డార్మానిన్ న్యాయమంత్రిత్వ శాఖను నిర్వహిస్తున్నారు.

పాక్ రక్షణ మంత్రి అవాకులు

ఇస్లామాబాద్ : భారత్‌కు హెచ్చరికలు చేసే దుస్సాహసానికి పాకిస్తాన్ ఒడిగట్టింది. భవిష్యత్తులో సైనిక ఘర్షణలు తలెత్తరాదని ఒకవేళ తలెత్తిన పక్షంలో భారత్‌ను వారి యుద్ధ విమానాల రెక్కల కిందనే సమాధి చేస్తామని పాకిస్తాన్ రక్షణ మంత్రి ఖవాజా అసిఫ్ ఆదివారం అవాకులు మాట్లాడారు. ఉగ్రవాదానికి మద్దతును కొనసాగిస్తే ప్రపంచ పటం నుండి పాకిస్తాన్‌ను తుడిచేస్తామంటూ భారత రక్షణ మంత్రి, ఆర్మీ చీఫ్‌లు హెచ్చరించిన రెండు రోజుల తర్వాత పాక్ వ్యాఖ్యలు వెలువడ్డాయి.

251 ఉక్రెయిన్ డ్రోన్‌లను కూల్చివేసిన రష్యా

మాస్కో : సుమారు 251 ఉక్రెయిన్ డ్రోన్‌లను కూల్చివేసినట్లు రష్యా రక్షణ మంత్రిత్వ శాఖ సోమవారం తెలిపింది. ఆదివారం రాత్రి సమయంలో వైమానిక రక్షణ హెచ్చరిక వ్యవస్థలు 251 ఉక్రెయిన్ ఫిక్స్‌డ్-వింగ్ మానవరహిత డ్రోన్‌లను అడ్డగించి, ధ్వంసం చేశాయని పేర్కొంది.

దక్షిణమధ్య రైల్వే

మమ్మల్ని X @ SCRailwayindia ద్వారా అనుసరించవచ్చు, ద.మ రైల్వేలోని టెండరు ప్రకటనల వివరాలు మా వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.in లో చూడవచ్చు.

ఓపెన్ టెండరు ప్రకటన నం.బి-ఇ29-టిఆర్‌డి-టిఎన్‌డిఆర్-26-2025-26 తేది: 03.10.2025

PUB/1242

కింది పనుల కోసం క్రింద సంతకం చేసిన వారిచే ఐఆర్‌ఇపిఎస్‌లో టెండర్లు ఆహ్వానించబడ్డాయి.

టెండరు నం.: టెండరు నం.బి-ఇ29-టిఆర్‌డి-టిఎన్‌డిఆర్-26-2025-26 **పని పేరు:** గోదావరి పుష్కరాలు-2027కి సంబంధించి RJY యార్డ్‌లోని BZA డివిజన్‌లోని OHE కి చేర్పులు మరియు మార్పులు. **అంచనా.విలువ:** (రూ) 1,28,13,357.28 **పూర్తి కాలం:** 12 నెలలు **బిడ్ సెక్యూరిటి (ఇఎమ్‌డి) :** (రూ) 2,14,100/- **ముగింపు తేది:** 23.10.2025 మ.3.00 గం.లకు.

టెండరు ఫారం ధర: నిల్

ఎన్‌బి: టెండర్ ప్రారంభ తేదీ సెలవు దినం అయితే, తదుపరి పని దినాన టెండర్ తెరవబడుతుంది.

దయచేసి మా సైట్‌ను సందర్శించండి **www.ireps.gov.in**

ఎస్‌ఆర్.డివిజినల్ ఎలక్ట్రికల్ ఇంజనీరు, టిఆర్‌డి, విజయవాడ

A1565

తదుపరి టెండర్ నియమాలు/వివరాలు మరియు టెండర్ డాక్యుమెంట్ల డౌన్‌లోడ్ కోసం దయచేసి వెబ్‌సైట్ https:www.ireps.gov.in లేదా www.scr.indianrailways.gov.in ని సందర్శించండి.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము

రహదారులు మరియు భవనముల శాఖశాఖ.

ఇ-ప్రొక్యూర్మెంట్ ప్రకటన

షార్ట్ ఎన్ఐటి టెండరు ప్రకటన నం.17/ఇ-ప్రొ./టిఇ./2025-26, తేది.03.10.2025 ఆన్‌లైన్ టెండర్లు ఇ-ప్రొక్యూర్మెంట్ ప్లాట్‌ఫారం క్రింద 3 రహదారుల పనుల కొరకు (ఆర్ మరియు బి డివిజన్) విజయవాడలో, ఆహ్వానించబడుతున్నాయి. **అంచనా విలువ: రూ.40.00 లక్షలు.** టెండరు స్వీకరణ చివరి తేది 06.10.2025 నుండి 13.10.2025 మ.3.30 గం.ల వరకు. ఇతర వివరములు ఇ-మార్కెట్ ప్లేస్ అనగా., **www.eprocurement.gov.in** వద్ద చూడవచ్చును.

సం/- నిర్వాహక ఇంజనీరు, (ఆర్ మరియు బి) డివిజన్, విజయవాడ

DIPRNo: 17700/CL/ADVT/1/1/2021-22

KVB Karur Vysya Bank Smart way to bank

ది కరూర్ వైశ్యాబ్యాంకు లిమిటెడ్

పోరంకి బ్రాంచ్, డి.నెం.3-43, నేతాజీ స్ట్రీట్, పోరంకి, పెనమలూరు మండలం, కృష్ణా జిల్లా

బంగారు నగల వేలము ప్రకటన

ఈ క్రింది ఉదహరించిన ఖాతాదారుడు బంగారు నగలపై ఋణం మరియు వేరే ఇతర ఋణాలు తీసుకున్నారు. ఇతర ఋణాలు మరియు ఆభరణాలు యన్‌యమ్‌పి అయినవి. కారణంగా బ్యాంక్ నిబంధనలు ప్రకారం **తేది.14.10.2025 అనగా మంగళవారం మధ్యాహ్నం 3.00 గం॥ల నుండి** మా బ్రాంచి ఆవరణలో వేలం వేసి బాకీలు వసూలు చేసుకుందామని ఈ ప్రకటన ద్వారా తెలియజేయడమైనది.

షరతులు నిబంధనలు : 1) వేలంలో పాల్గొనదలచినవారు ఋణ మొత్తమునకు **రూ.10,000/-** ధరావత్తు కట్టి వేలంలో పాల్గొనవలెను. 2) హెచ్చు పాటదారుడు మొత్తం సొమ్ము అదేరోజు చెల్లించి వస్తువులను పొందవలెను. 3) నగలు బరువునకు, నాణ్యతకు బ్యాంకు వారి పూచీ ఏమాత్రం లేదు. 4) ఏ విధమైన కారణం చూపకనే వేలం షరతులు మార్చుకొనుటకు గానీ, వాయిదా వేయుటకు గానీ, వేలం ఆపుటకు గానీ, రద్దు చేయుటకు గానీ బ్యాంకు వారికి పూర్తి అధికారం కలదు. 5) అడ్రస్ నిర్ధారించు ఆధార్ కార్డు కాపీని గాని, పాన్‌కార్డు కాపీని జతచేయవలెను. 6) ఈ ఖాతాదారులలో ఎవ్వరైనను మరణించిన యెడల వారి వారసులకు ఈ ప్రకటన పూర్వకముగా తెలియపరచినట్లుగా భావించవలెను. 7) అప్పు వసూలు నోటీసు అందనివారు మరియు నోటీసులు తిరస్కరించినవారు ఈ ప్రకటన తుది నోటీసుగా భావించి వేలం తేదీలోగా సొమ్ము చెల్లించవలెను.

ఖాతా నెం.	ఋణగ్రస్తుని పేరు , చిరునామా & ఖాతా నెం.లు	బంగారం స్థూల బరువు గ్రా॥లో
1463948000001643	యస్.కమల్ ప్రసాద్, తండ్రి : యస్‌విపి బాపయ్య, ,ఫ్లాటు నెం.102, 1వ అంతస్థు, శ్రీ సాయి నికేత విహార్, బి జె ఆర్ నగర్, పోరంకి, 521137	71.400 గ్రా॥లు

తేది : 06.10.2025, ప్రదేశం : పోరంకి సం/- అధీకృత అధికారి, ది కరూర్ వైశ్యా బ్యాంక్ లిమిటెడ్, పోరంకి బ్రాంచ్

రైల్వే మంత్రిత్వ శాఖ (దక్షిణ మధ్య రైల్వే)

నోటిఫికేషన్

PUB/1244

రైల్వే మంత్రిత్వ శాఖ
(దక్షిణ మధ్య రైల్వే)
నోటిఫికేషన్
సికింద్రాబాద్, 24 సెప్టెంబరు, 2025

ఎస్.ఓ.4365 (ఇ)- రైల్వే యాక్ట్ 1989 యొక్క సెక్షన్ 2 లోని క్లాజు (37ఎ) ద్వారా ఇవ్వబడిన అధికారాలను వినియోగించుకుంటూ, కేంద్ర ప్రభుత్వం దీని ద్వారా 1×25కెవి నుండి 2×25కెవి వరకు ఉన్న ఎలక్ట్రిక్ ట్రాక్షన్ సిస్టమ్ యొక్క గ్రేడేషన్ పనిని 3000 ఎమ్‌టి లోడింగ్ లక్ష్యానికి ఒక ప్రత్యేక రైల్వే ప్రాజెక్టుగా నోటిఫై చేస్తుంది. ఈ నోటిఫికేషన్ అధికారిక గెజిట్‌లో ప్రచురించబడిన తేది నుండి అమలులోకి వస్తుంది. వివరాలు క్రింద పేర్కొనబడ్డాయి.

క్రసం.	సెక్షన్	టిఎస్‌ఎస్	జిల్లా
1	సికింద్రాబాద్-కాజీపేట	ఆలేరు	యాదాద్రి భువనగిరి
2		ఘన్‌పూర్	జనగాం
3		ఘట్‌కేసర్	మేడ్చల్ మల్కాజ్‌గిరి
4	వడి- వికారాబాద్	తండూర్	వికారాబాద్
5	బల్హార్షా-రామగుండం	బెల్లంపల్లి	మంచెరియాల
6		రామగుండం	పెద్దపల్లి
7	కాజీపేట-డోర్నకల్	నెకొండ	వరంగల్
8		డోర్నకల్ జంక్షన్	మహబూబాబాద్
9	ఖమ్మం-కొండపల్లి	బోనకలు	ఖమ్మం
10		కొండపల్లి	ఎన్‌టిఆర్
11	రామగుండం- కాజీపేట	కాజీపేట	హనుమకొండ
12		జమ్మికుంట	కరీమ్‌నగర్

(ఎఫ్.నం.సిఇఇ/ప్రాజెక్ట్/ఎస్‌సి/ఎస్‌ఆర్‌పి/2×25కెవి/ఎల్ఎ/37ఎ/2)

A1567 అమిత్ అగ్రవాల్, సిఇ/కాన్./ప్లానింగ్ అండ్ సర్వే

यूनियन बैंक ऑफ इंडिया Union Bank of India A Government of India Undertaking

UMFB గుడివాడ బ్రాంచి (01461)
10/52-1, గౌరీశంకరపురం, గుడివాడ-521301, కృష్ణాజిల్లా, ఏ.పి.

అమ్మకం గురించి ఋణగ్రహీతకు తెలియపరుచు ప్రకటన (30 రోజుల ప్రకటన)
(RULE 6(2)/RULE 8(6) OF SECURITY INTEREST (ENFORCEMENT) RULES 2002)

ఋణగ్రహీతలు/కో ఆబ్లిగెంట్స్ / తనఖాదారులు / హామీదారులు:

ఋణగ్రహీతలు: 1. శ్రీ పాలడుగు రామ ప్రసాద్, తండ్రి: సత్యనారాయణ రావు, డి.నెం. 8/330ఎ, రాజేంద్ర నగర్, గుడివాడ (మండలం), కృష్ణాజిల్లా, ఆంధ్రప్రదేశ్ - 521301. **2. శ్రీ వల్లభనేని భాను ప్రకాష్,** తండ్రి: సుబ్రహ్మణ్యేశ్వర రావు, గుడ్లవల్లేరు గ్రామం, గుడ్లవల్లేరు (మండలం), కృష్ణా జిల్లా, ఆంధ్రప్రదేశ్ - 521356. **3. శ్రీ కొడాలి నాగేశ్వర రావు,** శ్రీమతి కె.ఎస్.ఆర్.ఎల్.వి. చాముండేశ్వరి దేవి యొక్క జి.పి.ఎ. హోల్డర్, తండ్రి: అర్జున రావు, డి.నెం. 10-154-డి-4, 10వ వార్డు, రాజేంద్ర నగర్, గుడివాడ (మండలం), కృష్ణాజిల్లా, ఆంధ్రప్రదేశ్ - 521301.

విషయం: సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 ప్రకారం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, యు.ఎం.ఎఫ్.బి గుడివాడ బ్రాంచి (01461) వారికి మీకు చెందిన బకాయి వసూలు కొరకు మీకు చెందిన ఆస్తి అమ్మకం.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, **యు.ఎం.ఎఫ్.బి గుడివాడ బ్రాంచి (01461)**, సెక్యూర్డ్ క్రెడిటార్, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002లోని సెక్షన్ 13(2) క్రింద **ది. 02-01-2014** తేదీన జారీ చేసిన డిమాండ్ నోటీసు ద్వారా అందులో పేర్కొన్న సమయంలోగా బకాయిలు చెల్లించాలని మిమ్మల్ని కోరడమైనది. మీరు ఆ నోటీసులో నిర్దేశించిన గడువులోగా దాన్ని పాటించడంలో విఫలం అయినందున అధీకృత అధికారి సదరు చట్టంలోని సెక్షన్ 13(4) మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 6 / 8తో కలిపి **ది. 18.09.2025**న సెక్యూర్డ్ ఆస్తులను లాంఛనాత్మకంగా స్వాధీనం చేసుకున్నారు.

సెక్యూర్డ్ ఆస్తిని లాంఛనాత్మకంగా స్వాధీన పరచుకున్న తర్వాత కూడా, మీరు బ్యాంక్‌కు చెల్లించవలసిన బకాయి మొత్తమును మీరు చెల్లించలేదు. అందువలన, ఈ నోటీసు తేదీ నుండి 30 దినములు తర్వాత దిగువ తెలిపిన ఆస్తిని ఈ-వేలం ద్వారా విక్రయించవలసిన అవసరం ఏర్పడినది. ఈ-వేలం యొక్క తేదీ మరియు సమయం, ఆస్తి యొక్క రిజర్వ్ ధర మరియు ఈ-వేలం నిర్వహించబడే సర్వీస్ ప్రొవైడర్ వివరాలు మీకు విడిగా తెలియజేయబడతాయి.

అందువల్ల, మీరు అమ్మకపు నోటీసు ప్రచురణ తేదీకి ముందే బ్యాంక్‌కు చెల్లించాల్సిన మొత్తాన్ని, తదుపరి వడ్డీ, ఖర్చులు, ఛార్జీలు మరియు బ్యాంక్ చేసిన వ్యయాలతో సహా చెల్లిస్తే, ఆస్తి అమ్మకం కోసం ఎటువంటి తదుపరి చర్యలు తీసుకోబడవు మరియు చట్టంలోని సెక్షన్ 13(8) లో పేర్కొన్నట్లుగా మీరు మీ ఆస్తిని విముక్తి చేసుకోవచ్చు.

క్రింద పేర్కొనబడిన ఆస్తి అమ్మకానికి నిర్ణయించబడిన రిజర్వు ధర **రూ. 2,91,60,000/-** (అక్షరాలా రెండు కోట్ల తొంభై ఒక్క లక్షల అరవై వేల రూపాయలు మాత్రమే).

షెడ్యూల్ ఆస్తి వివరములు

ఐటెం నెం. 1: ఆంధ్రప్రదేశ్, కృష్ణాజిల్లా, గుడివాడ సబ్-రిజిస్ట్రార్, గుడివాడ మున్సిపల్ ఏరియా, గుడివాడ, పరిధిలో కోతిబొమ్మ సెంటర్ దగ్గర, 16వ వార్డు, సర్వే నెం. 191/3, డి. నెం. 16/366-ఎ-1 దగ్గర, మొత్తం విస్తీర్ణం 455 చదరపు గజాలు శ్రీమతి కె.ఎస్.ఆర్.ఎల్.వి. చాముండేశ్వరి దేవి (జి.పి.ఎ. హోల్డర్ శ్రీ కొడాలి నాగేశ్వర రావు ద్వారా ప్రాతినిధ్యం వహించబడిన) పేరున కలదు. **హద్దులు: తూర్పు:** వట్టెం ప్రేమ్ కిరణ్ మొదలైన వారి స్థలం మరియు కొడాలి శ్రీ వెంకటేశ్వర రావు గారి స్థలం, **దక్షిణం:** కొడాలి వింధ్య రాణి గారి స్థలం 39 అంగుళాలు, **పడమర:** శ్రీ రాజ్యలక్ష్మి విజయ చాముండేశ్వరి దేవి గారి స్థలం 105 అంగుళాలు, **ఉత్తరం:** గుడివాడ నుండి పామర్రు రోడ్డు మార్జిన్ 39 అంగుళాలు.

ఐటెం నెం. 2: ఆంధ్రప్రదేశ్, కృష్ణాజిల్లా, గుడివాడ సబ్-రిజిస్ట్రార్, గుడివాడ మున్సిపల్ ఏరియా, గుడివాడ, పరిధిలో కోతిబొమ్మ సెంటర్ దగ్గర, 16వ వార్డు, సర్వే నెం. 191/3, డి. నెం. 16/366-ఎ-1 దగ్గర, మొత్తం విస్తీర్ణం 315 చదరపు గజాలు శ్రీమతి కె.ఎస్.ఆర్.ఎల్.వి. చాముండేశ్వరి దేవి (జి.పి.ఎ. హోల్డర్ శ్రీ కొడాలి నాగేశ్వర రావు ద్వారా ప్రాతినిధ్యం వహించబడిన) పేరున కలదు. **హద్దులు: తూర్పు:** వట్టెం నాగ ప్రసాద్ రావు గారి స్థలం 105 అంగుళాలు, **దక్షిణం:** కొడాలి వింధ్య రాణి గారి స్థలం 27 అంగుళాలు, **పడమర:** పుట్టేపు దుర్గారావు గారి స్థలం 105 అంగుళాలు, **ఉత్తరం:** బందరు - తిరువూరు రోడ్డు మార్జిన్.

తేది: 01.10.2025 **అధీకృత అధికారి**
ప్రదేశము: గుడివాడ **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా**

---

homefirst We'll take you home

Home First Finance Company India Limited
CIN: L65990MH2010PLC240703
Website: homefirstindia.com Phone No.: 180030008425
Email ID: loanfirst@homefirstindia.com

దిగువ పేర్కొన్న రుణగ్రహీతలైన మీరు షెడ్యూల్‌లో పేర్కొన్న ఆస్తిని తాకట్టుపెట్టుటచే రుణం పొందియున్నారు మరియు దిగువ పేర్కొన్న మీరు రుణ ఒప్పందం కొరకు రుణగ్రహీత/ సహ-రుణగ్రహీత హామీదారుగా ఉన్నారు. మీరు డిఫాల్ట్ చెందిన పర్యవసానంగా, సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్ చట్టం, 2002 (సంక్షిప్తంగా సర్ఫాసీ చట్టంలో) యొక్క నియమాల క్రింద **03.10.2025**న నాన్-పర్ఫార్మింగ్ అసెట్‌గా వర్గీకరించబడినది. మేము హోమ్ ఫస్ట్ ఫైనాన్స్ కంపెనీ ఇండియా లిమిటెడ్ గా మీరు సమర్పించిన చిరునామాకు సర్ఫేసి చట్టం యొక్క సెక్షన్ 13(13)తో చదవగల సెక్షన్ 13(2) క్రింద డిమాండ్ నోటీసును జారీచేశాము. సదరు నోటీసులు **03.10.2025**న జారీ చేయబడినవి మరియు సదరు నోటీసులో పేర్కొన్నదేమనగా మీకు మంజూరు చేయబడిన చెల్లింపుల్లో మీరు డిఫాల్ట్ చెందియున్నారు. కావున, సర్ఫాసీ చట్టం యొక్క సెక్షన్ 13(2) యొక్క నియమాలు మరియు సెక్యూరిటి ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 3(1) క్రింద నియమాలను అనుసరించి నోటీసు పంపుటకు ప్రస్తుత ప్రచురణ జారీచేయబడినది.

క్ర. సం.	ఖాతా చిరునామా మరియు రుణగ్రహీత(లు) మరియు హామీదారు(ల) పేరు	అమలు చేయబడిన సెక్యూరిటీల వివరాలు	డిమాండ్ నోటీసు తేది నాటికి మొత్తం బకాయి ప్లస్ తదుపరి వడ్డీ మరియు ఇతర వ్యయాలు (రూ.లో)
1	రాజేశ్వరి వలేటి, రవితేజ వలేటి, కృష్ణ తేజ వలేటి, శ్రీనివాసరావు వలేటి	ఇల్లు-డో.నం.213-16, డో.నం.4-106, మూల్యాంకనం నం.706, హైస్కూల్ రోడ్డు, గణపవరం గ్రామం (గ్రామ పంచాయతీ, నాదెండ్ల మండలం, పల్నాడు జిల్లా, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522619 హద్దులు : తూర్పు : వలేటి సుబ్బారావు ఆస్తి, దక్షిణం : పంచాయతీ బజారు, పడమర : వలేటి రాఘవరావు ఆస్తి, ఉత్తరం : కరి శివకుమారి ఆస్తి.	16,30,955
2	ప్రత్తిపాటి సీలయ్య, ప్రత్తిపాటి నాగరత్నం	ఇల్లు- డో.నం.9-104, మూల్యాంకనం నం.1176, డో.నం.395-ఎ1, పాటిబండ్ల గ్రామ పంచాయతీ పరిధి, పెదకూర మండలం, పెదకూరపాడు ఉప జిల్లా ఎల్లక, నరసరావుపేట రీ జిల్లా, పల్నాడు జిల్లా:522402,గుంటూరు, ఆంధ్రప్రదేశ్- 522402. హద్దులు : తూర్పు : పాటిబండ్ల ఇన్నయ ఆస్తి, దక్షిణం : ప్రత్తిపాటి జోసు ఆస్తి, పడమర : ప్రత్తిపాటి మణి కుమార్ ఆస్తి, ఉత్తరం : పంచాయతీ బజారు.	7,91,186
3	రోగోలు అశోక్, రాగోలు శారద, రాగోలు జయమ్మ, రాగోలు మట్టెసు	ఇల్లు- డో.నం.1-1/5-6, మూల్యాంకనం నం.1085022587, ఎస్.సి.నం.131102ఎ20206867, టౌన్ సర్వే నెం. 436-4, ఆదివరంపేట, బలగ వార్డు, శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్, శ్రీకాకుళం మండలం, శ్రీకాకుళం ఎస్ఆర్ఓ, శ్రీకాకుళం, ఆంధ్రప్రదేశ్-532001. హద్దులు : ఉత్తరం : మున్సిపల్ సిమెంటు రోడ్డు, దక్షిణం : డి.వెంకటరావు భవనం, తూర్పు : ఆర్.జనార్ధన్ ఆస్తులు, పడమర : మున్సిపల్ సిమెంటు రోడ్డు.	7,72,628

మిమ్మల్ని కోరడమేమనగా వడ్డీ మరియు ఖర్చులతో పై మొత్తాలను ఈ నోటీసు తేది ప్రచురణ తేది నుండి 60 రోజుల కాలవ్యవధిలోపు ఎఫ్ఆర్ఓ 5196 (పాత), కొత్త మున్సిపల్ నం.17-2-180, కొలత 300 చ.గ.లు. చావని నది అలిబాగ్ హైదరాబాద్, తెలంగాణ-500023 వద్ద ఉన్న **హోమ్ ఫస్ట్ ఫైనాన్స్ కంపెనీ ఇండియా లిమిటెడ్** వారికి చెల్లించాలి, విఫలం చెందితే రుణగ్రహీతలు, తాకట్టుదారులు మరియు హామీదారుల యొక్క సెక్యూర్డు ఆస్తుల స్వాధీనతా తీసుకొనుటతోసహా సెక్యూర్డు అసెట్స్ యొక్క అన్ని లేదా ఏదేని లేదా మరిన్నింటిపై సదరు చట్టం యొక్క నియమాల క్రింద **హోమ్ ఫస్ట్ ఫైనాన్స్ కంపెనీ ఇండియా లిమిటెడ్** అవసరమైన చర్య తీసుకుంటుంది. సదరు చట్టం క్రింద **హోమ్ ఫస్ట్ ఫైనాన్స్ కంపెనీ ఇండియా లిమిటెడ్**కు లభించు అధికారాలతోసహా (1) సెక్యూర్డు అసెట్స్ రియలైజింగ్ కొరకు అమ్మకం యొక్క లీజు, అసైన్‌మెంట్‌చే బదిలీచేయు హక్కులతోసహా రుణగ్రహీతలు/హామీదారుల సెక్యూర్డు అసెట్స్ స్వాధీనతాను చేపట్టు అధికారం (2) **హోమ్ ఫస్ట్ ఫైనాన్స్ కంపెనీ ఇండియా లిమిటెడ్** చే సెక్యూర్డు అసెట్‌గా ఏదేని బదిలీ మరియు సెక్యూర్డు అసెట్స్‌ను రాబట్టుటకు మరియు లీజు, అసైన్‌మెంట్ లేదా అమ్మకం రూపంలో బదిలీ హక్కులతోసహా సెక్యూర్డు అసెట్ యొక్క మేనేజ్‌మెంట్‌పై తీసుకొనుటకు అన్ని హక్కులు మరియు మీచే బదిలీ చేయబడినందున బదిలీ చేయబడిన సెక్యూర్డు ఆస్తులకు సంబంధించినవి.

సదరు చట్టం యొక్క సెక్షన్ 13(13) యొక్క నియమాలను అనుసరించి, మీరు **హోమ్ ఫస్ట్ ఫైనాన్స్ కంపెనీ ఇండియా లిమిటెడ్** వారి ముందస్తు అనుమతి లేకుండా **హోమ్ ఫస్ట్ ఫైనాన్స్ కంపెనీ ఇండియా లిమిటెడ్**కు హైపోథికేట్ చేసిన/ తాకట్టుపెట్టిన మరియు పై సూచించిన సెక్యూర్డు ఆస్తుల ఏదేని అమ్మకం, లీజు లేదా ఇతరత్రా (మీ వ్యాపారం యొక్క నార్మల్ కోర్స్‌లో కాకుండా) రూపంలో బదిలీచేయుట నుండి మీరు నిషేధించబడినారు.

ప్రదేశం : విజయవాడ సం/- అధీకృత అధికారి
తేది : 07.10.2025 హోమ్ ఫస్ట్ ఫైనాన్స్ కంపెనీ ఇండియా లిమిటెడ్

Chola Enter a better life

చోళమండలం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్

కార్పొరేట్ కార్యాలయం : చోళా క్రెస్ట్, సి54 మరియు 55, సూపర్ బి-4, తిరు వి క ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండీ, చెన్నై-600 032, టి.ఎన్.

ఇ-వేలం విక్రయ నోటీసు (ఇ-బిడ్డింగ్ అమ్మకం ద్వారా మాత్రమే)

సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 8(6) మరియు 9(1) క్రింద స్థిరాస్తి సెక్యూర్డ్ అసెట్స్ యొక్క విక్రయ నోటీసు

దిగువ వివరించిన స్థిరాస్తులు సెక్యూర్డ్ క్రెడిటర్‌కు తనఖా పెట్టినట్లు సాధారణంగా ప్రజలకు మరియు ప్రత్యేకించి రుణగ్రహీత/సహ-రుణగ్రహీత/ హామీదారు(లు) కాలమ్ (సి)లో దిగువ వివరించిన స్థిరాస్తు(లు) తనఖాపెట్టబడిన/ఛార్జ్‌చేయబడిన కాలమ్ (ఎ)లో చూచించబడినవి సెక్యూర్డ్ క్రెడిటార్‌కు వసూలు చేయబడింది. చోళమండలం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ యొక్క అధీకృత అధికారి ద్వారా కాలమ్ (డి)లో వివరించిన విధంగా స్వాధీనం తీసుకున్న దాన్ని ఇకపై చోళమండలం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ సెక్యూర్డ్ క్రెడిటార్ తాకట్టు ఆస్తులు "ఎక్కడ ఉన్నాయో అక్కడే ", "ఏమి ఉన్నాయో వాటినే ", మరియు "ఏది ఉంటే అదే " పద్ధతి లో ఇ-వేలం ద్వారా విక్రయించబడతాయి. వివరాలు క్రింది విధంగా ఉన్నాయి.:
రుణగ్రహీత/తనఖాదారు(లు)/చట్టపరమైన వారసులు, చట్టపరమైన ప్రతినిధులు (తెలిసిన లేదా తెలియకపోయినా), కార్యనిర్వాహకు(లు), నిర్వాహకు(లు), సంబంధిత రుణగ్రహీత(లు)/తనఖాదారు(లు) (మరణించినప్పటి నుండి) వారికి నోటీసు ఇవ్వడమేమనగా సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8(6) కింద కాలమ్ (ఎ)లో సూచించబడిన కేస్ కావచ్చు. ఈ-వేలం వివరణాత్మక నియమాలు మరియు షరతుల కోసం చోళమండలం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ సెక్యూర్డ్ క్రెడిటార్ అందించిన వెబ్‌సైట్ https://www.cholamandalam.com & www.auctionfocus.in లింక్‌ను దయచేసి చూడండి.

	[A]	[B]	[C]	[D]	[E & F]	[G]
క్ర. సం.	లోన్ అకౌంట్ నం. రుణగ్రహీత(లు)/ తనఖాదారు(లు)/హామీదారు(లు) పేరు	ఓ/ఎస్ కారణంగా రికవర్ అయిన బకాయిలు (సెక్యూర్డ్ డెట్స్)	స్థిరాస్తి/సెక్యూర్డ్ అసెట్ వివరణ	స్వాధీనత విధానం	రిజర్వు ధర (రూ.లో) / బయానా మొత్తం (రూ.లో)	వేలం తేది మరియు సమయం
1.	లోన్ అకౌంట్ నం.: X0HLVJI00002691266 1. శ్రీ/శ్రీమతి. వెంకటేశ్వరరావు కొలుసు, 2. శ్రీ/శ్రీమతి. విజయ కొలుసు, చిరునామా : 14-1951/2, లెనిన్ నగర్, రెవెన్యూ వార్డు నం.14, తాడేపల్లి, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522501. ఇక్కడ కూడా : శ్రీసాయిరామ్ రెసిడెన్సీ, గ్రౌండ్ ఫ్లోర్ ఫ్లాట్ నం.101, ఎన్.డో.నం.77-149-20, పాయకాపురం పాయకాపురం కృష్ణ-520015.	26.09.2025 నాటికి బకాయి రూ. 25,91,020/- (ఇరవై ఐదు లక్షల తొంభై ఒక్క వేల ఇరవై రూపాయలు మాత్రమే)	ఎ-షెడ్యూల్ : ఎన్‌టిఆర్ జిల్లా, విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ ఏరియా, విజయవాడ, పాయకాపురం, ఎ-కాలనీ, విద్యాసాగర ఉద్యోగి నగర్ వద్ద ఉన్న ప్లాట్ నం.310, ఆర్.ఎస్.నం.17-4, 17-1బి, 11-2సి, 11-2బి, 11-2ఎ, 11-1, 10-1, 17-3, 18-2, 13-2, 13-1 లో అవిభక్త ఉమ్మడి పరిధి 37.50 చ.గ.లు. బయట మొత్తం పరిధి 300 చ.గ.లు. తో కలిపి "శ్రీ సాయిరామ్ రెసిడెన్సీ"లోని గ్రౌండ్ ఫ్లోర్‌లో ఫ్లాట్ నం.101 ఆస్తి తో బిల్ట్ అప్ ఏరియా 768 చ.అ.లు., సాధారణ ఏరియా 192 చ.అ.లు. పార్కింగ్ ఏరియా 80 చ.అ.లు. డో.నం.77-149-20 వద్ద ఉన్న హద్దులు : తూర్పు: ప్లాట్ నం.317 ఆస్తి 45-0 అ.లు., దక్షిణం : ప్లాట్ నం.309 ఆస్తి 60-0 అ.లు., పడమర : 33-0 అ.లు. వెడల్పు రోడ్డు 45-0 అ.లు., ఉత్తరం : ప్లాట్ నం.311, 60-0 అ.లు. పై సరిహద్దుల సైట్ పరిధి 300 చ.గ.లు. లేదా 250.9 చ.మీ.లు. ఆ సైట్ పేర్కొనబడని మరియు అవిభక్త ఉమ్మడి వాటా పరిధి 37.50 చ.గ.లు. బి-షెడ్యూల్ : పై ఎ-షెడ్యూల్ సైట్, "శ్రీ సాయిరామ్ రెసిడెన్సీ" పేరు మరియు శైలిలో నిర్మించబడిన అపార్టుమెంట్‌లోని గ్రౌండ్ ఫ్లోర్‌లో ఫ్లాట్ నం.101 తో 768 చ.అ.లు. ప్లింత్ ఏరియా, 192 చ.అ.లు. సాధారణ ఏరియా తో పాటు 80 చ.అ.లు. కార్ పార్కింగ్ (డ్రైవ్ మార్గం) ఉన్న హద్దులు : తూర్పు : కామన్ కారిడార్, లిఫ్ట్ మరియు మెట్లకేస్, దక్షిణం : ఓపెన్ టు స్కై, పడమర : ఓపెన్ టు స్కై, ఉత్తరం : ఓపెన్ టు స్కై.	[illegible]	రూ. 23,10,000/- (ఇరవై మూడు లక్షల పది వేల రూపాయలు మాత్రమే) / రూ. 2,31,000/- (రెండు లక్షల ముప్పై ఒక్క వేల రూపాయలు మాత్రమే)	10.11.2025, మ.02.00గం.ల నుండి సా.04.00 గం.ల వరకు (టెండర్ పత్రం యొక్క నిబంధనలలో ప్రతి ఒక్కటి 5 నిమిషాల అపరిమిత పొడిగింపులతో)
2.	లోన్ అకౌంట్ నం.లు.: HL04VJI000053748 1. శ్రీ/శ్రీమతి. దుర్గాశివాంజనేయులు లక్కీ, 2. శ్రీ/శ్రీమతి. గీత లక్కీ చిరునామా : 41-28/3-47, రాణీగారి తోట కృష్ణలంక, గ్రేస్ బ్లడ్ సెంటర్ వద్ద, విజయవాడ (అర్బన్), ఆంధ్రప్రదేశ్-520013. ఇక్కడ కూడా : 368/3 మరియు 369/1, డో.నం.41-30/6-2, ప్లాట్ నం.26 41-30/6-2, రాణీగారి తోట, విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్, రెవెన్యూ వార్డు 15, విజయవాడ, కృష్ణ ఇండివిడ్యువల్ రెసిడెన్షియల్ బిల్డింగ్ రాణిగారితోట, కృష్ణలంక, కృష్ణ-520013, ఆంధ్రప్రదేశ్, శ్రీలక్ష్మీ దుర్గా గనాప్.	25.09.2025 నాటికి బకాయి రూ. 43,44,858/- (నలభై మూడు లక్షల నలభై నాలుగు వేల ఎనిమిది వందల యాభై ఎనిమిది రూపాయలు మాత్రమే)	విజయవాడ, పటమట సబ్ రిజిస్ట్రార్, విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ ఏరియా పరిధిలోని విజయవాడ, కృష్ణలంక, రాణీగారితోట వద్ద ఉన్న డో.నం.41-30/6-2, పాత మూల్యాంకనం నం.237130, కొత్త మూల్యాంకనం నం.1073118111, మున్సిపల్ వార్డు నం.15, ప్లాట్ నం.26, బ్లాక్ నం.ఎ, ఎల్‌పి నం.11/85, ఎన్.టి.ఎస్.నం.368/3 మరియు 369/1, బ్లాక్ నం.11, రెవెన్యూ వార్డు నం.10, ఆర్‌సిసి రెసిడెన్షియల్ భవనంతో జి+1 సైట్ పరిధి 72.0 చ.గ.లు. లేదా 60.20 చ.మీ.లు. ఉన్న హద్దులు : తూర్పు : మున్సిపల్ కార్పొరేషన్ రోడ్డు, దక్షిణం : అబ్దుల్ నజీర్ ఆస్తి, పడమర : రవి శివయ్య ఆస్తి, ఉత్తరం : యలమల తిరుపతమ్మ ఆస్తి. పై సరిహద్దుల మధ్యలో పరిధి 72.0 చ.గ.లు. లేదా 60.20 చ.మీ.లు. నిర్మించబడిన ఆర్‌సిసి రూఫ్డ్ రెసిడెన్షియల్ భవనం గ్రౌండ్ ఫ్లోర్ మరియు ఒకటవ అంతస్తుతో ప్లింత్ ఏరియా 600 చ.అ.లు. ప్రతీ అంతస్తు తో అన్నీ సౌలభ్య హక్కులు.	[illegible]	రూ. 55,90,000/- (యాభై ఐదు లక్షల తొంభై వేల రూపాయలు మాత్రమే) / రూ. 5,59,000/- (ఐదు లక్షల యాభై తొమ్మిది వేల రూపాయలు మాత్రమే)	10.11.2025, మ.02.00గం.ల నుండి సా.04.00 గం.ల వరకు (టెండర్ పత్రం యొక్క నిబంధనలలో ప్రతి ఒక్కటి 5 నిమిషాల అపరిమిత పొడిగింపులతో)

తనిఖీ తేదీ మరియు సమయం : 07.11.2025, ఉ.11.00గం.ల నుండి సా.4.00గం.ల మధ్య. **కనిష్ట బిడ్ ఇంక్రిమెంట్ మొత్తం: 10,000/-**

3. బిడ్/ఇఎమ్‌డి/పాల్గొనడానికి అభ్యర్థన లేఖ సమర్పణ కొరకు చివరి తేది : 08.11.2025, సా.05.00గం.ల వరకు.

రుణ ఒప్పందం పరంగా చెల్లింపు తేదీ వరకు చెల్లింపు మరియు/లేదా దాని రియలైజేషన్ వరకు వర్తించే తదుపరి వడ్డీతో కలిపి, యాధృచ్ఛిక ఖర్చులు, ఖర్చులు, ఛార్జీలు మొదలైనవి.
ఆస్తి తనిఖీకి సంబంధించిన ఏదైనా సహాయం కోసం లేదా బిడ్ పత్రాన్ని పొందడం కోసం మరియు ఏదైనా ఇతర ప్రశ్నల కోసం దయచేసి చోళమండలం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ యొక్క అఫీషియల్ శ్రీ.పరిమి శ్రీధర్, అతని మొ.నం.8885615656 ద్వారా సంప్రదించవచ్చు. చోళమండలం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ యొక్క ఆధీకృత అధికారి జ్ఞానం మరియు సమాచారం ప్రకారం పైన పేర్కొన్న స్థిరాస్తులు/సెక్యూర్డ్ అసెట్స్‌కు సంబంధించిన భారాలు లేవు.

సం/-
తేది : 06.10.2025 అధీకృత అధికారి,
ప్రదేశం : విజయవాడ, ఆంధ్రప్రదేశ్ చోళమండలం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్., తరపున

TATA

టాటా క్యాపిటల్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్

నమోదు కార్యాలయం చిరునామా : 11వ అంతస్తు, టవర్ ఎ, పెనిన్‌సుల బిజినెస్ పార్క్, గనపత్‌రావు కదం మార్గ్, లోయర్ పారెల్, ముంబాయి-400013.
శాఖ చిరునామా : డో.నం: 54-15-4సి/1, 5వ అంతస్తు, ఆర్‌కె గల్లేరియా, శ్రీనివాస బ్యాంక్ కాలనీ, సర్వీసు రోడ్, స్వీట్ మ్యాజిక్ దగ్గర, ఎస్‌బిఐ భవనం, విజయవాడ-520008

స్థిరాస్తి యొక్క విక్రయం కొరకు నోటీసు
(సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 9(1)తో చదువుతూ రూల్ 8(6) క్రింద)
సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8(6) మరియు రూల్ 9(1) తో చదువుతూ సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకం కొరకు 30 రోజుల ఇ-వేలం నోటీసు

టాటా క్యాపిటల్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ (టిసిహెచ్‌ఎఫ్‌ఎల్)కి తనఖాగా ఉంచబడిన స్థిరాస్తిని క్రింద వివరించిన స్థిరాస్తిని గురించి సాధారణ ప్రజలకు మరియు ప్రత్యేకించి దిగువ రుణగ్రహీత మరియు సహ-రుణగ్రహీత లేదా వారి చట్టపరమైన వారసులు/ప్రతినిధులు (రుణగ్రహీతలు)లకు దీని ద్వారా నోటీసు ఇవ్వడింది. టిసిహెచ్‌ఎఫ్‌ఎల్ యొక్క అధీకృత అధికారి తీసుకున్న స్వాధీనం **11.11.2025న దిగువ పేర్కొన్న రుణగ్రహీత మరియు సహ-రుణగ్రహీతలు బకాయిలను రికవరీ చేయడానికి "ఎక్కడ ఉందో అలాగే ఉంది" మరియు "ఉన్నట్లే" మరియు "ఏదైనా ఉంది"** ఆధారంగా. రిజర్వ్ ధర మరియు బయానా మొత్తం దిగువన పేర్కొనబడ్డాయి. ఏదైనా వాయిదా/విక్రయాలు నిలిపివేయబడినప్పుడు, పేర్కొన్న సెక్యూర్డ్ అసెట్/ఆస్తి దీని ద్వారా విక్రయించబడుతుందని ఇందుమూలంగా నోటీసు ఇవ్వబడింది. **ఇ -వేలం 11.11.2025న మ. 2గం.లకు .** ఇ-వేలంలో పాల్గొనడానికి ఇఎమ్‌డి యొక్క డిమాండ్ డ్రాఫ్ట్‌ను కలిగి ఉన్న సీల్డ్ ఎన్వలప్‌ను **టిసిహెచ్‌ఎఫ్‌ఎల్ ఆధీకృత అధికారికి బ్రాంచ్ అడ్రసు: టాటా క్యాపిటల్ హౌసింగ్ ఫైనాన్స్, డోర్ నెం. 54.15.4సి/1, 5వ అంతస్తు, ఆర్.కె. గల్లేరియా శ్రీనివాస బ్యాంక్ కాలనీ, సర్వీస్ రోడ్డు, స్వీట్ మ్యాజిక్ దగ్గర, ఎస్‌బిఐ బిల్డింగ్, విజయవాడ-520008 వద్ద 10.11.2025, సా.5గం.ల** లోపు సమర్పించాలి.
క్రింద వివరించిన క్లుప్త వివరాల ప్రకారం సురక్షి ఆస్తి/ స్థిరాస్తి విక్రయం "పరిస్థితి ఉన్న చోటనే" ఉంటుంది.

క్ర సం.	లోన్ అకౌంట్ నెం.	రుణగ్రహీత(లు)/ సహ-రుణగ్రహీత(లు) చట్టపరమైన వారసులు/ న్యాయ ప్రతినిధి/తనఖాదారు(లు) పేరు	డిమాండ్ నోటీసు ప్రకారం మొత్తం	రిజర్వ్ మొత్తం	నాటికి బకాయి
1	9982497	శ్రీ గిరి నాగేశ్వరరావు మాజేటి, శ్రీ.రోహిణి కుమార్ మాజేటి	రూ.56,87,697/- (యాభై ఆరు లక్షల ఎనభై ఏడు వేల ఆరు వందల తొంభై ఏడు రూపాయలు మాత్రమే) మరియు 22.11.2022	రూ.1,36,85,000/- ; బయానా మొత్తం (ఇఎమ్‌డి) : రూ.13,68,500/- ; స్వాధీనతా విధానం : భౌతికం	రూ.90,20,960/- (తొంభై లక్షల ఇరవై వేల తొమ్మిది వందల అరవై రూపాయలు మాత్రమే) 29.09.2025 నాటికి

స్థిరాస్తి వివరణ : గుంటూరు జిల్లా, నల్లపాడు ఉప జిల్లా, గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ ప్రాంత పరిధిలో, అంకిరెడ్డి పాలెం గ్రామం వద్ద ఉన్న మొత్తం ఆ ముక్క మరియు పార్సిల్ డో.నం.167/బి కవర్‌చేయబడిన పరిధి మొత్తం ఎ.లు. 5-73 సెంట్లు. పట్టా నం.510 మరియు బయట పరిధి 1589 చ.గ.లు. ఆ ఖాళీ రెసిడెన్షియల్ సైట్ కొలత 595 చ.గ.లు. దక్షిణం పడమర భాగం (డో.నం.25-16-304) క్రింది విధంగా ఉన్న హద్దులు : **తూర్పు :** విక్రేత మిగిలిన సైట్ ఆస్తి 45-0 అ.లు., **దక్షిణం :** డి.శ్రీనివాసరావు మరియు ఇతరుల ఆస్తి 119-0 అ.లు., **పడమర :** 18 అ.లు. వెడల్పు రోడ్డు 45-0 అ.లు., **ఉత్తరం :** విక్రేతల మిగిలిన సైట్ ఆస్తి 119-0 అ.లు. ఈ సరిహద్దుల పరిధి 595 చ.గ.లు. 497.47 చ.మీ.లు. ఖాళీ రెసిడెన్షియల్ సైట్ మాత్రమే.

వేలంలో, ప్రజలు తమ బిడ్(ల)ని వ్యక్తిగతంగా సమర్పించడానికి సాధారణంగా ఆహ్వానించబడతారు. ఏ అధికారి లేదా ఇతర వ్యక్తి, ఈ విక్రయానికి సంబంధించి ఏదైనా విధిని నిర్వర్తించకూడదు, అయితే, విక్రయించబడిన స్థిరాస్తిపై ఏదైనా ఆసక్తిని పొందేందుకు ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా వేలం వేయకూడదు, సంపాదించకూడదు లేదా సంపాదించడానికి ప్రయత్నించకూడదు.
సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లో సూచించిన షరతులకు లోబడి ఉండవలెను మరియు తదుపరి షరతులు అనుసరించవలెను :
గమనిక : ఇ-వేలం 11.11.2025న మ.2.00గం.ల నుండి 3.00గం.ల మధ్యన ప్రతి 5 నిమిషాల పొడగింపుతో పోర్టల్ http://bankauctions.in/ ద్వారా జరుగుతుంది.

నియమాలు మరియు నిబంధనలు :

1) దిగువ షెడ్యూల్‌లో ప్రత్యేకంగా పేర్కొన్నట్లుగా క్రింది సంతకందారునికి ఉన్నంత సమాచారం మేరకు సరైనవి, కాని క్రింది సంతకందారుడు ఈ ప్రొక్లేమేషన్‌లో ఏదేని పొరపాటు, మిస్‌స్టేట్‌మెంట్ లేదా లోపానికి సమాధానం ఇవ్వరు. మొత్తం బిడ్ లేదా బిడ్డరుదారుకు ఏదేని వివాదాలు తలెత్తితే, ఆ లాట్ మళ్లీ ఒకసారి వేలం కొరకు ఉంచబడును. 2) ఆస్తిని రిజర్వు ధర కంటే తక్కువ ధరకు విక్రయించబడదు. 3) **బిడ్ పెంపుదల మొత్తం: రూ.10,000/- (పది వేల రూపాయాలు).** 4) ఆస్తి కొనుగోలు కోసం సమర్పించిన అన్ని బిడ్‌లు పైన పేర్కొన్న విధంగా ఎర్నెస్ట్ మనీతో పాటు **"టాటా క్యాపిటల్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్"** కి అనుకూలంగా ఉండే డిమాండ్ డ్రాఫ్ట్ ద్వారా అందించబడతాయి. చెల్లించవలసిన శాఖ చిరునామా: ఎన్ఆఎఫ్‌టి/ ఆర్‌టిజిఎస్/ ఐఎమ్‌పిఎస్ ద్వారా ఇఎమ్‌డి కోసం, దయచేసి ఆధీకృత అధికారిని సంప్రదించండి. వేలం సఫలీకృతంకాని బిడ్డరుదారులకు డిమాండ్ డ్రాఫ్టులు తిరిగిఇవ్వబడును. 5) అధిక్యతగల బిడ్డరుదారు బిడ్‌కు చట్టపరంగా అర్హతపొందినగా అన్నివిధాలా కల్పించిన ఏదేని లాట్ కొనుగోలుదారుగా ప్రకటించబడతారు మరియు తదుపరిగా అతని ద్వారా బిడ్ మొత్తం రిజర్వు ధర కంటే తక్కువగా ఉండరాదు. ఆఫర్‌చేసిన ధర సరిగాలేనట్లుగా స్పష్టంగా కనిపిస్తే అత్యధిక బిడ్ యొక్క క్షీణత అనుమతించుట ఆధీకృత అధికారి యొక్క విచక్షణ మేరకు ఉంటుంది. 6) రికార్డు అయిన కారణాల కొరకు అమ్మకమును వాయిదా వేయుట/నిలుపివేయుట అనునది 'ఆధీకృత అధికారి' యొక్క విచక్షణ మేరకు ఉంటుంది. 7) ఆస్తి యొక్క తనిఖీ **03.11.2025న ఉ.11 గం.ల నుండి సా.5.00గం.ల మధ్యలో** ముందస్తు నియామకంతో చేపట్టవచ్చును. 8) కొనుగోలుదారుగా ప్రకటించబడు వ్యక్తి, సదరు డిక్లేరేషన్ తరువాత వెంటనే, కొనుగోలుచేసిన మొత్తం/బిడ్‌లో ఇరవై ఐదు శాతను 24 గం.లలోపు **'ఆధీకృత అధికారి'**కి డిపాజిట్ చేయవలెను మరియు సదరు డిపాజిట్ విషయంలో విఫలమైన యెడల, ఆస్తి వెంటనే ప్రైవేట్ ట్రీటి ద్వారా తాజా వేలం/అమ్మకానికి ఉంచబడుతుంది. 9) పై విధంగా చేసిన ప్రారంభ డిపాజిట్ విషయంలో, కొనుగోలు యొక్క మిగిలిన మొత్తంను ఆస్తి అమ్మకం నిర్ధారణ తేది నుండి 15వ రోజున లేదా ఆలోగా ఆధీకృత అధికారి కొనుగోలుదారు చెల్లించవలెను, లేదా ఒకవేళ 15వ రోజు ఆదివారం లేదా ఇతర సెలవు రోజువస్తే, 15వ రోజు తరువాత మొదటి రోజున చెల్లించవలెను. 10) పైన పేర్కొన్న సమయంలో ఏదైన విఫలం చెందితే, ప్రైవేట్ ట్రీటి ద్వారా ఆస్తిని తాజాగా వేలం/విక్రయం జరుపబడును. డిపాజిట్ టాటా క్యాపిటల్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ ద్వారా ఇఎండి సహా వదులుకోవాల్సి ఉంటుంది మరియు విఫలమైన కొనుగోలుదారుడు ఆస్థి దావాలు కోల్పోవలసి ఉంటుంది. 11) పై పట్టిక ప్రకారం ఆస్తికి సంబంధించిన **టాటా క్యాపిటల్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్** వారికి తెలిసినంత వరకు ఏదేని రుణాభారాలు వివరాలు లేవు. ఆస్తి పన్ను, విద్యుత్ మొదలైన చట్టబద్ధమైన బాధ్యతల ప్రాంతాలతో సహా ఆస్తిపై భారాలకు సంబంధించి వారి స్వంత స్వతంత్ర విచారణలు చేయాలని ఉద్దేశించిన బిడ్డర్ సూచించబడ్డారు. 12) **ఏదైనా ఇతర వివరాల కోసం లేదా ఇ-వేలం పై ఆన్ లైన్ శిక్షణ కోసం కాబోయే బిడ్డర్లు సర్వీస్ ప్రొవైడర్ మెసెర్స్.4క్లోజర్, బ్లాక్ నం.605 ఎ, 6వ అంతస్తు, మైత్రివనం కమర్షియల్ కాంప్లెక్స్, అమీర్‌పేట, హైదరాబాద్-500038, ఇ మెయిల్ : info@bankauctions.in లేదా మనీష్ బన్సాల్, ఇ మెయిల్ ఐడి: Manish.bansal@tatacapital.com ని సంప్రదించవచ్చు.** అధీకృత అధికారి ఫోన్ నెం. 8588983696, దయచేసి మీ ప్రశ్నను వాట్సప్ నెం. 9999078669 లో పంపండి. 13) 1% టిడిఎస్ వర్తింబడును మరియు గరిష్టంగా ప్రకటించిన బిడ్ మొత్తం మీద అత్యధిక బిడ్డర్ ద్వారా చెల్లించబడుతుంది. యజమాని/రుణగ్రహీత(లు) యొక్క పాన్‌లో అత్యధిక బిడ్డర్ ద్వారా పేమెంట్ చెల్లించాల్సిన అవసరం ఉంటుంది మరియు ఒక చలాన్ కాపీ మా కంపెనీకి దాఖలు చేయాల్సి ఉంటుంది. 14) **పై వివరాలకు సెక్యూర్డ్ క్రెడిటార్'స్ వెబ్‌సైట్ https://surl.lt/hrxkhl లో పొందుపరిచిన క్రింది లింక్‌ను చూడవచ్చు.** 15. దయచేసి **https://www.tatacapital.com/property-disposal.html** లింక్‌ని కూడా సందర్శించండి.
దయచేసి గమనించండి- టిసిహెచ్‌ఎఫ్‌ఎల్ ఈ ఆస్తి అమ్మకం/ వేలం కోసం పేర్కొన్న వేలం భాగస్వామితో పాటు ఏ బ్రోకర్/ఏజెంట్‌ను నిమగ్నం చేయలేదు. ఆసక్తి ఉన్న పార్టీలు ఈ విషయంలో అన్ని సందేహాలు మరియు విచారణల కోసం దిగువ సంతకం చేసిన ఆధీకృత అధికారిని మాత్రమే సంప్రదించాలి.

ప్రదేశం: ఆంధ్రప్రదేశ్ **సం/- అధీకృత అధికారి**
తేది: 07.10.2025 **టాటా క్యాపిటల్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్**

సిజెపై దాడి యత్నాన్ని ఖండించిన సిపిఐ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సుప్రీంకోర్టు ప్రాంగణంలో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బిఆర్ గవాయ్‌పై ఒక న్యాయవాది చెప్పు విసిరేందుకు యత్నించిన ఘటనను సిపిఐ తీవ్రంగా ఖండిస్తోందని ఆ పార్టీ కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ కె నారాయణ తెలిపారు. ఇది ఒక వ్యక్తి తప్పుడు ప్రవర్తన మాత్రమే కాదని, ఆర్‌ఎస్‌ఎస్ సిద్ధాంతాలకు చెందిన శక్తులు పెంచిపోషిస్తున్న అసహన సంస్కృతికి ప్రతీక అని సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాజ్యాంగ సంస్థలను అవమానించడం, న్యాయ వ్యవస్థను బెదిరించడం లక్ష్యంగా ప్రణాళికతో కూడిన దాడి ప్రయత్నంగా అభివర్ణించారు. ప్రజాస్వామ్య శక్తులు అందరూ న్యాయ వ్యవస్థ గౌరవం, స్వతంత్రతను కాపాడాల్సిన బాధ్యత వహించాలని కోరారు. ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తు జరపాలని, దీని వెనుక ఉన్న ఉద్దేశం, సంస్థాగత ప్రోత్సాహం వెలికితీయాలని డిమాండ్ చేశారు. బాధ్యులపై క్రిమినల్, కాంటెంప్ట్ చట్టాల కింద కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.

శాంతి ప్రణాళికపై వేగంగా స్పందించండి

- లేకుంటే భారీ రక్తపాతం తప్పదు
- ఇజ్రాయిల్, హమాస్‌కు ట్రంప్ హెచ్చరిక

వాషింగ్టన్ : గాజా శాంతి ప్రణాళికపై వేగంగా స్పందించాలని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ సోమవారం ఇజ్రాయిల్, హమాస్‌లకు సూచించారు. లేనిపక్షంలో భారీగా రక్తపాతం తప్పదని హెచ్చరించారు. కాల్పుల విరమణపై ఇజ్రాయిల్, హమాస్ మధ్య ఈజిప్ట్ రాజధాని కైరోలో సోమవారం చర్చలు ప్రారంభమైన వేళ ట్రంప్ నుంచి ఈ హెచ్చరిక వెలువడింది. 'మొదటి దశ ఈ వారంలో పూర్తవుతుందని నాకు చెప్పారు. ఈ విషయంలో వేగంగా స్పందించాలని నేను ప్రతి ఒక్కరినీ కోరుతున్నాను. శతాబ్దాల తరబడి కొనసాగుతున్న ఘర్షణను పర్యవేక్షిస్తూనే ఉంటాను. కాలం చాలా ముఖ్యమైనది. వేగంగా స్పందించకపోతే పెద్ద ఎత్తున రక్తపాతం జరుగుతుంది. అలా జరగాలని ఎవరూ కోరుకోవడం లేదు' అని ట్రంప్ తన ట్రూత్ సోషల్ వేదికలో పోస్ట్ పెట్టారు.

'గాజా శాంతి ప్రణాళికపై హమాస్, ప్రపంచ దేశాలతో గత వారాంతంలో సానుకూల చర్చలు జరిగాయి. బందీల విడుదల, గాజాలో యుద్ధానికి ముగింపే కీలకం. వీటి కంటే మధ్యప్రాచ్యంలో దీర్ఘకాల శాంతి నెలకొనడం చాలా ముఖ్యం. చర్చలు వేగంగా జరుగుతున్నాయి. సాంకేతిక బృందాలు కూడా సమావేశమయ్యాయి' అని ట్రంప్ వివరించారు.

షరతులు పాటించకపోతే నిధులు కట్ భారతీయ విద్యార్థులే లక్ష్యంగా దేశాలు

వాషింగ్టన్ : తాను విధించిన సుంకాలు భారత్‌పై పెద్దగా ప్రభావం చూపకపోవడంతో కంగుతిన్న అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తాజాగా భారతీయ విద్యార్థులను లక్ష్యంగా చేసుకున్నారు. వారిపై నేరుగా ప్రభావం చూపేలా విశ్వవిద్యాలయాలకు ఆదేశాలు జారీ చేశారు. షరతులు పాటిస్తేనే ప్రభుత్వం నుంచి నిధులు అందుతాయని, లేకుంటే వాటిని నిలిపివేస్తామని తొమ్మిది యూనివర్సిటీలకు మెమోలు పంపారు. అంతర్జాతీయ విద్యార్థుల సంఖ్యను పదిహేను శాతానికి పరిమితం చేయాలని, ఏ ఒక్క దేశం నుంచి ఐదు శాతం కంటే ఎక్కువ మంది విద్యార్థులు ఉండకూడదని, విదేశీ విద్యార్థుల ప్రవేశాలను తగ్గించుకోవాలని ట్రంప్ తన తాజా ఆదేశాలలో స్పష్టం చేశారు. ట్రంప్ నిర్ణయం భారతీయ విద్యార్థులకు సవాలుగా మారబోతోంది. ప్రవేశాలు, వీసాలు పొందడానికి వారు మరిన్ని ఇబ్బందులు పడాల్సి వస్తుంది. కాగా తొమ్మిది విశ్వవిద్యాలయాలకే మెమోలు ఎందుకు పంపారన్న విషయంపై అధ్యక్ష భవనం ఇంకా ఎలాంటి వివరణ ఇవ్వలేదు. అధిక సుంకాలతో ఉద్రిక్తతలు పెరుగుతున్న తరుణంలో ట్రంప్ తాజాగా ఆదేశాలు జారీ చేయడం గమనార్హం. సుంకాల విధింపుతో పాటు హెచ్-1బీ వీసా ఫీజులను కూడా ట్రంప్ భారీగా పెంచేశారు. ఇప్పుడు జారీ చేసిన మెమోల కారణంగా భారతీయ విద్యార్థులు అనేక సవాళ్లు ఎదుర్కోవాల్సి వస్తుంది. మొత్తం విద్యార్థుల సంఖ్యలో భారతీయ విద్యార్థులు ఐదు శాతానికి మించకూడదన్న నిబంధన వారి పాలిట అశనిపాతమవుతుంది. ఈ నిబంధన కారణంగా ఎంచుకున్న వర్సిటీలలో సీటు పొందే అవకాశం ఉండదు.

పెట్టుబడుల సదస్సుకు తరలిరండి

- ముంబయిలో పారిశ్రామికవేత్తలకు లోకేష్ ఆహ్వానం
- పలువురితో భేటీ

ముంబయి తాజ్ ప్యాలెస్ హోటల్‌లో సోమవారం పెట్టుబడిదారులతో రోడ్‌షోలో నిర్వహించారు మంత్రి లోకేష్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం విశాఖపట్నంలో నవంబరు 14, 15 తేదీల్లో ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న సిఐఐ పార్టనర్ షిప్ సమ్మిట్‌ను విజయవంతం చేయాలని పారిశ్రామికవేత్తలను విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కోరారు. ముంబయి తాజ్ ప్యాలెస్ హోటల్‌లో సోమవారం ఆయన పలువురి పెట్టుబడిదారులతో రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ.. పార్టనర్ షిప్‌కు హాజరై రాష్ట్రంలో పెట్టుబడులపై పూర్తిస్థాయి సమాచారాన్ని తెలుసుకోవచ్చునని తెలిపారు. అన్ని విధాలా అనుకూలతలు కలిగిన రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి ముందుకురావాలని, అవసరమైన అన్ని సహాయ, సహకారాలు అందించడానికి తాము సిద్ధంగా ఉన్నామని చెప్పారు. అంతకుముందు పలువురి పారిశ్రామికవేత్తలతో విడివిడిగా సమావేశమై పెట్టుబడులు పెట్టాలని వారిని కోరారు. కోల్డ్ స్టోరేజి, ఎగుమతి మౌలిక సదుపాయాల రంగాల్లో పెట్టుబడులు పెట్టాలని ట్రాఫిగురా ఇండియా సిఇఒ సచిన్‌ను కోరారు. రాష్ట్రంలో ఎపిఐఐసితో కలిసి పారిశ్రామిక పార్కుల అభివృద్ధిలో భాగస్వామ్యం వహించాలని ఇఎస్ఆర్ గ్రూప్ ఇండియా ఇన్వెస్టిమెంట్స్ హెడ్ సాదత్ షా, డైరెక్టర్ (లీజింగ్) ప్రకృత్ మెహతాను కోరారు. విశాఖ, కాకినాడ పోర్టుల వద్ద మల్టీమోడల్ లాజిస్టిక్స్ పార్కులు ఏర్పాటు చేయాలన్నారు. విశాఖపట్నంలో రాష్ట్ర అగ్రనేతల సమక్షాన ఈ నెలలో నిర్వహించనున్న టిసిఎస్ డెవలప్‌మెంట్ సెంటర్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరుకావాలని టాటా గ్రూప్ ఛైర్మన్ చంద్రశేఖరన్‌తో పాటు ఆ కంపెనీ ప్రతినిధులను కోరారు. టాటా పవర్ రెన్యూవబుల్స్ ఆధ్వరంలో రాష్ట్ర వ్యాప్తంగా ఎలక్ట్రిక్ వాహనాల ఛార్జింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధి కోసం ప్రభుత్వంతో భాగస్వామ్యం వహించాలని కోరారు. వీటితోపాటు ఎలక్ట్రిక్ వాహన భాగాలు, అధునాతన కంపోజిట్ మాన్యుఫాక్చరింగ్ యూనిట్లు స్థాపించే అవకాశాలను చూడాలన్నారు. విశాఖలో లగ్జరీ టౌన్‌షిప్ ప్రాజెక్టు ఏర్పాటు చేయాలని రుస్తోంజీ గ్రూప్ ఛైర్మన్ బొమన్ ఇరానీను కోరారు. త్రిడి ప్రింటింగ్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేయాలని హెచ్‌పి ఇన్క్ ఎమ్‌డి ఇప్సితా దాస్‌ను కోరారు. దక్షిణ భారతదేశంలో ఆర్అండ్‌డి కేంద్రాన్ని రాష్ట్రంలో ఏర్పాటు చేయాలని బ్లూస్టార్ లిమిటెడ్ సిఎమ్‌డి విఆర్ అద్వానిని కోరారు. విశాఖపట్నంలో మైండ్‌స్పేస్ బిజినెస్ పార్క్ ఏర్పాటు చేయాలని రహేజా గ్రూప్ ప్రెసిడెంట్ నీల్ రహేజాను కోరారు.

ఆ పది రాష్ట్రాలకే సంపన్నులు పరిమితం

- అక్కడే అభివృద్ధి కేంద్రీకృతం మిగిలిన భారతావనిలో అన్నీ సమస్యలే
- దేశంలో పెరిగిపోతున్న అంతరాలు

న్యూఢిల్లీ : దేశంలో 1,687 మందికి వెయ్యి కోట్ల రూపాయలకు పైగా సంపద ఉంది. అలాగే 358 మంది వద్ద ఎనిమిదిన్నర వేల కోట్ల సంపద పోగుపడి ఉంది. వీరందరి వద్ద కలిపి ఉన్న సంపద భారత జీడీపీలో దాదాపు సగానికి సమానమని హురూన్ ఇండియా రిచ్ తాజా జాబితా తెలిపింది. ఈ గణాంకాలు దేశానికి గర్వకారణమని అనిపిస్తోంది కదూ ! కానీ నాణేనికి మరో వైపు కూడా చూస్తే చేదునిజాలు బయటపడతాయి. కనిపిస్తున్న సుందర దృశ్యం అదృశ్యమవుతుంది. ఈ సంపద అంతా దాదాపుగా దేశంలోని కొన్ని ప్రాంతాలలోనే కన్పిస్తుంది. భారతదేశానికి చెందిన మిలియనీర్ కుటుంబాలలో సగానికి పైగా కుటుంబాలు మహారాష్ట్ర, ఢిల్లీ, తమిళనాడు, కర్నాటక, గుజరాత్‌లోనే ఉండడం గమనార్హం. తెలంగాణ, పశ్చిమ బెంగాల్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, హర్యానా...వీటిని కూడా కలుపుకుంటే భారత వృద్ధిలో 90 శాతం ఈ పది రాష్ట్రాలలోనే మనకు కన్పిస్తుంది. మరో మాటలో చెప్పాలంటే ముంబయి, ఢిల్లీ, బెంగళూరు, చెన్నై, హైదరాబాద్, అహ్మదాబాద్ నగరాలలోనే సంపద సృష్టి జరుగుతోంది. మిగిలిన ప్రాంతాలు అభివృద్ధికి ఆమడ దూరంలోనే ఉన్నాయి. హురూన్ నివేదికను పరిశీలిస్తే పరస్పర విరుద్ధమైన అంశాలు ఎన్నో కన్పిస్తాయి. అది కేవలం సంపన్నుల జాబితా మాత్రమే కాదు. దేశంలో అభివృద్ధి ఎక్కడ కేంద్రీకృతమైంది, అది ఇంకా ఎక్కడ కన్పించడం లేదు అనే అంశాలను కూడా ఆ నివేదిక స్పృశించింది.

కొన్ని రాష్ట్రాలలోనే ఎందుకు కేంద్రీకృతం?

సంపద ఎక్కడ ఉంటే అక్కడ అవకాశాలు లభిస్తాయని చెబుతుంటారు. మహారాష్ట్రలో వాణిజ్య రాజధాని ముంబయి ఉంది. ఆ రాష్ట్రంలో వెయ్యి కోట్ల రూపాయలకు పైగా సంపద ఉన్న వారు 548 మంది. అంటే దేశంలో ఉన్న సంపన్నుల్లో సగం మంది మహారాష్ట్రలోనే ఉన్నారన్న మాట. ఢిల్లీలో 223 మంది సంపన్నులు ఉండగా కర్నాటక, గుజరాత్, తమిళనాడు, తెలంగాణలో మిగిలిన వారు నివసిస్తున్నారు. దీనిని బట్టి అర్థమవుతున్న విషయం ఏమిటంటే ఎక్కడ డబ్బు ఉంటే అక్కడ వ్యాపారం అభివృద్ధి చెందుతుంది. మౌలిక సదుపాయాలు ఉంటాయి. పెట్టుబడిదారులకు విశ్వాసం కలుగుతుంది. ముంబయి లేదా బెంగళూరులో వ్యాపారం ప్రారంభించాలని అనుకుంటే పెట్టుబడిని సమీకరించడం సులభం. నిపుణులైన సిబ్బంది లభిస్తారు. డబ్బు ఖర్చు చేసే వినియోగదదారులూ దొరుకుతారు. అదే ఇండోర్‌లోనో పాట్నాలోనూ వ్యాపారం చేస్తే అభివృద్ధి చెందడానికి చాలా కాలం పడుతుంది. ఏం తయారు చేస్తున్నామన్న దాని కంటే ఎక్కడ తయారు చేస్తున్నామన్నదే ముఖ్యమని ఓ మాన్యుఫాక్చరింగ్ యూనిట్ యజమాని వ్యాఖ్యానించారు.

కల్తీ దగ్గు మందుతో మరణాలు..

- 3 రాష్ట్రాలకు 'ఎన్‌హెచ్‌ఆర్‌సి' నోటీసులు

న్యూఢిల్లీ : కల్తీ దగ్గు ఔషధంతో ఆయా రాష్ట్రాల్లో చిన్నారుల మృతి వ్యవహారంపై జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌సి) స్పందించింది. సంబంధిత ఆరోపణలపై దర్యాప్తు చేయాలని మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వాలకు నోటీసులు జారీ చేసింది. కల్తీ మందుల విక్రయాలను వెంటనే నిషేధించాలని ఆదేశించింది. రెండు వారాల్లోగా సమగ్ర నివేదికను సమర్పించాలని నోటీసులో పేర్కొంది.కల్తీ ఔషధాల సరఫరాపై దర్యాప్తునకు ఆదేశించాలని కేంద్ర ఆరోగ్యశాఖ, డ్రగ్స్ కంట్రోలర్ జనరల్ ఆఫ్ ఇండియా (డిసిజిఐ), సెంట్రల్ డ్రగ్స్ స్టాండర్డ్ కంట్రోల్ ఆర్గనైజేషన్ (సిడిఎస్‌సిఒ), డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్ (డిజిహెచ్‌ఎస్)లకు కమిషన్ సూచించింది. అదేవిధంగా రాష్ట్రాల్లోని ప్రాంతీయ ప్రయోగశాలలు కల్తీ మందుల నమూనాలను సేకరించి పరీక్ష నివేదికలను సమర్పించేలా కూడా ఆదేశాలు జారీ చేయాలని చెప్పింది. మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లో కల్తీ దగ్గు మందుతో 18 మంది చిన్నారులు మరణించిన వ్యవహారంలో తక్షణమే జోక్యం చేసుకోవాలని కోరుతూ తమకు ఫిర్యాదు అందిందని కమిషన్ తెలిపింది.

ఆండ్రోత్ నౌక ప్రారంభం

ప్రజాశక్తి -ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

విశాఖపట్నంలోని నేవల్ డాక్‌యార్డు వేదికగా భారత నావికాదళానికి చెందిన రెండవ యాంటీ-సబ్‌మెరైన్ వార్‌ఫేర్ షాలో వాటర్ క్రాఫ్ట్ నౌక ఆండ్రోత్‌ను తూర్పు నేవల్ కమాండ్ ఫ్లాగ్ ఆఫీసర్ కమాండింగ్-ఇన్-చీఫ్ వైస్ అడ్మిరల్ రాజేష్ పెంధార్కర్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత నావికా దళాన్ని బలోపేతం చేయడమే ప్రధాన లక్ష్యంగా ముందుకు వెళుతున్నామని తెలిపారు. భవిష్యత్ తరాలకు ఎదురులేని శక్తిగా భారత నావికా దళాన్ని తయారు చేస్తామని చెప్పారు. కోల్‌కతాలోని గార్డెన్ రీచ్ షిప్‌బిల్డర్స్ అండ్ ఇంజనీర్స్ నిర్మించిన ఈ నౌక 'ఆత్మనిర్భర్ భారత్' కార్యక్రమానికి ప్రతీకగా 80 శాతానికి పైగా స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించినట్లు వివరించారు. ఆండ్రోత్ నౌక ద్వారా నేవీ యాంటీ-సబ్‌మెరైన్ వార్ సామర్థ్యాలు గణనీయంగా బలపడతాయని, ముఖ్యంగా సముద్ర జలాల్లో ముప్పులను ఎదుర్కోవడంలోనూ, భారతదేశంలోని సముద్ర భద్రతా నిర్మాణాన్ని బలోపేతం చేయడంలోనూ కీలక పాత్రపోషించనుందని తెలిపారు.

ఈ ఏడాది ఇప్పటివరకు తొమ్మిది నౌకలను ప్రారంభించామని, రానున్న మూడు నెలల్లో మరో మూడు నౌకలను ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్నామని వివరించారు. లక్షద్వీప్ దీవుల సమూహంలోని వ్యూహాత్మక ప్రాధాన్యతను ఆండ్రోత్ ద్వీపం పేరు ఈ నౌకకు పెట్టినట్లు తెలిపారు. 2023 మార్చి 21న ఈ నౌక నిర్మాణం ప్రారంభమై 2025 సెప్టెంబర్ 13నఇండియన్ నేవీకి అందించినట్లు వివరించారు. ఈ నౌక శత్రు జలాంతర్గాములను గుర్తించడం, ట్రాక్ చేయడం నాశనం చేయడంలో ఉపయోగపడుతుందని, తీరప్రాంత నిఘా, మైన్ లేయింగ్ ఆపరేషన్లకు సైతం అనుకూలంగా ఉంటుందని వివరించారు. ఈ కార్యక్రమంలో గార్డెన్ రీచ్ షిప్‌బిల్డర్స్ అండ్ ఇంజనీర్స్ సంస్థ ఛైర్మన్ అండ్ ఎమ్‌డి కమాండర్ బిఆర్ హరి, వైస్ అడ్మిరల్ రాజారాం స్వామినాథన్నావల్, ప్రాజెక్ట్ డైరెక్టర్ జనరల్ వైస్ అడ్మిరల్ బి శివకుమార్, తూర్పు నేవల్ కమాండ్ చీఫ్ ఆఫ్ స్టాఫ్ వైస్ అడ్మిరల్ సమీర్ సక్సేనా, ఐఎన్ఎస్ ఆండ్రోత్ కమాండింగ్ ఆఫీసర్ కమాండర్ గురు ప్రసాద్‌రాయ్ తదితరులు పాల్గొన్నారు.

ఆండ్రోత్ నౌక ప్రారంభంలో తూర్పు నేవల్ కమాండ్ ఫ్లాగ్ ఆఫీసర్ కమాండింగ్-ఇన్-చీఫ్ వైస్ అడ్మిరల్ రాజేష్ పెంధార్కర్

ఇంధన అవసరాలకు 112 నౌకల నిర్మాణం

- విశాఖలో 'శివాలిక్'కు స్వాగతం పలికిన కేంద్ర మంత్రి సర్బానంద సోనోవాల్

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

దేశీయ లిక్విడ్ పెట్రోలియం గ్యాస్ కోసం 112 వెస్సెల్స్ అవసరం అని, షిప్పింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌సిఐ) సాంకేతిక మద్దతుతో 2030 లోగా దేశీయంగా నిర్మాణం చేసేందుకు దేశీయ పెట్రోలియం సంస్థలతో ఇప్పటికే ఎంఒయు కుదిరిందని కేంద్ర పోర్టులు, నౌకాయాన, జలరవాణా శాఖ మంత్రి సర్బానంద సోనోవాల్ వెల్లడించారు. దేశ తొలి వెరీ లార్జ్ గ్యాస్ క్యారియర్ (విఎల్‌జిసి) నౌక 'శివాలిక్'ను విశాఖపట్నం పోర్టులో సోమవారం ఆయన ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా శివాలిక్ నౌకలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. షిప్ బిల్డింగ్ సెంటర్ల అభివృద్ధికి కేంద్రం మద్దతునిస్తోందని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం దుగ్గిరాజుపట్నంలో స్థాపించబోయే షిప్ బిల్డింగ్ క్లస్టర్‌కు కేంద్ర సహకారం ఉంటుందని తెలిపారు. శివాలిక్ నౌకను మన షిప్పింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సంస్థ 2025 సెప్టెంబర్ పదిన కొరియా దేశం నుంచి కొనుగోలు చేసిందని తెలిపారు. స్వదేశీ పరిజ్ఞానంతో తయారు చేయబోయే 112 షిప్పుల్లో ఒక వెస్సెల్ కోసం రాగల 15 రోజుల్లో ఎస్‌సిఐ టెండర్‌ను పిలవబోతుందన్నారు. నౌక విజయవంతంగా తన తొలి ఎల్‌పిజి సరుకు నిర్వహణను పూర్తి చేయడంలో విశాఖపట్నం పోర్ట్ అథారిటీ అందించిన సహకారాన్ని అభినందించారు. ఇంధన రంగంలో ప్రపంచంలోనే చైనా ముందుందని, 2047 నాటికి భారతదేశ షిప్ బిల్డింగ్, మారిటైమ్ సెక్యూరిటీలో ప్రపంచంలో ఐదవ స్థానమే తమ లక్ష్యం అని ప్రకటించారు. విశాఖపట్నం ఎంపి శ్రీభరత్ మాట్లాడుతూ... ఈ తరహా ఆధునిక కార్యక్రమాల ద్వారా త్వరలో ప్రతి ఇంటికీ గ్యాస్ సరఫరా సాధ్యమవుతుందని తెలిపారు.

విశాఖపట్నం పోర్ట్ అథారిటీ ఛైర్మన్ డాక్టర్ ఎం.అంగముత్తు మాట్లాడుతూ.. ఎస్‌సిఐ తీసుకున్న ఈ పురోగమన చర్యను అభినందిస్తూ, పోర్ట్ అథారిటీ ఎల్లప్పుడూ అవసరమైన సహకారం అందిస్తుందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో కలిసి విశాఖపట్నాన్ని తూర్పు తీరంలోని ప్రముఖ ఎనర్జీ హబ్‌గా అభివృద్ధి చేయడానికి కృషి చేస్తామని పేర్కొన్నారు.


శివాలిక్ నౌకలో కేంద్ర మంత్రి సర్బానంద సోనోవాల్, ఎంపి శ్రీభరత్ తదితరులు

నౌక సిబ్బందితో కేంద్ర మంత్రి సమావేశం

ఈ సందర్భంగా 'శివాలిక్' నౌక అధికారులు, సిబ్బందితో కేంద్ర మంత్రి సమావేశమయ్యారు. వారి సేవలను ప్రశంసించారు. షిప్పింగ్ కార్పొరేషన్ అఫ్ ఇండియా ఛైర్మన్ వికె త్యాగీ మాట్లాడుతూ, ఒక దాని తర్వాత మరొక షిప్పులను తయారు చేస్తామని, ఇది ఉపాధి అవకాశాలను పెంచుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో శివాలిక్ షిప్ కెప్టెన్ భాస్కర్ టాండన్, షిప్పింగ్ కార్పొరేషన్ అఫ్ ఇండియా ఛైర్మన్ వికె.త్యాగీ, విశాఖపట్నం దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస యాదవ్, విశాఖపట్నం పోర్ట్ అథారిటీ సెక్రటరీ టి.వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

టెక్నాలజీని అందిపుచ్చుకోవాలి

- రాష్ట్ర సైన్స్, టెక్నాలజీ కార్పొరేషన్ ఛైర్మన్‌గా మందలపు రవి ప్రమాణ స్వీకారంలో కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ

ప్రజాశక్తి - విజయవాడ సిటీ

శాస్త్ర, సాంకేతిక రంగాల్లో మరింత పురోభివృద్ధిని సాధించాల్సిన అవసరం ఉందనీ, ఆ దిశగా కృషిని కొనసాగించాలని కేంద్ర భారీ పరిశ్రమల శాఖ సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు. రాష్ట్ర సైన్స్ అండ్ టెక్నాలజీ ఛైర్మన్‌గా మందలపు రవి విజయవాడ భవానీపురం పున్నమి ఘాట్‌లోని హరిత రిసార్ట్‌లో సోమవారం ప్రమాణస్వీకారం చేశారు. రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ ఆయన చేత ప్రమాణ స్వీకారం చేయించారు. రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార, పౌరసంబంధాలశాఖాధికారి కొలుసు పార్థసారథి, రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్, రాష్ట్ర జలవనరులశాఖా మంత్రి నిమ్మల రామానాయుడు తదితరులు మాట్లాడుతూ టెక్నాలజీని నేర్చుకుంటేనే రాబోయేరోజుల్లో ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయన్నారు. తొలుత మందలపు రవిని మంత్రులు, ఎంపిలు, ఎమ్మెల్యేలు, పలు కార్పొరేషన్ల ఛైర్మన్లు తదితరులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మందలపు రవి మాట్లాడుతూ రాష్ట్రంలో శాస్త్ర, సాంకేతిక రంగాల్లో మరింత అభివృద్ధి సాధించటానికి, మెరుగైన పరిశోధనా ఫలితాలు రావటానికి తనవంతు కృషిచేస్తానన్నారు. క్వాంటం కంప్యూటింగ్ చాలా వేగం, ఖచ్చితత్వంతో కూడిన ప్రక్రియని, ఇది మన రాజధాని అమరావతిలో ఏర్పాటుకు సిఎం నారా చంద్రబాబునాయుడు విశేషంగా కృషిచేస్తున్నారన్నారు. తనను ఈ పదవికి ఎంపిక చేసినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్, మంత్రి నారా లోకేష్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. వారి అడుగుజాడల్లో నడుస్తూ రాష్ట్రంలో సైన్స్, టెక్నాలజీ రంగాన్ని అభివృద్ధి పథంలో నడిపేందుకు కృషిచేస్తానని హామీ ఇచ్చారు.

జనవరికి వ్యర్థాల రహితంగా రాష్ట్రం

- స్వచ్ఛత అవార్డులు పంపిణీ చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వచ్చే జనవరి నాటికి రాష్ట్రాన్ని వ్యర్థాల రహిత రాష్ట్రంగా మారుస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఎంపిక చేసిన వారికి ఆయన అవార్డులను అందచేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అవార్డులకు ఎంపికైన వారంతా ఆపరేషన్ సింధూర్ వీరుల్లా కనిపిస్తున్నారని పేర్కొన్నారు. స్వచ్ఛాంధ్ర సాకారం కాకుండా స్వర్ణాంధ్ర సాధ్యం కాదన్నారు. స్వచ్ఛాంధ్ర లక్ష్య సాధనలో ఉత్తమ పనితీరు కనబరిచిన సంస్థలు, వ్యక్తులకు మొత్తం 21 కేటగిరిల్లో 69 రాష్ట్ర స్థాయి, 1,257 జిల్లా స్థాయి అవార్డులను అందజేస్తున్నట్లు చెప్పారు. పారిశుధ్య కార్మికులు లేకపోతే స్వచ్ఛ ఉద్యమమే లేదన్నారు. గ్రీన్ పాస్ పోర్ట్ ద్వారా విద్యార్థుల్లో మొక్కలు నాటే అలవాటును పెంచుతున్నట్లు చెప్పారు. యూజ్, రికవర్, రీ యూజ్ పాలసీని అమలు చేస్తున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వం 85 లక్షల టన్నుల చెత్తను వదిలి వెళ్లిందన్నారు. ఏడాది సమయం లక్ష్యంగా పెట్టుకుని అనుకున్న దాని కంటే 5 లక్షల టన్నుల అధికంగా చెత్తను తొలగించినట్లు తెలిపారు. గత ప్రభుత్వం విధించిన చెత్త పన్నును రద్దు చేశామన్నారు. జనవరి నాటికి 8,814 గ్రామాలను, 6 జిల్లాలను ఓడిఎఫ్ ప్లస్‌గా రూపొందిస్తామని స్పష్టం చేశారు. గ్రామాల్లో 12 వేల ట్రైసైకిల్స్, 5 వేల పుష్ కార్డులు, పట్టణాలకు 1,535 ఇవి వాహాలను అందజేస్తున్నట్లు చెప్పారు. ఇకపై ప్రతి ఏటా అవార్డులు అందజేస్తామన్నారు. నిత్యం సేకరించే వ్యర్థాలతోపాటు వ్యవసాయ, పారిశ్రామిక వ్యర్థాలతో ప్రాంతాల వారీగా సర్క్యులర్ ఎకానమి పార్కులను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. రీసైక్లింగ్ పరిశ్రమలను ప్రోత్సహించి ఉపాధి అవకాశాలు పెంచే ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. మరోవైపు పారిశుధ్య కార్మికులకు రూ.కోటి బీమా సౌకర్యం కల్పించామన్నారు. గ్రూపు ఆరోగ్య బీమా సౌకర్యాల్ని తీసుకువచ్చామని తెలిపారు. రాష్ట్రంలో ప్రతి ఒక్కరి ఆరోగ్యాన్ని ట్రాక్ చేసేలా సంజీవని ప్రాజెక్టును తీసుకువస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పి.నారాయణ, కె.పార్థసారధి, సచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ పట్టాబిరామ్, పిసిబి ఛైర్మన్ కృష్ణయ్య, ముఖ్య కార్యదర్శులు ఎస్.సురేష్, శశిభూషణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించేందుకు ప్రయత్నం

- విద్యుత్ ట్రేడ్ యూనియన్‌తో ట్రాన్స్‌కో అడిషనల్ సెక్రటరీ రోజా

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అపరిష్కృతంగా ఉన్న విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించే ప్రయత్నం చేస్తున్నామని ట్రాన్స్‌కో అడిషనల్ సెక్రటరీ పెద్ది రోజా.. ఎపి విద్యుత్ ట్రేడ్ యూనియన్ స్ట్రగుల్ కమిటీకి తెలిపారు. స్ట్రగుల్ కమిటీ నాయకులతో విజయవాడలోని విద్యుత్ సౌధలో ట్రాన్స్‌కో యాజమాన్యం తరపున రోజా సోమవారం చర్చలు జరిపారు. తమ డిమాండ్లను పరిష్కరించకపోతే ఈ నెల 15 నుంచి సమ్మె తప్పదని నాయకులు తెలిపారు. ఈ సమావేశంలో కమిటీ ఛైర్మన్ పి సుదర్శన్ రెడ్డి, నాయకులు పి ప్రసాద్, ముజఫర్ అహ్మద్, మోహన్‌రావు, నాగరాజు పాల్గొన్నారు.

హుస్సేన్ నాయక్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నేవీ ఆయుధ డిపోను తరలించండి

- జాతీయ ఎస్‌టి కమిషన్ సభ్యులు నాయక్‌కు వినతిపత్రం

ప్రజాశక్తి - బుట్టాయగూడెం (ఏలూరు)

నేవీ ఆయుధ డిపోను మా ప్రాంతం నుంచి తరలించాలని కోరుతూ జాతీయ ఎస్‌టి కమిషన్ సభ్యులు హుస్సేన్ నాయక్‌కు ఆయుధ డిపో వ్యతిరేక పోరాట కమిటీ సభ్యులు వినతిపత్రం అందజేశారు. మూడుసార్లు గ్రామ సభ తీర్మానాలు చేసినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తోందని, ఈ డిపో వల్ల రెండు పంటలు పండే భూములు గిరిజనులు కోల్పోవాల్సి వస్తోందని, ఎటువంటి పంటలు పండని భూముల్లో ఈ ఆయుధ డిపోను నిర్మించాలని కోరారు. హుస్సేన్ నాయక్ మాట్లాడుతూ... ఈ విషయాలపై రేపు రివ్యూ సమావేశం జరుగుతుందని, మీ ఇబ్బందులు తెలియజేస్తే అధికారులకు చెబుతామని తెలిపారు. ప్రజా వ్యతిరేకం ఉంటే ఆయుధ డిపో నిర్మాణం చేయబోమని చెప్పారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో నేవీ ఆయుధ వ్యతిరేక పోరాట కమిటీ నాయకులు, వామపక్ష నాయకులు తెల్లం.దుర్గారావు, తెల్లం రామకృష్ణ, కారం ధారయ్య, పొట్ట వెంకటేశ్వరరావు, తెల్లం శంకరుడు, నాయకులు నాయకులు ఉన్నారు.

ఆరు రోజులుగా షట్‌డౌన్

- అమెరికాలో కొనసాగుతున్న ప్రతిష్టంభన
- భారీగా లేఆఫ్‌లు తప్పవని ట్రంప్ బెదిరింపు

వాషింగ్టన్ : అమెరికాలో ప్రభుత్వ షట్‌డౌన్ కొనసాగుతోంది. ఈ నెల 1న ప్రారంభమైన షట్‌డౌన్ మంగళవారం ఆరో రోజుకు చేరింది. వ్యయ బిల్లుపై అధికార రిపబ్లికన్, ప్రతిపక్ష డెమొక్రటిక్ పార్టీల మధ్య కొనసాగుతున్న చర్చలు ఫలించేలా లేవు. లేఆఫ్‌లు కొనసాగుతున్నాయని అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులను తొలగిస్తారా అని విలేకరులు అడిగిన ప్రశ్నకు ట్రంప్ బదులిస్తూ 'ఇప్పటికే ఆ పని జరుగుతోంది. డెమొక్రాట్లే దీనికి కారణం' అని ఆరోపించారు. దేశంలో అనేక ఉద్యోగాలు పోవడానికి వారే కారకులని నిందించారు. ఏయే సంస్థలలో ఉద్యోగాలలో కోత పెడతారని అడిగిన ప్రశ్నకు సమాధానం ఇచ్చేందుకు ట్రంప్ నిరాకరించారు.

ఉద్రిక్తతలు మరింత పెరుగుతాయి

ప్రతిష్టంభన తొలగించేందుకు శాసనకర్తలు ప్రయత్నాలు కొనసాగిస్తున్న తరుణంలో లేఆఫ్‌లు జరిగితే ఉద్రిక్తతలు మరింత పెరిగే అవకాశం ఉంది. వ్యయ బిల్లుపై తమ వాదనే నెగ్గాలని అటు రిపబ్లికన్లు, ఇటు డెమొక్రాట్లు పట్టు పడుతుండడంతో ప్రతిష్టంభన కొనసాగుతోంది. అమెరికాలో ఆర్థిక అనిశ్చితి కొనసాగుతున్న తరుణంలో పులి మీద పుట్రలా షట్‌డౌన్ జరిగింది. ట్రంప్ విధించిన దిగుమతి సుంకాలు వ్యాపారాలను దెబ్బతీశాయి. ఉద్యోగాల కల్పన తగ్గిపోయింది. ద్రవ్యోల్బణం పెరుగుతోంది. ఆయన నాయకత్వంపై విశ్వాసం సన్నగిల్లుతోంది. రెండు ట్రిలియన్ డాలర్ల వార్షిక బడ్జెట్ లోటును భరించడం కష్టంగా మారింది.

అధ్యక్ష భవనం బెదిరింపులు

చర్చలు విఫలమయ్యాయని ట్రంప్ భావిస్తే ప్రభుత్వ ఉద్యోగులను పెద్ద సంఖ్యలో తొలగించడం మొదలవుతుందని అధ్యక్ష భవనం హెచ్చరించింది. రాజకీయ, ఆర్థిక సంక్షోభాన్ని నివారించేందుకు డెమొక్రాట్లకు ఇంకా అవకాశం ఉన్నదని అధ్యక్ష భవనం జాతీయ ఆర్థిక మండలి డైరెక్టర్ కెవిన్ హాసెట్ సీఎన్ఎన్ కార్యక్రమంలో చెప్పారు. ఇదిలావుండగా ప్రభుత్వ షట్‌డౌన్ కొనసాగుతున్నప్పటికీ ట్రంప్ ఆదివారం వర్జీనియాలోని నార్ఫోక్‌లో అమెరికా నౌకాదళ వార్షికోత్సవ కార్యక్రమానికి హాజరయ్యారు.

'ఆట కొనసాగాలని నేను భావిస్తున్నాను' అని ట్రూత్ సోషల్‌లో ఆయన వ్యాఖ్యానించారు. ఏదేమైనా ప్రతిష్టంభనను తొలగించడానికి అర్థవంతమైన చర్చలేవీ జరగడం లేదు. ప్రస్తుతం జరుగుతున్న అరకొర చర్చలు ఫలప్రదమయ్యే సూచనలు కూడా కన్పించడం లేదు. షట్‌డౌన్ కారణంగా ఏడున్నర లక్షల మంది ప్రభుత్వోద్యోగుల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారింది. షట్‌డౌన్ కొనసాగినంత కాలం ఉద్యోగులకు ప్రభుత్వం రోజుకు 400 మిలియన్ డాలర్ల నష్టపరిహారం చెల్లించాల్సి ఉంటుంది.

2 దశల్లో బీహార్ అసెంబ్లీ ఎన్నికలు

- నవంబరు 6, 11 తేదీల్లో పోలింగ్
- షెడ్యూల్‌ను విడుదల చేసిన ఎన్నికల సంఘం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

బీహార్ అసెంబ్లీ ఎన్నికలకు నగారా మోగింది. రెండు విడతల్లో ఎన్నికల నిర్వహణకు కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటించింది. సోమవారం నాడిక్కడ విజ్ఞాన్ భవన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సింధు, వివేక్ జోషితో కలిసి ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్.. బీహార్ అసెంబ్లీ ఎన్నికల తేదీలను ప్రకటించారు. నవంబరు 6న తొలి విడత, నవంబరు 11న రెండో విడత పోలింగ్ జరగనుందని వెల్లడించారు. మొదటి దశలో 121 అసెంబ్లీ స్థానాలకు, రెండో దశలో 122 అసెంబ్లీ స్థానాలకు పోలింగ్ జరగనున్నట్లు తెలిపారు. నవంబరు 14న ఓట్ల లెక్కింపు చేసి, ఫలితాలు వెల్లడిస్తామన్నారు. పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు తరువాతే వివి ప్యాట్, ఇవిఎంల లెక్కింపు చేపడతామన్నారు. ఇసిఐనెట్ యాప్‌తో ఎప్పటికప్పుడు ఎన్నికల సరళి గురించి అప్‌డేట్ ఉంటుందన్నారు. ఓటింగ్ జరుగుతున్న సమయంలో ప్రతి రెండు గంటలకోసారి ఈ యాప్‌లో ఓటింగ్ డేటా అప్‌డేట్ అవుతుందని వెల్లడించారు. పోలింగ్ స్టేషన్ల వద్ద మొబైల్ డిపాజిట్ కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఓటర్ ఇన్ఫర్మేషన్ స్లిప్‌లను కొత్తగా ఇవ్వనున్నామని, ఆ స్లిప్స్‌పై ఓటరు ఐడి నెంబర్ స్పష్టంగా కనిపిస్తుందన్నారు. ప్రతి పోలింగ్ స్టేషన్‌లో అత్యధికంగా 12,00 ఓటర్లు మాత్రమే పోలింగ్ చేసే రీతిలో ఏర్పాట్లు చేశామన్నారు.

ఎస్ఐఆర్‌తో 68.5 లక్షల ఓట్లు తొలగింపు

స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) చేపట్టిన తరువాత జరుగుతున్న తొలి ఎన్నికలు బీహార్ అసెంబ్లీవేనని అన్నారు. ఎస్ఐఆర్‌తో బీహార్‌లో 68.5 లక్షల ఓటర్లను తొలగించామని, 21.5 లక్షల మంది కొత్త ఓటర్లు జాబితాలో చేరారని అన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియతో బీహార్ ఓటర్ల జాబితాను పరిశుభ్రం చేసినట్లు చెప్పారు. అన్ని రాజకీయ పార్టీలు, వ్యక్తులను అభ్యంతరాలు దాఖలు చేయాలని కోరామని, ఆ తరువాతనే ముసాయిదాను పబ్లిష్ చేశామన్నారు.

సెప్టెంబరు 30న తుది ఓటర్ల జాబితాను వెల్లడించినట్లు తెలిపారు. ఎన్నికలకు సంబంధించిన తుది ఓటరు జాబితాను ప్రకటించామని, ఒకవేళ ఎవరైనా అప్పీల్ చేసుకోవాలనుకుంటే, నామినేషన్‌కు 10 రోజుల ముందు వరకు చేసుకోవచ్చని సిఇసి జ్ఞానేష్ కుమార్ తెలిపారు. బీహార్ అసెంబ్లీ ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. ఓటర్లకు వీలైన రీతిలో ఎన్నికలు నిర్వహిస్తున్నామని, రాష్ట్రంలో శాంతి భద్రతల పరిస్థితిని సమీక్షిస్తున్నట్లు చెప్పారు. 7.43 కోట్ల మంది బీహారీ ఓటర్లలో 3.92 కోట్ల మంది పురుషులు, 3.51 కోట్ల మంది మహిళా ఓటర్లు ఉన్నారని తెలిపారు. మొదటిసారి ఓటు హక్కును వినియోగించుకుంటున్న ఓటర్లు 14 లక్షలు ఉన్నట్లు ఆయన వెల్లడించారు. ఎలాంటి ఫిర్యాదులకైనా 1950 నెంబర్‌కు ఓటర్లు డయల్ చేయొచ్చని తెలిపారు. ఏ పోలింగ్ కేంద్రంలోనూ 1,200 మందికి మించి ఓటర్లు ఉండరని, తాజా సవరణతో బీహార్‌లో ప్రస్తుతమున్న 77,895 పోలింగ్ కేంద్రాలు 90,712కి పెరిగాయన్నారు.

243 స్థానాలు కలిగిన బీహార్ అసెంబ్లీకి నవంబరు 22తో గడువు ముగియనుంది. 2020 ఎన్నికల్లో మూడు విడతల్లో పోలింగ్ జరగ్గా.. అంతకు ముందు ఐదు విడతల్లో పోలింగ్ నిర్వహించారు. ఈసారి రెండు విడతల్లోనే నిర్వహించేందుకు షెడ్యూల్ విడుదల చేశారు.

నవంబరు 11న జూబ్లీహిల్స్‌తో సహా మరో 7 స్థానాలకు ఉప ఎన్నిక

దేశవ్యాప్తంగా ఖాళీగా ఉన్న 8 అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికలు జరగనున్నాయి. నవంబరు 11న బీహార్ అసెంబ్లీ పోలింగ్ రెండవ దశతో పాటు ఈ ఉప ఎన్నికలు నిర్వహించనున్నట్లు సిఇసి జ్ఞానేష్ కుమార్ తెలిపారు. నవంబరు 14న బీహార్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలతో పాటు ఉప ఎన్నికల ఫలితాలు కూడా ప్రకటిస్తామని వెల్లడించారు. తెలంగాణ, రాజస్థాన్, ఝార్ఖండ్, పంజాబ్, మిజోరం, ఒడిశా, జమ్ముకాశ్మీర్‌లో ఖాళీ అయిన 8 అసెంబ్లీ స్థానాలకు నవంబరు 11న ఉప ఎన్నికలు జరగనున్నాయి. తెలంగాణలోని జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్, పంజాబ్‌లోని తర్న్ తరణ్ ఎమ్మెల్యే కశ్మీర్ సింగ్ సోహల్, ఝార్ఖండ్‌లోని ఘట్సిలా నియోజకవర్గం ఎమ్మెల్యే రాందాస్ సోరెన్, మిజోరాంలోని డంపా నియోజకవర్గం ఎమ్మెల్యే లాల్రింట్లుంగా సైలా, ఒడిశాలోని నువాపాడ ఎమ్మెల్యే రాజేంద్ర ధోలాకియా మరణించిన నేపథ్యంలో ఆయా స్థానాలు ఖాళీ అయ్యాయి. రాజస్థాన్‌లోని అంటా ఎమ్మెల్యే కన్వర్‌లాల్ మీనా దోషిగా తేలి అనర్హత వేటు పడటంతో ఆ స్థానం ఖాళీ అయ్యింది. జమ్ముకాశ్మీర్ సిఎం ఒమర్ అబ్దుల్లా రెండో స్థానంలో పోటీ చేసి గెలిచిన తరువాత రాజీనామా చేసిన బుద్గామ్, ఎమ్మెల్యే దేవేందర్ సింగ్ రాణా మరణంతో ఖాళీ అయిన నగ్రోటా స్థానాలు ఖాళీ అయ్యాయి. దీంతో ఈ ఎనిమిది అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికలను ఇసి నిర్వహిస్తుంది.

మీడియా సమావేశంలో మాట్లాడుతున్న సిఇసి జ్ఞానేష్‌కుమార్

అంగన్‌వాడీ కార్యకర్తలతో బురఖా ధరించిన ఓటర్ల తనిఖీ

రానున్న బీహార్ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌లో బురఖా ధరించిన ఓటర్లను అంగన్‌వాడీ కార్యకర్తలు తనిఖీ చేయనున్నారని సిఇసి జ్ఞానేశ్ కుమార్ తెలిపారు. బురఖా ధరించిన మహిళా ఓటర్లు గురించి అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానం ఇచ్చారు. బురఖా ధరించిన మహిళా ఓటర్ల గుర్తింపునకు అంగన్‌వాడీ కార్యకర్తలు సాయం చేస్తారని చెప్పారు. 'బురఖా ధరించిన మహిళా ఓటర్ల గుర్తింపు ధ్రువీకరించడానికి అంగన్‌వాడీ కార్యకర్తలను అన్ని పోలింగ్ బూత్‌ల వద్ద నియమిస్తాం. పోలింగ్ బూత్ లోపల గుర్తింపు ధ్రువీకరణకు ఉన్న మార్గదర్శకాలు స్పష్టంగా ఉన్నాయి. వాటిని ఖచ్చితంగా పాటిస్తాం' అని అన్నారు.

కేంద్రంలోని బిజెపి ఒత్తిడి మేరకే కేంద్ర ఎన్నికల సంఘం ఈ నిర్ణయం తీసుకుందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బీహార్‌లో ఇటీవల రాజకీయ పార్టీలతో ఇసి నిర్వహించిన సమావేశంలో బురఖాలతో వచ్చే ముస్లిం మహిళలను పూర్తిగా తనిఖీ చేయాలని బిజెపి నాయకులు డిమాండ్ చేసిన సంగతి తెలిసిందే.

తక్షణమే చర్య తీసుకోండి

చీఫ్ జస్టిస్ గవాయ్‌పై దాడికి సిపిఎం ఖండన

న్యూఢిల్లీ : భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్‌పైకి బూటు విసరడాన్ని సిపిఎం పొలిట్‌బ్యూరో తీవ్రంగా ఖండించింది. సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్‌లో నమోదైన ఆ న్యాయవాదిపై తక్షణమే చర్య తీసుకోవాలని డిమాండ్ చేసింది. బహిరంగంగా కోర్టు గదిలో సిజెఐ గవాయ్‌పై ఇలా బూటు విసరడం అత్యంత దిగ్భ్రాంతిని కలిగించేలా వుందని, పైగా అదే సమయంలో సనాతన ధర్మానికి మద్దతుగా నినాదాలు కూడా చేశారని, ఇది తీవ్ర విచారకరమైన అంశమని పొలిట్‌బ్యూరో పేర్కొంది. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసింది.. బిజెపి ముఖ్యమంత్రులు, మంత్రులు, నేతలు ఇటీవల కులతత్వాన్ని పెంచి పోషిస్తూ, మనువాదీ, మతోన్మాద వ్యాఖ్యలు చేయడం ఇటువంటి చర్యలకు పాల్పడేందుకు వారికి ధైర్యాన్ని ఇచ్చిందని పొలిట్‌బ్యూరో విమర్శించింది. హిందూత్వ మతోన్మాద శక్తులు సమాజంలోకి చొప్పిస్తున్న ఉన్మాద విషానికి ఈ సంఘటన మరొక ఉదాహరణ అని పేర్కొంది. తమ సిద్ధాంతానికి అనుగుణంగా లేని ఏ అభిప్రాయాన్నైనా ఆమోదించడానికి సంఘపరివార్ సుముఖంగా లేదని, వారి అసహనం ఈ చర్య ద్వారా ప్రతిబింబిస్తోందని పొలిట్‌బ్యూరో పేర్కొంది.

సిజెఐ గవాయ్‌కు తగిన రక్షణ కల్పిస్తూ చర్యలు తీసుకోవాలని భారత ప్రభుత్వాన్ని సిపిఎం డిమాండ్ చేసింది. అసహనాన్ని వ్యాప్తి చేసే వ్యక్తులు, సంస్థలతో ప్రభుత్వం ధృఢంగా వ్యవహరించాలని కోరింది. అదే సమయంలో భావ ప్రకటనా స్వేచ్ఛకు, అసమ్మతి తెలియజేసే హక్కుకు రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేసింది.

జిఎస్‌టిపై అసంతృప్తిని చల్లార్చేందుకే

(మొదటిపేజీ తరువాయి)

రూ.14 వేల కోట్ల వరకూ నష్టపోతోందని, దీనిపై కేంద్రానికి లేఖ రాసిందని చెప్పారు. ఆ విషయం బయటకు రావడంతో తాము లేఖ రాయలేదంటూ మరొక లేఖ విడుదల చేశారని చెప్పారు. ప్రధాని మన రాష్ట్రానికి వస్తున్న నేపథ్యంలో జిఎస్‌టి నష్టపరిహారం ప్రకటించాలని డిమాండు చేశారు. జిఎస్‌టి దోపిడీ ఇదే పద్ధతిలో సాగితే కొద్దికాలానికి రాష్ట్రాలు అడుక్కోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని అన్నారు. అలాంటి పరిస్థితి రాకుండా ఉండాలంటే రాష్ట్రాలను ఆదుకోవాలని కోరారు. అలాగే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శ్రీశైలాన్ని టిటిడి తరహాలో అభివృద్ధి చేస్తానని చెబుతున్నారని, ప్రాధాన్యత పనులేవో గుర్తించి ముందు వాటిని పూర్తి చేయాలని సూచించారు. వెనుకబడి ప్రాంతాలకు నిధులు ఇవ్వడం లేదని, రైతాంగానికి తీవ్ర సమస్యలు ఉన్నాయని తెలిపారు. వెలిగొండ ప్రాజెక్టు పనులు పూర్తి చేయడంతోపాటు రూ.1,300 కోట్లు కేటాయిస్తే నల్లమలసాగర్ పనులూ పూర్తి చేయొచ్చని, దీనిద్వారా ప్రకాశం జిల్లా అభివృద్ధి చెందుతుందని చెప్పారు. దొనకొండలో బిడిఎల్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తామని వార్తలు వస్తున్నాయని, దానికి నీటి అవసరాలు ఉంటాయని వివరించారు. వెలిగొండ ప్రాజెక్టు పనులు సంవత్సరాల తరబడి సాగుతూనే ఉన్నాయని, గతంలో జగన్ కూడా పూర్తిచేసినట్లు ప్రారంభోత్సవాలు చేశారని, ఇప్పటికీ పనులు పూర్తవలేదని అన్నారు. తాము అధికారంలోకి వస్తే వెంటనే వెలిగొండతోపాటు వెనుకబడిన ప్రాంతాల ప్రాజెక్టులు పూర్తి చేస్తామని చంద్రబాబునాయుడు హామీఇచ్చారని, ఇప్పుడు పట్టించుకోకపోవడం అన్యాయమన్నారు. ప్రజా సమస్యలపై సిఎం శ్రద్ధ పెట్టడం లేదని చెప్పారు. గతంలో బనకచర్ల అన్నారని, ఇప్పుడు పోలవరం, సోమశిల అంటున్నారని, ఇటువంటి ఉబుసుపోని పథకాల వల్ల ఉపయోగం లేదని పేర్కొన్నారు.

ప్రధాని రాక సందర్భంగా నిరసనలు : సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

రాష్ట్రానికి ప్రధాని మోడీ అన్యాయం చేస్తున్న నేపథ్యంలో ఆయన రాక సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు చెప్పారు. అన్ని వామపక్ష పార్టీలను దీనిపై చర్చించి కలుపుకుపోతామన్నారు. విభజన హామీలనూ కేంద్రం నెరవేర్చడం లేదని పేర్కొన్నారు. మోడీ ప్రధాని అయ్యాక రాష్ట్రానికి ఒక్క అభివృద్ధి పథకం కూడా ప్రకటించలేదన్నారు. మోడీ వల్ల రాష్ట్రానికి ఒరిగేందేమీ లేదని, కడప ఉక్కు నిర్మిస్తామని చెప్పినా కనీసం పునాది కూడా వేయలేదని అన్నారు. ప్రైవేటు మిట్టల్ కంపెనీకి అన్ని అనుమతులూ వచ్చేస్తున్నాయని విమర్శించారు. బుందేల్‌ఖండ్ తరహాలో రాయలసీమకు ప్యాకేజీ ఇస్తామన్నా ఇంతవరకు ఊసేలేదని అన్నారు. రాష్ట్రం నుండి 20 లక్షల మంది విద్యార్థులు అమెరికాలో చదువుతున్నారని, వారందరూ ఇబ్బందుల్లో ఉన్నారని వారికి రక్షణ కల్పించాలని కోరారు. అమెరికాలో ఉంటున్న వారిని పి4కు సాయం చేయాలని కోరుతు న్నారని, వారికి ఇబ్బంది ఎదురైతే చంద్రబాబు నోరెత్తడం లేదన్నారు. రాష్ట్రంలో ఎనిమిది లక్షల ఆటోలు ఉంటే రెండు లక్షల మందికే రూ.15 వేల సాయం ఇచ్చారని, మిగిలిన వారిని వదిలేశారని అన్నారు. ఇటువంటి కంటి తుడుపు చర్యల వల్ల ఉపయోగం లేదని అన్నారు.

హాస్టళ్లలో పిల్లలు చనిపోతున్నా పట్టించుకోవడం లేదు

రాష్ట్రంలో సాంఘిక, గిరిజన సంక్షేమ గురుకులాల్లో విద్యార్థులు చనిపోవడం బాధాకరమని శ్రీనివాసరావు తెలిపారు. వారి రక్షణ కోసం ఎటువంటి చర్యలూ తీసుకోలేదని అన్నారు. చనిపోయిన పిల్లల కుటుంబాలకు రూ.50 లక్షల పరిహారం అందివ్వాలని కోరారు. అనారోగ్యంతో పిల్లలు చదువుపై దృష్టి పెట్టలేకపోతున్నారని పేర్కొన్నారు. వారికి మెరుగైన వైద్యం అందించాలని, ఇటువంటి చర్యలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. చిన్నపిల్లలు నష్టపోతున్నారని, దీనిపై సిఎం, డిప్యూటీ సిఎం ప్రకటనలు చేయడం తప్ప తగిన చర్యలు తీసకోవడం లేదని అన్నారు.

రాజస్థాన్‌లో ఘోరం

(మొదటిపేజీ తరువాయి)

ప్రశ్నలు తలెత్తుతున్నాయి. మంటలు వచ్చిన వెంటనే ఫైర్ అలారమ్ వ్యవస్థ సరిగా పనిచేయలేదని అక్కడి వారు చెబుతు న్నారు. పైగా ఆక్సిజన్ లైన్‌ను అనుసంధానించడంలో కూడా జాప్యం జరిగింది. తగిన మొత్తంలో అగ్నిమాపక పరికరాలు లేకపోవడంతో మంటలు త్వరిత గతిన వ్యాప్తిచెందడానికి కారణమైంది.

కుటుంబాల ధర్నా

ఈ ప్రమాదం పట్ల రోగుల కుటుంబాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఆస్పత్రి వెలుపల ధర్నా కూడా నిర్వహించారు. పాలనా యంత్రాంగం నిర్లక్ష్యం వల్లే ఇదంతా జరిగిందని వారు విమర్శించారు.

ఉన్నత స్థాయి దర్యాప్తు కమిటీకి ఆదేశాలు

ప్రమాదం గురించి తెలిసిన వెంటనే అర్ధరాత్రి దాటిన తర్వాత ముఖ్యమంత్రి భజన్‌లాల్ శర్మ ఆస్పత్రికి చేరుకుని పరిస్థితులను సమీక్షించారు. గాయపడిన వారికి తక్షణమే చికిత్స అందించడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇది చాలా విషాదకరమైన, ఆందోళన కలిగించిన సంఘటన అని సిఎం అభివర్ణించారు. ఇందుకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. జరిగిన ఘటనపై సవివరమైన నివేదిక ఇవ్వాల్సిందిగా ఆదేశించారు. సంఘటన తీవ్రతను దృష్టిలో వుంచుకుని ఉన్నత స్థాయి దర్యాప్తు కమిటీకి ఆదేశాలు జారీ చేశారు.

పిహెచ్‌సి వైద్యుల ఆందోళనకు పలు సంఘాల మద్దతు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఇన్ సర్వీస్ పిజి కోటా 15 నుంచి 20 శాతం అన్ని విభాగాల్లో ఐదేళ్లపాటు కొనసాగించాలని డిమాండ్ చేస్తూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల (పిహెచ్‌సి) వైద్యులు చేపట్టిన ఆందోళనకు పలు సంఘాలు మద్దతు తెలిపాయి. విజయవాడలోని ధర్నాచౌక్‌లో రెండోరోజు సోమవారం కొనసాగుతోన్న నిరాహార దీక్షలకు ఎపి జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్, సెకండరీ హెల్త్ డాక్టర్స్ అసోసియేషన్, యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ అసోసియేషన్, ల్యాబ్ టెక్నీషియన్స్ అసోసియేషన్, ఆశా వర్కర్ల అసోసియేషన్‌లు మద్దతు తెలిపాయి. సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి నాగేశ్వరరావు దీక్షా శిబిరాన్ని సందర్శించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎపి పిహెచ్‌సి వైద్యుల సంఘం అధ్యక్షులు రవీంద్రనాయక్, కార్యదర్శి కిషోర్, కోశాధికారి వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. మంగళవారం నుంచి ఏరియా, జిల్లా, కమ్యూనిటీ ఆస్పత్రుల వైద్యులు కూడా ఈ దీక్షల్లో పాల్గొనున్నారు.

ఈ దీక్షలకు పలువురు మద్దతు తెలుపుతూ సోమవారం వేర్వేరుగా ప్రకటనలు విడుదల చేశారు. సిఐటియు రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎవి నాగేశ్వరరావు, సిహెచ్ నరసింగరావు మద్దతు తెలిపారు. అలాగే ఎపి యునైటెడ్ విలేజ్ వార్డు అండ్ హెల్త్ సెక్రటరీస్ వెల్ఫేర్ అసోసియేషన్ (యుహెచ్ఎస్ఎ) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎ మాధవి, జి సంధ్యారాణి, ఎపి నేషనల్ హెల్త్ మిషన్ జాయింట్ యాక్షన్ కమిటీ ఛైర్మన్ డి దయామణి, కన్వీనరు సిహెచ్ ప్రభాకర్‌రెడ్డి మద్దతు తెలిపారు. యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె జగన్‌మోహన్‌రావు, తాళ్లూరి వెంకటేశ్వర్లు మద్దతు తెలిపారు.

బిసి రిజర్వేషన్లకు వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్ కొట్టివేత

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ తెలంగాణ ప్రభుత్వం తెచ్చిన జిఓ 9ను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టేసింది. ఈ అంశంపై రాష్ట్ర హైకోర్టులో రెండు పిటిషన్లు పెండింగ్‌లో ఉన్నందున విచారణకు నిరాకరించింది. విచారణ పరిధి తెలంగాణ హైకోర్టులో ఉన్నందున అక్కడే తేల్చుకోవాలని స్పష్టం చేసింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ గతవారం తెలంగాణ ప్రభుత్వం జిఓ 9ని తీసుకొచ్చింది. ఈ జిఓను వ్యతిరేకిస్తూ గత నెల 29న వంగ గోపాల్‌రెడ్డి సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈసారి ఎన్నికల్లో తాను పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నానని, ప్రభుత్వ జిఓతో తనకు నష్టం జరుగుతుందని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ పిటిషన్‌పై సోమవారం సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతాతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారణ జరిపింది.

వాంగ్‌చుక్ అరెస్టు కారణాన్ని ఆంగ్మోతో పంచుకోవడాన్ని పరిశీలించండి

: కేంద్రానికి సుప్రీంకోర్టు ఆదేశం

న్యూఢిల్లీ : లడఖ్ ప్రజా ఉద్యమకారుడు సోనం వాంగ్‌చుక్ ముందస్తు అరెస్టుకు కారణాలను ఆయన భార్య గీతాంజలి ఆంగ్మోతో పంచుకోవడాన్ని పరిశీలించాలని కేంద్ర ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు సోమవారం ఆదేశించింది. లడఖ్ రాజధాని లేహ్‌లో కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళనల తరువాత జాతీయ భద్రతా చట్టం (ఎన్ఎస్ఎ) కింద వాంగ్‌చుక్‌ను అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. వాంగ్‌చుక్‌ను కోర్టులో హాజరు పర్చాలని ఆయన్ను అరెస్టు చేసిన అధికారులను ఆదేశించాలని సుప్రీంకోర్టును గీతాంజలి ఆంగ్మో ఆశ్రయించారు. ఈ మేరకు సుప్రీంకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేశారు. వాంగ్‌చుక్‌ను అరెస్టు చేసి 10 రోజులు దాటిందని, అయినా, ఆయన అరెస్టుకు గల కారణాలు లేదా ఆయన ఆరోగ్యం గురించి ఎలాంటి సమాచారం లేదని సుప్రీంకోర్టుకు ఆమె తెలిపారు. ఈ పిటిషన్‌ను విచారించిన జస్టిస్ అరవింద్ కుమార్, జస్టిస్ ఎన్‌వి అంజరియాలతో కూడిన ధర్మాసనం కేంద్ర ప్రభుత్వం, లడఖ్ అధికారులకు నోటీసు జారీ చేసింది. ఈ కేసులో ప్రస్తుతానికి 'ఏదో జరిగింది' అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. తదుపరి విచారణను ఈ నెల 14కు వాయిదా వేసింది. గీతాంజలి ఆంగ్మో తరుపున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వాదనలు వినిపించారు. ముందుగా హైకోర్టును ఎందుకు సంప్రదించలేదని జస్టిస్ అరవింద్ కుమార్ వేసిన ప్రశ్నకు కపిల్ సిబల్ తగిన విధంగా సమాధానం ఇచ్చారు. 'ఏ హైకోర్టును ఆశ్రయించాలి. ఈ అరెస్టు చేసింది కేంద్ర ప్రభుత్వం' అని కపిల్ సిబల్ సమాధానం ఇచ్చారు. ఆంగ్మో తరుపున మరో సీనియర్ న్యాయవాది వివేక్ టంఖా కూడా వాదనలు వినిపించారు. వాంగ్‌చుక్‌ను కలవడానికి ఆంగ్మోను అనుమతించేలా అధికారులను ఆదేశించాలని కోర్టును కోరారు. దీనికి ధర్మాసనం స్పందిస్తూ 'ఆమెకు అనుమతి లభిస్తుంది. లేకపోతే మీరు మమ్మల్ని సంప్రదించవచ్చు' అని తెలిపింది. కేంద్రం, లడఖ్ పరిపాలన తరుపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు.

గాజాపై కైరోలో చర్చలు

- ఇజ్రాయిల్ దాడుల్లో 10మంది మృతి
- గ్రెటా థన్‌బెర్గ్‌తో సహా 171మంది ఫ్లోటిల్లా కార్యకర్తలను వెనక్కి పంపిన ఇజ్రాయిల్

కైరో : దాదాపుగా రెండేళ్ళుగా గాజాలో సాగుతున్న మారణహోమాన్ని అంతమొందించే లక్ష్యంతో హమాస్, ఇజ్రాయిల్ ప్రతినిధి బృందాలు సోమవారం ఈజిప్ట్ రాజధాని కైరోలో చర్చలు ప్రారంభించాయి. గత వారం అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించిన 20 సూత్రాల గాజా శాంతి ప్రణాళిక మొదటి దశ అమలుపై ఈ చర్చలు ఆరంభమయ్యాయి. కాగా తుది పరిష్కారం దిశగా 'త్వరగా ముందుకు సాగాల్సిందిగా ట్రంప్, ప్రతినిధి బృందాలను కోరారు.

గత నెల్లో కతార్‌లో ఇజ్రాయిల్ జరిపిన హత్యాయత్నం నుండి బయటపడిన ఖలీల్ అల్ హయ్యా నే ఇప్పుడు కూడా తమ ప్రతినిధి బృందానికి నేతృత్వం వహిస్తున్నారని హమాస్ తెలిపింది. మరోవైపు గాజాలో ఇజ్రాయిల్ దాడులు అడ్డూ అదుపు లేకుండా కొనసాగుతునే వున్నాయి. ఆహారం కోసం వెళ్ళిన వారితో సహా మొత్తంగా పది మంది పాలస్తీనియన్లు మరణించారు. ఆక్రమిత వెస్ట్ బ్యాంక్‌లో శాంతి కార్యకర్తలపై ఇజ్రాయిలీ ఆర్మీ దాడులకు పాల్పడింది.

ఇదిలావుండగా, స్వీడన్‌కు చెందిన పర్యావరణ కార్యకర్త గ్రెటా థన్‌బెర్గ్‌తో సహా 171మంది ఫ్లోటిల్లా కార్యకర్తలను ఇజ్రాయిల్ వెనక్కి వారి దేశాలకు పంపివేసింది. మానవతా సాయం అందించే లక్ష్యంతో గాజాకు బయలుదేరిన కార్యకర్తల పట్ల ఇజ్రాయిల్ దారుణంగా వ్యవహరించిందని, ఇజ్రాయిల్ కస్టడీలో వారి మౌలిక హక్కులు నిరాకరించబడ్డాయని లాయర్లు విమర్శించారు.

గాజాలో ఇజ్రాయిల్ దారుణాలపై యుగవ్ పోల్ నిర్వహించగా 57శాతం మంది బ్రిటన్ పౌరులు ఇజ్రాయిల్ చర్యలను నిరసించారు. జులై మాసంతో పోలిస్తే ఇలా నిరసించే వారు ఆరు శాతం మంది పెరిగారు.

స్వతంత్ర పాలస్తీనా ఏర్పడకపోతే మధ్య ప్రాచ్యంలో నిజమైన శాంతి నెలకొనదని ఈజిప్ట్ అధ్యక్షుడు ఎల్ సిసి వ్యాఖ్యానించారు. ముందుగా కాల్పుల విరమణ జరగాలని, ఆ తర్వాత బందీలు, పాలస్తీనా ఖైదీల మార్పిడి జరగాలని, అటుపై గాజా పునర్నిర్మాణం జరగాలని, ఇవన్నీ జరిగితేనే గాజాకు శాంతియుత రాజకీయ పరిష్కారాన్ని కనుగొనగలమని ఆయన పేర్కొన్నారు.

గ్రెటా థన్‌బెర్గ్ ఫ్లోటిల్లా కార్యకర్తలు

రాజకీయ పోరాటాలకు వేదికగా కోర్టును ఉపయోగించుకోవద్దు

- కేరళ సిఎంకు వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్‌ను కొట్టేసిన సుప్రీం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కొచ్చిన్ మినరల్స్ అండ్ రూటైల్ లిమిటెడ్ (సిఎంఆర్‌ఎల్) ఎక్సలాజిక్ కాంట్రాక్టు కేసులో ముఖ్యమంత్రి పినరయి విజయన్, ఆయన కుమార్తె వీణపై విజిలెన్స్ దర్యాప్తు కోరుతూ కాంగ్రెస్ ఎమ్మెల్యే మాథ్యు కుజల్నాదన్ దాఖలు చేసిన అప్పీల్‌ను సుప్రీంకోర్టు తీవ్రంగా విమర్శించింది. ప్రధాన న్యాయమూర్తి బిఆర్ గవాయ్, న్యాయమూర్తి జస్టిస్ వినోద్ చంద్రన్‌లతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌ను కొట్టివేసింది. అవినీతి ఆరోపణలపై దర్యాప్తునకు ఆదేశించడానికి నిరాకరించిన విజిలెన్స్ కోర్టు ఆదేశాలను సవాల్ చేస్తూ దాఖలైన రివిజన్ పిటిషన్లను కొట్టివేసిన కేరళ హైకోర్టు తీర్పులో జోక్యం చేసుకోవడానికి సుప్రీంకోర్టు ధర్మాసనం నిరాకరించింది. పిటిషనర్ తరపున సీనియర్ న్యాయవాది గురు కృష్ణకుమార్‌కు ధర్మాసనం మీరు రాజకీయ పోరాటాలను కోర్టులో కాకుండా ఓటర్ల ముందు చేయాలని, ఇదే తాము నిరంతరం చెబుతూనే ఉన్నామని హితవు పలికింది. పిటిషన్‌లోని వాదనలపై తీవ్రంగా స్పందించిన ధర్మాసనం, మీకు ఎలాంటి వాదనలు ఉన్నాయని ప్రశ్నించింది. వాదన సమయంలో ముఖ్యమంత్రి పేరును లాగడానికి కుజల్నాదన్ ప్రయత్నించినప్పటికీ, 'ముఖ్యమంత్రి' అనే పదాన్ని ప్రస్తావించడానికి కూడా కోర్టు నిరాకరించింది. ముఖ్యమంత్రి పినరయి విజయన్, కుమార్తె వీణ తరపున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ హాజరయ్యారు. హైకోర్టు చెప్పని విషయాలను లేవనెత్తడంతో కుజల్నాదన్ న్యాయవాది సుప్రీంకోర్టును తప్పుదారి పట్టించడానికి ప్రయత్నించారు. జస్టిస్ వినోద్ చంద్రన్ దీనిని తోసిపుచ్చారు. కుజల్నాదన్‌కు రాజకీయ ఉద్దేశముందని, లావాదేవీలోని కొన్ని అంశాలను పరిశీలించాల్సిన అవసరం ఉందని హైకోర్టు చెప్పలేదని కృష్ణకుమార్ వాదించారు. అలాంటిదేమీ లేదని చెబుతూ జస్టిస్ వినోద్‌చంద్రన్ జోక్యం చేసుకున్నారు. ప్రాథమిక వాస్తవాలను కోరుతూ హైకోర్టు ఇచ్చిన తీర్పు తప్పు అన్న కుజల్నాదన్ వాదనను తోసిపుచ్చారు. హైకోర్టుతీర్పులో జోక్యం చేసుకోబోమని స్పష్టంచేశారు. రూ.10 లక్షల జరిమానా విధిస్తామని సిజెఐహెచ్చరించారు.

సిజెఐపై దాడి

(మొదటిపేజీ తరువాయి)

రాజ్యాంగంపై జరిగిన దాడి అని, తీవ్రమైన ఆగ్రహం, బాధతో గవాయ్‌కు సంఫీుభావంగా దేశమంతా నిలవాలని కోరారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే స్పందిస్తూ... ఈ బుద్ధిహీన చర్య సమాజాన్ని ద్వేషం, మతోన్మాదం ఎలా ముంచెత్తాయో చూపిస్తుందని విమర్శించారు. సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా ఈ చర్య దురదృష్టకరమని, ఖండించదగినదని అన్నారు. సీనియర్ న్యాయవాది ఇందిరా జైసింగ్ ఈ ఘటనను న్యాయవ్యవస్థపై దాడిగా పేర్కొన్నారు.

దాడిని ఖండించిన మోడీ

సిజెఐపై దాడిని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఖండించారు. "సిజెఐ జస్టిస్ బిఆర్ గవాయ్‌తో ఫోన్‌లో మాట్లాడాను. సుప్రీంకోర్టు ప్రాంగణంలో జరిగిన ఈ ఘటన.. ప్రతి భారతీయుడినీ ఆగ్రహానికి గురిచేసింది. సమాజంలో ఇటువంటి దుశ్చర్యలకు చోటు లేదు. అటువంటి పరిస్థితుల్లోనూ ఆయన ప్రశాంతంగా వ్యవహరించడం ప్రశంసనీయం. న్యాయ విలువలు, రాజ్యాంగ స్ఫూర్తిని బలోపేతం చేయడం పట్ల ఆయన నిబద్ధతకు ఇదే నిదర్శనం" అని ప్రధాని మోడీ ఎక్స్‌లో పోస్టు చేశారు.

స్వతంత్ర న్యాయవ్యవస్థపై బహిరంగ దాడి : ఐలు

ఈ ఘటన సుప్రీంకోర్టు, సాధారణంగా స్వతంత్ర న్యాయవ్యవస్థపై జరిగిన బహిరంగ దాడిగా ఐలు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బికాస్ రంజన్ భట్టాచార్య, పివి సురేంద్రనాథ్ పేర్కొన్నారు. దీనిని వికృత మనస్తత్వం కలిగిన వ్యక్తి చేసిన చర్యగా పరిగణించలేమని, దేశంలో న్యాయ వ్యవస్థ, దాని స్వతంత్రత, న్యాయ సమీక్ష శక్తి, లౌకికవాద భావనపై కొన్ని వర్గాల నుండి వ్యవస్థీకృతమైన, దుర్మార్గపు దుర్భాషలతో సాగుతున్న ప్రచారంలో భాగంగా చూడాలని అన్నారు. ఇది దేశ మనస్సాక్షిని దిగ్భ్రాంతికి గురిచేస్తుందని, దేశంలో "నాథురామ్ మనసు" పథాన్ని గుర్తు చేస్తుందని విమర్శించారు. ఇది న్యాయ వ్యవస్థపైనే కాకుండా రాజ్యాంగంపై కూడా జరిగిన దాడి అని పేర్కొన్నారు. ఈ ఘటనను క్షుణ్ణంగా దర్యాప్తు చేయాలని, నిందితుడు, తన వెనుక ఉన్న వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనను ప్రజాస్వామ్యబద్ధంగా, శాంతియుతంగా ఖండిస్తూ నిరసనలు తెలపాలని పిలుపు ఇచ్చారు.

న్యాయవాదిని సస్పెండ్ చేసిన బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా

నిందితుడు కిషోర్ రాకేష్‌ను తక్షణమే సస్పెండ్ చేసినట్లు బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బిసిఐ) ప్రకటించినట్లు లైవ్ లా నివేదించింది. విచారణ కొనసాగుతున్న సమయంలో న్యాయవాది రాకేష్ కిషోర్ చర్య కోర్టు గౌరవానికి విరుద్ధంగా ఉందని, ఆయన అడ్వకేట్స్ చట్టం–1961, బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా నిబంధనల ప్రకారం వృత్తిపరమైన ప్రవర్తనా నియమాలను స్పష్టంగా ఉల్లంఘించారని బిసిఐ ఛైర్‌పర్సన్, సీనియర్ న్యాయవాది కుమార్ మిశ్రా చెప్పారు. సస్పెన్షన్ కాలంలో దేశంలోని ఏ కోర్టు, ట్రిబ్యునల్, అథారిటీలో వాదించేందుకు, ప్రాక్టీస్ చేయడంపై నిషేధం విధించినట్లు తెలిపారు.

విద్వేష ప్రచారమే కారణం?

ఖజురహోలోని ఏడు అడుగుల విష్ణు విగ్రహాన్ని పునర్ ప్రతిష్టించాలని దాఖలు చేసిన పిల్‌ను విచారించేందుకు సుప్రీంకోర్టు తిరస్కరించింది. అదో ఆర్కియాలజీ సైట్ అని, దానికి ఎఎస్ఐ పర్మిషన్ అవసరం ఉంటుందని ఆ కేసులో సిజెఐ వ్యాఖ్యానించారు. దీనిపై ఇంకా వాదనలు కొనసాగిస్తుండగా, విష్ణువుకు భక్తుడినని చెబుతున్నారు కదా! ఆయననే ప్రార్థించండని సిజెఐ వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలపై విషం చిమ్ముతూ మతోన్మాదులు సోషల్ మీడియాలో ప్రచారం చేశారు. రెండు రోజుల తరువాత ఓ కేసులో సిజెఐ స్పందిస్తూ తానే మతాన్ని అమర్యాదపరచలేదన్నారు. అన్ని మతాలను గౌరవిస్తానని, కేవలం సోషల్ మీడియాలోనే తన వ్యాఖ్యలు ప్రచారం అయినట్లు ఆయన పేర్కొన్నారు. కేంద్రప్రభుత్వం తరపున సోలిసిటర్ జనరల్ తుషార్ మెహతా స్పందిస్తూ...సోషల్ మీడియాల్లో కొన్ని సందర్భాల్లో ప్రతిచర్యలు భిన్నంగా ఉంటాయని అన్నారు.

14 మంది చిన్నారుల మృతిపై విచారణకు సిట్

- డాక్టర్ అరెస్టు, సిరప్ తయారీ సంస్థపై కేసు

భోపాల్ : మధ్యప్రదేశ్‌లో విషపూరిత దగ్గు సిరప్ తీసుకోవడంతో 14 మంది చిన్నారులు మృతి చెందిన ఘటనపై విచారణకు ఆ రాష్ట్ర పోలీసులు ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేశారు. చిన్నారుల ఆరోగ్యానికి సంబంధించి నిర్లక్ష్యంగా వ్యవహరించారనే ఆరోపణలతో డాక్టర్ ప్రవీణ్ సోనిని అరెస్టు చేశారు. కోల్డ్రిఫ్ దగ్గు సిరప్ తయారు చేసిన సంస్థపై కేసు నమోదు చేశారు. రాష్ట్రంలోని చింద్వారా ప్రాంతంలో ఈ దగ్గు మందు తీసుకోవడం ద్వారా మూత్ర పిండాల వైఫల్యం సంభవించి 14 మంది చిన్నారులు మృతి చెందడం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. మరణాలకు కారణమైన కోల్డ్రిఫ్ సిరప్‌ను తమిళనాడులో కాంచీపురంలోని శ్రేసన్ ఫార్మాస్యూటికల్ సంస్థ తయారు చేసింది. ఈ మందు వాడటం ద్వారా దాదాపు నెల రోజుల నుంచి చిన్నారులు ప్రతికూల ప్రభావాలను ఎదుర్కొంటున్నప్పటికీ డాక్టర్ ప్రవీణ్ సోని ఈ సిరప్‌ను సూచించాడని పోలీసులు ఆరోపిస్తున్నారు. మృతి చెందిన చిన్నారుల్లో 11 మంది పరాసియా సబ్‌డివిజన్‌కు, ఇద్దరు చింద్వారా పట్టణానికి, ఒకరు చౌరాయ్ తహసీల్‌కు చెందినవారు. ఈ మరణాలపై విచారణకు పరాసియా సబ్ డివిజనల్ ఆఫీసర్ ఆఫ్ పోలీస్ జితేంద్ర సింగ్ జాట్ నేతృత్వంలో 12 మంది సభ్యులతో సిట్ ఏర్పాటు చేసినట్లు చింద్వారా అదనపు కలెక్టర్ ధీరేంద్ర సింగ్ తెలిపారు.

అలాగే, ఈ సిరప్ వాడి అనారోగ్యం పాలైన మరో ఎనిమిది మంది చిన్నారుల్లో నలుగురు నాగ్‌పూర్, ఒకరు ఎయిమ్స్, మరో ముగ్గురు ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారని చెప్పారు. అలాగే, మరోవైపు రాష్ట్రంలోని బెతూల్ జిల్లాలో ఈ సిరప్ వాడి మరో ఇద్దరు చిన్నారులు, రాజస్థాన్‌లో ముగ్గురు మరణించినట్లు వార్తలు వస్తున్నాయి. దీంతో ఈ కోల్డ్రిఫ్ సిరప్‌పై తమిళనాడు ప్రభుత్వం శుక్రవారమే నిషేధం విధించింది. మధ్యప్రదేశ్ ప్రభుత్వం కూడా ఇదే నిర్ణయం తీసుకుంది. ఈ సిరఫ్‌ను, మృతులైన చిన్నారులను నుంచి తీసుకున్న నమూనాలను పూణెలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ వైరాలజీకి పంపారు. వీటిపై పరీక్షలు జరుగుతున్నాయి.

అత్యున్నత న్యాయ కార్యాలయంపై దాడి : స్టాలిన్

చెన్నయ్ : సిజెఐపై దాడిని తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ తీవ్రంగా ఖండించారు. ఈ దాడిని "మన ప్రజాస్వామ్యంలో అత్యున్నత న్యాయ కార్యాలయంపై దాడి"గా అభివర్ణించారు. "గౌరవనీయులైన సిజెఐ దయ, ప్రశాంతత, ఉదారంగా స్పందించిన విధానం సంస్థ యొక్క బలాన్ని చూపిస్తుంది. ఈ సంఘటనను మనం తేలికగా తీసుకోకూడదు' అని ఎక్స్‌లో పోస్ట్ చేశారు. దాడికి పాల్పడిన వ్యక్తి వెల్లడించిన కారణం "మన సమాజంలో అణచివేత, క్రమానుగత మనస్తత్వం ఇంకా ఎంత తీవ్రంగా ఉందో చూపిస్తుంది" అని తెలిపారు.

జీవన సౌరభం

సాధకులు ఎప్పుడూ వైఫల్యం పొందిన చోట నుంచే విజయం సాధించడం ప్రారంభిస్తారు.

మీకోసం

నెయ్యి త్వరగా పేరుకుపోకుండా ఉండాలంటే మీగడ కట్టేటప్పుడు కొద్దిగా నీళ్లు చల్లాలి.

మణుల మూట!

నిజము గనుట కొరకు నీలోన యోచించు
తెలిసి నిజము విడిచి కలత పడకు
బొరియ నింపకుండ చెరువు రూపము లేదు
మనన జేయు మాట మణుల మూట!

ఖలుడు గాయు కాపు కలుగనీదు ఫలము
ఎంచి తగిన వారి నుంచ దగును
తరమలేదు దోమ చెరుకు నేనుగు మేయ
మనన జేయు మాట మణుల మూట!

బాధ గలుగజేయ పరుల తరము గాదు
నీకు నీవు దాడి నెరపు కొనకు
చేప గాలమందు చెరబడు నీరీతి
మనన జేయు మాట మణుల మూట!

సమయముండు తుదకు సహనము గలిగిన
వేచి చూచి తగిన వివర మెరుగు
కొంగ వేచి యుండి మింగదా మీనాలు
మనన జేయు మాట మణుల మూట!

తరుగజేయు పనిని తగిన సాధనముండి
పదును లేని పలుగు పనికి చేటు
నూతి నెటుల దొలుచు నునుపైన మొనసూది
మనన జేయు మాట మణుల మూట!

– డా.పోతగాని సత్యనారాయణ,
91825 31202.



కనిపెట్టండి

పిల్లలూ, ఇక్కడ ఉన్న మూడు చేపల్లో ఒకదానికి సంబంధించిన గిఫ్ట్ ఎదురుగా ఉంది. అది ఏ చేపదో మీరు కనిపెట్టండి.. చూద్దాం.

నేను గీసిన బొమ్మ

ఎస్.సిహెచ్.ఎన్.వి.ఎస్. బ్రహ్మణి, 9వ తరగతి, ఎంజెపిఎపిబిసిడబ్ల్యుఆర్ బాలికల స్కూలు, సీతంపేట, కోయగూడెం మండలం, ఏలూరు జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

అమ్మాయి చదువు ...

‘అమ్మాయి చదువుకుంటే ప్రయోజనం లేదు. తనకి పెళ్లి చేసి అత్తారింటికి పంపితే సంతోషంగా ఉంటుంది’ అన్న ధోరణి ఇంట్లో, బయట ఎదురైతే ఆ ఆడపిల్ల చదువుకునే అవకాశం ఉందా? మహారాష్ట్రకి చెందిన త్రివేణి ఆ అపనమ్మకాన్ని వమ్ము చేసింది. ‘తను చదువుకునే అవసరం లేద’న్న సమాజానికి గొప్ప మార్గదర్శిగా నిలిచింది. ప్రతిష్టాత్మకమైన లండన్ యూనివర్శిటీలో ఎంఎస్‌సి ఫ్రీ సీటు సంపాదించిన ఏకైక మరాఠి యువతిగా తన పేరుని చిరస్థాయిగా నిలుపుకుంది.

పదిరోజుల క్రితమే త్రివేణి లండన్ యూనివర్శిటీకి చేరుకుంది. బ్రిస్టల్ యూనివర్శిటీ దగ్గర తను తీసుకున్న ఫొటోని సోషల్ మీడియాలో షేర్ చేయడంతో త్రివేణి సాధించిన ఘనత ప్రపంచానికి తెలిసింది.



త్రివేణి మురికివాడల్లో పెరిగింది. ఆడపిల్లకి చదువు వద్దని నిత్యం తగువులాడే తండ్రితో ఎన్నో వేధింపులు ఎదుర్కొంది. తండ్రి మాటలు పెడచెవిన పెడుతోందని ఇరుగుపొరుగు, బంధువులు నానా మాటలు అనేవారు. అయినా త్రివేణి చదువుని ఆపలేదు. తనకి అండగా అమ్మ నిలిచింది. ‘బిడ్డ భవిష్యత్తు బాగుండాలంటే చదువొక్కటే మార్గమ’ని ఆ తల్లి గ్రహించింది. ఆ దిశగా తనని ప్రోత్సహించింది.

అమ్మ ప్రోత్సాహంతో త్రివేణి బాగా చదివింది. పదో తరగతిలో 80 శాతం, ఇంటర్‌లో 63 శాతం మార్కులు సాధించింది. తన చదువు గురించి త్రివేణి ఏం చెబుతుందంటే.. ‘నేను పాఠశాల విద్యని మరాఠీ భాషలోనే చదివాను. ఆ తరువాతే ఇంగ్లీషు మీడియంలోకి మారాను. ప్రభుత్వ బడిలోనే చదువుకున్నాను. నాతోటి పిల్లలు చదువుకునేందుకు అవసరమైన పుస్తకాలు, పెన్నులు, బ్యాగుల కోసం తల్లిదండ్రులపై ఆధారపడుతుంటే నేను మాత్రం స్వయంగా వాటిని సమకూర్చుకునేదాన్ని. సెలవుల్లో పిల్లలందరూ ఎంజాయ్ చేస్తుంటే నేను డబ్బులు సంపాదించేందుకు రకరకాల పనులు చేసేదాన్ని. అలా నా చదువుకి నేనే డబ్బులు సంపాదించుకునేదాన్ని. ఆడపిల్లలు చదువుకోవాలి. వాళ్ల కాళ్లమీద వాళ్లు నిలబడేలా, ఆర్థికంగా ఎదగాలి. నేను ఎదిగిన తీరు చూస్తే నన్ను ఎంతో ద్వేషించిన మా నాన్న బతికుంటే తప్పకుండా సంతోషించేవాడు. తనలో మార్పు కూడా వచ్చేదే’ అంటున్న త్రివేణి నాన్న మూడేళ్ల క్రితమే చనిపోయాడు. 12వ తరగతి పూర్తి చేసిన త్రివేణి బెంగుళూరులోని అజీమ్ ప్రేమ్ యూనివర్శిటీలో ఫిజిక్స్ అండ్ డేటా సైన్స్‌లో బిఎస్‌సి పూర్తి చేసింది. ‘ఫీజుల కోసం ఏమాత్రం టెన్షన్ లేకుండా పూర్తి స్కాలర్‌షిప్‌తో అది చదివాను. ఇదంతా అమ్మ సహకారం వల్లే సాధ్యమైంది. ఎప్పుడూ నాకు తోడుగా నిలబడిన అమ్మ, నాన్న నుండి, సమాజం నుండి ఎన్నో అవమానాలు పడింది. అయినా ధైర్యంగా పోరాడింది. అమ్మే నా బలం’ అని బ్రిస్టల్‌కి చేరుకున్న త్రివేణి తల్లి గురించి ఎంతో గర్వంగా చెబుతోంది.

గుడ్లు ఎక్కువ రోజులు నిల్వ ఉండాలంటే

గుడ్డులో మంచి పోషక విలువలు, ప్రోటీన్స్ ఉంటాయి. అయితే సరైన పద్ధతిలో వాటిని నిల్వ చేసుకోకపోతే త్వరగా పాడైపోతాయి. అలా పాడవ్వకుండా ఎక్కువ రోజులు నిల్వ ఉండాలంటే ఏం చేయాలో చూద్దాం.

- సాల్మెనెల్లా బ్యాక్టీరియా గుడ్ల షెల్, లోపల ఉంటుంది. ఈ బ్యాక్టీరియా పెరుగుదల గది ఉష్ణోగ్రత కంటే చల్లగా ఉన్నప్పుడు ఎక్కువగా ఉంటుంది. ఫ్రిజ్‌లో పెడితే బ్యాక్టీరియా గుడ్డుపైనే కాకుండా మిగతా పదార్థాలపై కూడా వ్యాపిస్తుంది.. అందుకే వీటిని ఫ్రిజ్‌లో పెట్టకూడదు.
- కోడి గుడ్డు ఎక్కువకాలం తాజాగా ఉండాలంటే వాటిని ఎక్కువగా కదపకూడదు. వెడల్పుగా ఉండే భాగాన్ని పైకి, వెడల్పు తక్కువ భాగాన్ని కిందికి వచ్చేలా ఉంచాలి.
- గుడ్ల పైన పెంకుపై కొద్దిగా నూనె రాసి పెడితే, 10 నుండి 12 రోజుల వరకూ తాజాగా ఉంటాయి.
- టిష్యూ పేపర్లలో చుట్టి నిల్వ చేసుకున్నా ఎక్కువ రోజులు తాజాగా ఉంటాయి.

వంకాయలో ఏమున్నాయి?

వంకాయ కూరంటే చాలామందికి ఇష్టం. వంకాయలు తినడం వల్ల ఆరోగ్యానికి చాలా మేలు కూడా కలుగుతుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు.

- వంకాయల్లో విటమిన్ కె, విటమిన్ బి6, పొటాషియం, మాంగనీస్, ఫోలేట్, ఫైబర్ వంటి పోషకాలు ఉన్నాయి.
- వీటిని ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల శరీరంలో కొలెస్ట్రాల్ స్థాయిలు అదుపులో ఉంటాయి.
- వంకాయల్లో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు శరీరంలో ఉండే ఫ్రీరాడికల్స్‌ను నశింపజేస్తాయి.
- వంకాయలను తీసుకోవడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు అదుపులో ఉంటాయి.
- వంకాయలను ఆహారంలో చేర్చుకోవడం వల్ల కంటి సమస్యలు తగ్గడంతో పాటు కంటి చూపు మెరుగుపడుతుంది.
- ఎముకలు ధృడంగా తయారవుతాయి. ఎముకల సాంద్రత పెరుగుతుంది.
- చర్మాన్ని, జుట్టును, గోళ్లను ఆరోగ్యంగా ఉంచడంలో కూడా వంకాయలు సహాయపడతాయి.

‘బ్యాడ్ బాయ్ కార్తీక్’ టీజర్ విడుదల

నాగ శౌర్య ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం ‘బ్యాడ్ బాయ్ కార్తీక్’. తాజాగా ఈ చిత్రం నుండి టీజర్‌ను విడుదల చేశారు. హరీష్ జైరాజ్ సంగీతం అందించారు. ఈ చిత్రానికి రామ్ దేసిన దర్శకత్వం వహిస్తున్నారు. విధి ఈ సినిమాలో హీరోయిన్‌గా నటిస్తున్నారు. వైష్ణవి ఫిల్మ్స్ బ్యానర్‌పై నిర్మాణం జరుపుతున్న ఈ చిత్రం, ఆ బ్యానర్ నుంచి వస్తున్న తొలి సినిమా. త్వరలోనే ఈ సినిమాని ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు చిత్రబృందం ప్రకటించింది.

‘సినీమాయ’ కొత్త పోస్టర్ విడుదల

అనీష్ ఎ అయక్కర, విజయ్, రోహిత్, ఆశా, సస్మిత, మీనాక్షి తదితరులు ప్రధాన తారాగణంగా రూపుదిద్దుకున్న సినిమా ‘సినీమాయ’. రాజాసాగి సత్యనారాయణ రాజు (కుర్రబాబు) నిర్మాతగా, గిరి చిన్నా దర్శకత్వంలో అనఘ దేవి మూవీస్ బ్యానర్‌పై ఈ సినిమా తెరకెక్కింది. దసరా పండుగను పురస్కరించుకుని ఈ సినిమా ప్రచార పోస్టర్‌ను చిత్ర యూనిట్ విడుదల చేసింది. డిఒపి ఎస్.ప్రసాద్, జయసూర్య, ఎడిటింగ్ పి.శ్యామ్‌కుమార్, సంగీతం ప్రమోద్‌కుమార్ పరిసర్ల అందించారు. బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ నిస్సి జస్టిన్ అందించారు.

త్వరలో ఈ సినిమా విడుదల సందర్భంగా చిత్ర యూనిట్ ప్రచార కార్యక్రమాలను నిర్వహిస్తోంది. ‘మంచి సందేశాత్మక చిత్రంగా ‘సినీమాయ’ను తెరకెక్కించాం. సినిమా కష్టాలను మా సినిమా పట్టి చూపుతుంది. సినీ ప్రేక్షకులకు ఖచ్చితంగా మా సినిమా నచ్చుతుంది’ అని దర్శకుడు గిరి చిన్నా, నిర్మాత సత్యనారాయణరాజు తెలిపారు.

నాగార్జున 100వ చిత్రం ‘లాటరీ కింగ్’!

నాగార్జున ప్రస్తుతం తన 100వ చిత్రం కోసం సిద్ధం అవుతున్నారు. తమిళ దర్శకుడు కార్తీక్ ఈ సినిమాకి దర్శకత్వం వహిస్తున్నారు. యాక్షన్ అండ్ కామెడీ ఎంటర్‌టైనింగ్ మూవీగా రాబోతున్న ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్‌తో అన్నపూర్ణ స్టూడియోస్ నిర్మిస్తోంది. ఈ మూవీకి ‘లాటరీకింగ్’ అనే టైటిల్ ఫిక్స్ అయినట్లు సమాచారం.

డిసెంబరు 25న ‘ఛాంపియన్’

రోషన్ హీరోగా ప్రదీప్ అద్వైతం డైరెక్ట్ చేస్తున్న మూవీ ‘ఛాంపియన్’. తాజాగా ఈ చిత్రం విడుదలతేదీ పోస్టర్‌ను మేకర్స్ విడుదల చేశారు. స్వప్న సినిమా, ఆనంది ఆర్ట్స్ క్రియేషన్స్, కాన్సెప్ట్ ఫిల్మ్స్ సంస్థలు సంయుక్తంగా ఈ సినిమాని నిర్మిస్తున్నాయి. పీరియాడికల్ డ్రామాగా తెరకెక్కిన ఈ సినిమాను క్రిస్టమస్ సందర్భంగా డిసెంబర్ 25న విడుదల చేస్తున్నట్లు ప్రకటించారు.

‘కానిస్టేబుల్’ సెన్సార్ పూర్తి

వరుణ్ సందేశ్, మధులిక వారణాసి జంటగా నటించిన సినిమా ‘కానిస్టేబుల్’. జాగృతి మూవీ మేకర్స్ పతాకంపై ఆర్యన్ సుభాన్ ఎస్.కె. దర్శకత్వంలో బలగం జగదీశ్ నిర్మించారు. ఈనెల 10న సినిమా థియేటర్లలోకి రానుంది. ఈ క్రమంలోనే సెన్సార్ పూర్తయ్యింది. యు/ఎ సర్టిఫికెట్ వచ్చింది. ఈ చిత్రం తన కెరీర్‌కు మరో మలుపు అవుతుందని హీరో వరుణ్ సందేశ్ చెప్పుకొచ్చాడు. ‘సెన్సార్ పూర్తి కావడం, ట్రైలర్‌కి వస్తున్న స్పందన చూస్తుంటే సంతోషంగా ఉంది. ఇందులోని ఓ మంచి ఐటమ్ సాంగ్‌ని దసరా సందర్భంగా విడుదల చేశాం. దానికి కూడా మంచి స్పందన రావడం ఆనందంగా ఉంది’ నిర్మాత బలగం జగదీష్ అని అన్నారు.

17న ‘డ్యూడ్’ విడుదల

కథానాయకుడు రంగనాథన్ నటించిన పాన్ ఇండియా మూవీ ‘డ్యూడ్’ ఈనెల 17న విడుదల కానుంది. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మించిన ఈ చిత్రంతో కీర్తిశ్వరన్ డైరెక్టర్‌గా పరిచయం అవుతున్నారు. ‘ప్రేమలు’ వంటి అద్భుతమైన విజయం తర్వాత ప్రదీప్ సరసన మమిత బైజు నటించగా, శరత్‌కుమార్ కీలక పాత్ర పోషించారు. మ్యూజిక్ ప్రమోషన్స్‌లో భాగంగా ఈ సినిమా నుంచి థర్డ్ సింగిల్ ‘సింగారి’ సాంగ్‌ని మేకర్స్ విడుదల చేశారు. సంగీత దర్శకుడు సాయి అభ్యంకర్ స్వర పరచి పాడారు. రామజోగయ్య శాస్త్రి లిరిక్స్‌ను అందించారు. రోహిణి మొల్లేటి, హృదు హరూన్, ద్రవిడ్ డ్ సెల్వం తదితరులు నటిస్తున్నారు. రచన, దర్శకత్వం కీర్తిశ్వరన్, నిర్మాతలు నవీన్ యెర్నేని, వై రవిశంకర్, సిఇఒ చెర్రీ, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ అనిల్ యెర్నేని, సంగీతం సాయి అభ్యంకర్.

తజ్మిన్ బ్రిట్స్ శతకం

- కివీస్‌పై సఫారీల ఘన విజయం
- మహిళల వన్డే ప్రపంచకప్

ఇండోర్ : మహిళల వన్డే ప్రపంచ కప్‌లో దక్షిణాఫ్రికా తొలి విజయం సాధించింది. సోమవారం న్యూజిలాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో సఫారీల జట్టు 6 వికెట్ల తేడాతో గెలిచింది. తొలుత బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ 231 పరుగులకు ఆలౌటైంది. ఈ మోస్తరు లక్ష్యాన్ని సౌతాఫ్రికా 40.5 ఓవర్లలోనే 4 వికెట్లు కోల్పోయి ఛేదించింది. ఓపెనర్ తజ్మిన్ బ్రిట్స్ (101, 89 బంతుల్లో 15 ఫోర్లు, 1 సిక్స్) శతకంతో కదం తొక్కి జట్టుకు అలవోక విజయాన్ని అందించింది. సునే లూస్ (83, 114 బంతుల్లో 9 ఫోర్లు, 1 సిక్స్) కూడా మెరిసింది. న్యూజిలాండ్‌కు వరుసగా ఇది రెండో ఓటమి. తొలుత కివీస్ బ్యాటర్లలో కెప్టెన్ సోఫీ డివైన్ (85, 98 బంతుల్లో 9 ఫోర్లు) భారీ ఇన్నింగ్స్‌తో అలరించింది. బ్రూక్ (45, 37 బంతుల్లో 6 ఫోర్లు), జార్జియా ప్లిమ్మర్ (31), అమేలియా కెర్ (23) పరుగులు చేశారు. సుజీ బైట్స్ (0), మ్యా గ్రీన్ (4), ఇసాబెల్లా (10) నిరాశపర్చారు. సౌతాఫ్రికా బౌలర్లలో మ్లాబా 4, మారిజేన్ కాప్, అయబొంగా ఖాకా, నాడిన్ డి క్లెర్క్, క్లోయ్ ట్రయాన్ ఒక్కో వికెట్ సాధించారు.

భారత్ శుభారంభం

- ప్రపంచ జూనియర్ ఛాంపియన్‌షిప్స్

గువహటి : బిడబ్ల్యూఎఫ్ ప్రపంచ జూనియర్ మిక్స్‌డ్ టీమ్ ఛాంపియన్‌షిప్స్‌లో ఆతిథ్య భారత్ శుభారంభం చేసింది. సోమవారం గువహటిలోని నేషనల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో ఆరంభమైన మెగా ఈవెంట్‌లో భారత్ సహా అగ్ర జట్లు బోణీ కొట్టాయి. రెండో సీడ్ భారత్ గ్రూప్–హెచ్‌లో నేపాల్‌పై 45–18, 45–17తో అలవోక విజయం సాధించింది. ఇదే గ్రూప్‌లో హోరాహోరీగా సాగిన మ్యాచ్‌లో యుఏఈపై శ్రీలంక 30–45, 45–34, 45–44తో మెరుపు విజయం ఖాతాలో వేసుకుంది. 14 సార్లు ఛంపియన్, అగ్రజట్టు చైనా వరుస సెట్లలో ఘనాపై అలవోక విజయం సాధించింది. గ్రూప్ దశలో మెరుగైన ప్రదర్శన కనబరిచిన జట్లు నాకౌట్ దశకు చేరుకుంటాయి.

ప్రపంచ జూనియర్ చాంపియన్‌షిప్స్‌లో ఈ సారి సరికొత్త రూల్స్ అమలు చేశారు. సాధారణంగా పురుషుల, మహిళల సింగిల్స్, డబుల్స్‌తో పాటు మిక్స్‌డ్ డబుల్స్ మ్యాచులు టీమ్ ఈవెంట్‌లో ఉంటాయి. కానీ జూనియర్ చాంపియన్‌షిప్స్‌లో బిడబ్ల్యూఎఫ్ పూర్తిగా కొత్త ఫార్మాట్‌ను అమలు చేసింది. ప్రతి విభాగంలో 9 పాయింట్ల చొప్పున కేటాయిస్తూ.. తొలుత ఏ జట్టు 45 పాయింట్లు సాధిస్తుందో ఆ సెట్‌లో వారినే విజేతగా ప్రకటిస్తున్నారు. ప్రతి సెట్‌లో ఆటగాళ్లను మార్పు చేసుకునే వెసులుబాటు సైతం కల్పించటంతో భారత్ అందరినీ బరిలోకి దింపింది.

ఫైనల్లో హుసాముద్దీన్

- బిఎఫ్ఐ కప్ 2025

చెన్నై : తెలంగాణ స్టార్ బాక్సర్ మహ్మద్ హుసాముద్దీన్ బిఎఫ్ఐ కప్ (బాక్సింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా) ఫైనల్లోకి ప్రవేశించాడు. పురుషుల 60 కేజీల విభాగంలో సర్వీసెస్ తరఫున బరిలోకి దిగిన హుసాముద్దీన్ సోమవారం జరిగిన సెమీఫైనల్లో 5–0తో మితేశ్ దేశ్వాల్ (రైల్వేస్)పై ఘన విజయం సాధించాడు. మెన్స్ 55 కేజీల విభాగం సెమీస్‌లో స్టార్ బాక్సర్ అమిత్ పంగాల్ 1–4తో సహచర సర్వీసెస్ బాక్సర్ ఆశీష్ చేతిలో అనూహ్య ఓటమి చవిచూశాడు. మాజీ యూత్ చాంపియన్లు అంకుశిత, అరుంధతిలు పసిడి పంచ్ విసిరారు. మహిళల 65 కేజీల విభాగం ఫైనల్లో అంకుశిత బోరో 3–2తో పార్థవి (రాజస్తాన్)పై గెలుపొందగా.. అరుంధతి చౌదరి మహిళల 70 కేజీల విభాగం ఫైనల్లో 5–0తో స్నేహపై మెరుపు విజయం సాధించింది. ప్రపంచ చాంపియన్‌షిప్స్ కాంస్య పతక విజేత పర్వీన్ హుడా మహిళల 60 కేజీల విభాగం ఫైనల్లో ప్రియ (హర్యానా)పై 3–2తో గెలుపొంది స్వర్ణం సొంతం చేసుకుంది.



Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68